
ఆంధ్ర సచిత్ర వార
పత్రిక
18-3-66

స్వల్ప ఖర్చుతో హెచ్చు ఉత్పత్తి


టాటా స్టీల్ కర్మాగారములోని ఆరు అధిధమన భ్రాష్ట్రములు (Blast Furnaces) ప్రతి కొద్ది సంవత్సరములకు బాగుచేయవలయును. ఈ పనిని ఉక్కు పనివాండ్రు అంతర పటలములను మార్చుట (Relining) అందురు. ఇది చాల కష్టమైన పని. ఈ పనికి వేలకొలది టన్నుల ఉష్ణ నిరోధక యిటుకలు, ఉక్కు, ఇనుప పోతలు అనేక మైళ్ళ పొడవైన ఎలక్ట్రిక్ తీగెలు మరియు గొట్టములు అవసరము. నిపుణులైన ఇంజనీర్లు, పనివాండ్రు కూడా అవసరము. అడుగడుగునకు ఈ పని యొక్క ప్రతి వివరము ముందుగా ఆలోచించి తరువాత చర్యతీసుకొనబడును. ఇంజనీర్లు, పనివాండ్రు కలసి రాత్రిం బవళ్ళు గడియారమువలె శ్రమపడి ఈ పనిని అతి తక్కువ కాలములో స్వల్ప ఖర్చుతో పూర్తి చేయుదురు.

అనేక సంవత్సరములనుండి ఈ పనిలో టాటా స్టీల్ వారి అనుభవము అభివృద్ధి చెందినది. 1957 లో అధిధమన భ్రాష్ట్రియొక్క అంతర పటలములను మార్చుటకు 99 దినములు పట్టెను. 1963 ఆరంభములో ఈ పనిని 74 దినములలో పూర్తిచేసి అమోఘమైన రికార్డును నెల కొల్పిరి. కాని 6 నెలలలోనే అదే పనిని 64 దినములలో ముగించిరి.

కాని, ఇంతటితో ఈ అభివృద్ధి అంతము కాలేదు. ఏ అంతర పటలములను మార్చుటకు 1957 లో 99 దినములు పట్టెనో ఇప్పుడు ఆ పనిని 57 దినములలో చేసిరి. ఈ విధముగా మిగిల్చిన కాలమును అత్యావశ్యకమైన ఉక్కును ఉత్పత్తి చేయుటకు వినియోగించుదురు.

వీలగునంత తక్కువ కాలపరిమితిలో పనులను మనస్ఫూర్తిగా, విడ తెగని యత్నముతో చేయుట మరియు తదితరమైన రికార్డను నెల కొల్పుటలో కంపెనీవారి లక్ష్యము ఖర్చులను తగ్గించుట, ఉత్పత్తిని హెచ్చించుట.


టాటా స్టీల్



The Tata Iron and Steel Company Limited

JWTTN 2841







MTP1P266 TL.

ఉబ్బసము నివారించు వనమూలిక

ఉబ్బస వ్యాధిని నివారణచేయు ఒక వనమూలిక, రాజస్థాన్‌కు చెందిన రాజకీయ, సాంఘిక నాయకులగు కీ॥ శే॥ శ్రీ శంభూనాథ్ గారి మనుమలగు శ్రీ కేశవ్ మోహన్‌లాల్ గారిచే బీదలకు పంచి పెట్టబడుచున్నది.

ఈ మూలిక శ్రీ శంభూనాథ్ గారికి ఒక సాధువుచే యీయబడి, వారిచే 40 సం॥ పైగా రోగులకు ఉచితముగా పంచి పెట్టబడినది. వారి నిస్వార్థసేవకు ప్రతిఫలముగా ప్రభుత్వ ఉపకార వేతనము ఈయబడినది. కాని వారు ఈ కార్యమును తమ మనుమలకు వప్పగించి సన్యసించుటచే వారి మనుమలు ఈ కార్యమును నిర్వహించుచున్నారు. కావి, ఉదారులగు ధనికులు ఈ యుత్తమ కార్యసాధనకై విరాళము లొసగ పిలిసినదని అభ్యర్థించుచున్నారు. ఈ మూలికను కేవలము 3 మోతాదులు పుచ్చుకొన్నంతనే అనేకమంది ఉబ్బసవ్యాధి పీడితులు, దీర్ఘకాల రోగులతో సహా, స్వస్థతపొందిరి. రోగబాధితులు ఉ మూలికకొరకు ఇంగ్లీషులో వ్రాయుండి.

SRI KESHAV MOHANLAL
of 5, Haralaldas Lane,
Jorabagan Park, Calcutta-6

ఉబ్బసవ్యాధి పీడితులకొరకై రోగుల నుండి, డాక్టర్లనుండి మెడికల్ ప్రాక్టీషనర్లనుండి విరాళముల వలన ప్రచురింప బడినది.

నెలకు రు. 400 సంపాదించండి

డ్రాయింగ్ & పెయింటింగ్ గైడ్

ఫ్రీ హాండ్ డ్రాయింగ్, స్టెన్సిల్, కమర్షియల్ ఆర్ట్, కలర్ స్కీములో పెయింటింగ్, సైన్‌బోర్డుల తయారి, లెటరింగ్ వగైరా, యితర డ్రాయింగ్ పనులు, నేర్చుకొనుటకు ముఖ్య పాఠములు, మరియు 400 పటములు గలపూర్తిగైడ్. 2 వ ప్రచురణ. ధర రు. 6/- పోస్టేజి రు. 1-25 అదనం. సచిత్ర ట్రాన్‌సిస్టర్ రేడియోగైడ్ చిన్నపెట్టబడితో ట్రాన్‌సిస్టర్ తయారుచేయు పద్ధతి రు. 5/-

VANDANA BOOK DEPOT,
(AF) Rafatganj, Aligarh (U. P.)

నెలకు రు. 350/- సంపాదించండి

ఎంబోసర్లు, రేడియోలు, కుట్టు మిషీనలు, తాళములు, ఎలెక్ట్రిక్ సామానులు వగైరాలకు ఆర్డరు సేకరించుటకు నెలకు జీతం రు. 250/-మరియు టి. ఏ. లేక కమిషన్‌పద్ధతిమీద ట్రావెలింగ్ ఏజెంట్లు కావలెను. పట్టణము లేక గ్రామప్రాంతములో పనిచేయువారికి సైకిలు ఉచితముగా యివ్వబడును. రు. 12-85 పంపిన స్టేషనరీవగైరా నమూనాలు పంపబడును.

Arvind Agencies (WAT-12),
P. B. 1408, Delhi-6.

ఉత్తరాలు

వ్యాసాలు

18—2—66 సంచికలో నన్నెక్కువగా ఆకర్షించినది భానుమతి, నారాయణరెడ్డి, ముప్పాళ రంగనాయకమ్మగారలతో ఇష్టాగోష్ఠి. వీరిని గురించి వివరాలు తెల్పిన బాసాని సుదర్శనరెడ్డిగార్కి అభినందనలు.

జి. సంజీవరావు (విశాఖపట్టణం)

* * *

"నేను సినీ పరిశ్రమలో చేసిన కృషికి రాష్ట్రపతి ప్రకటించిన పద్మశ్రీ బిరుదు కన్న అకాడమీవారు నా గ్రంథానికిచ్చిన బహుమతిని మిన్నగా భావిస్తున్నాను" అని శ్రీమతి భానుమతిగారినోటనే వినరావటం పాఠకులగు మా దురదృష్టం.

ఆమె 1940 నుండీ సాహిత్యాభిలాష కలిగి యుండవచ్చు. రచనలు చేయవచ్చు. కాని, రచనల్లో ఆమెగారే అన్నట్లు 'హ్యూమర్' తప్ప ప్రబోధాత్మకమైన నీతి యేమియు కానరాదు. ఇదే సాహిత్య సేవయైన నేను క్షమార్హుణ్ణి.

సినీ పరిశ్రమలో ముఖ్యంగా మధుర గాయనిగా ఆమె కీర్తి దిశ దిగాంతాలకు వ్యాపించివుంది. పండిత పామరులు ఆమెను గంధర్వ గాయనిగా శిఖరాగ్రమున ఆరాధిస్తారు. ఈ పరిధిలో ఆమె జయ పతాక మేరు నుండగా సాహిత్య ప్రపంచంలో మాత్రం అట్టడుగుననే ఉంది.

అదృష్టం కొద్దీ అకాడమీ అవార్డు రాగా అర్హత కొద్దీ 'పద్మశ్రీ' పట్టం వచ్చిందని నా నమ్మకం. ఒకసారి సంపాదించిన 'అర్హత' జీవితాంతం ఉంటుంది. కాని అదృష్టంమాత్రం వస్తూపోతూ ఉంటుంది. ఇట్టి దానిని పట్టుకొని తన అర్హతను విస్మరించటం తనను తానే కించ పరచుకోవటమవుతుంది. ఆమె సాహిత్య ప్రపంచంలో సుస్థిర స్థానం పొందాలంటే ఇతోధిక శ్రమచేసి అకాడమీ వారిచ్చిన బహుమానానికి తాను తగుదునన్న అభిప్రాయాన్ని కలిగించవలసి వుంటుంది. దీనికి అవిరళ కృషి అవసరం. రానున్న కాలంలో సాహిత్య ప్రపంచంలో మణిపూసయై, పండు ముదుసలియైనా మళ్లీ సాహిత్య అకాడమీ బహుమతి పొంది మన అనుమానాలను పటాపంచలు చేయగలరని ఆశిద్దాము. అప్పటివరకు ఆమె సినీ పరిశ్రమలో చేసిన సేవకు, ఆమె గంధర్వగానానికి అత్యుత్తమమైన విలువ నివ్వక తప్పదు.

టి. వి. ఎన్. రావు (కర్నూలు)

కథలు

"సౌజన్యానికి, చంచల స్వభావానికి, సంకుచితత్వానికి ప్రతిబింబాలైన రాబర్ట్, రాజశేఖర్, రాజేశ్వరి పాత్రల ద్వారా ఆత్మీయత వ్యక్తుల మనస్తత్వాన్ననుసరించియే గాని, కులం, అంతస్థుల్లాంటివేవీ దోహద మొనర్చవనే వాస్తవికతను వ్యక్తం చేసిన కథానిక 'మంచుతెర' చాలా బాగుంది.

కట్టెకూల యాదగిరిరావు (హైదరాబాద్)

సీరియల్

ఈవారం పత్రికలో కథలు బాగున్నాయి. సీరియల్ 'కరుణ' ఉత్తమంగా నడుచుచున్నది. దయచేసి ప్రతివారం కొద్దిగా ఎక్కువ పేజీలలో సీరియల్ వేస్తే బాగుండును. 'పల్నాట్టియుద్ధము' సినిమా కథ సీరియల్ రూపంలో ప్రచురించినందులకు ధన్యవాదములు.

ఎన్. నరసింహారావు, జాన్సి (తిరుమల)

ఆంధ్రులలో అడుగంటుతున్న ఆసక్తి...?

శ్రీ శర్మ (కలకత్తా) గారి ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ గురించిన ఉత్తరం చదివాను. వారి విమర్శను పూర్తిగా త్రోసి రాజనడానికి వీలులేదు. ఐనా, ఆంధ్రరాష్ట్రంనుంచి యే ముగ్గురో నలుగురో మాత్రమే కాంగ్రెస్‌లో పాల్గొన్నారంటే అందుకు అనేక కారణాలున్నాయి. మొదటిది—చాలామంది సైంటిస్టులు ప్రభుత్వ సంస్థలలో పని చేస్తున్నారు. దేశంలోని అత్యవసర పరిస్థితి వలన ఆయా సంస్థలనుండి రాలేకపోయి ఉంటారు. రెండవది ఆంధ్రరాష్ట్రంనుండి వచ్చిన వాళ్లే ఆంధ్రులనికాదు. ఆ మాటకువస్తే ఆంధ్రేతర ప్రాంతాలలోనే ఆంధ్రులు బ్రహ్మాండమయిన రీసెర్చ్ చేస్తున్నారు (శర్మగారు కూడా!) మూడవ కారణం—ఆర్థిక పరిస్థితి! ఉత్సాహవంతులు కొంతమంది ముందుకు వచ్చినా, చాలీ చాలని స్కాలర్‌షిప్స్‌తో, ఫండ్స్‌తో వారం పది రోజులు చండీగర్‌వంటి చలి ప్రాంతంలో గడపడమంటే మాటలతో పనికాదు. నాలుగవ కారణం—ఆంధ్ర సైంటిస్టులు వేదికలెక్కి తాము చేసిన రీసెర్చి గురించి ధైర్యంగా నలుగురికీ తెలియజెప్పడానికి సిగ్గు(!) పడతారనుకుంటాను. అందుకు నిదర్శనం సైన్స్ కాంగ్రెస్‌వారు ప్రచురించిన మూడవ భాగం—అబ్‌స్ట్రాక్ట్స్ పుస్తకంలో బోలెడంతమంది తెలుగువారి పేర్లు, వారు చేస్తున్న రీసెర్చ్‌తో సహా ఉన్నాయి.

ఇకపోతే వచ్చిన డెలిగేట్స్ సైట్ సీయింగ్ కోసం వెళ్ళడం పొరపాటనడం సమంజసంకాదు. ఏమంటే పాల్గొన్న డెలిగేట్స్‌కు అన్ని 'సబ్జెక్ట్స్'లోనూ పరిచయం ఉండదు. అలాంటప్పుడు తమకు సంబంధించిన మీటింగ్స్‌లో పాల్గొని మిగత వేళలలో సైట్ సీయింగ్‌కు వెళ్ళడంలో తప్పేముంది? చాలా దేశాలలో కమిటీవారే అక్కడకు వచ్చిన డెలిగేట్లకోసం 'సైట్ సీయింగ్' ఏర్పాటు చేస్తారు.

—హేమాద్రి. (పూనా)

వనితాలోకం

11—2—66 వ తేదీ పత్రికలో "మనుష్యులు, మమతలు" వ్యాసం చూసి చాలా రోజులకు వనితాలోకంలో పెద్ద వ్యాసం పడింది అని సంతోషించాను. కాని పూర్తిగా చదివిన తరువాత నిరుత్సాహపడ్డాను. ఒక ప్రాణికి మరొక ప్రాణిమీద వుండే 'ప్రేమ' అనురాగాలను మమతలు అంటారు. కాని ప్రాణం లేని వస్తువులమీదవున్న ఇష్టాన్ని మమత అనరు. అట్లా ఎవరు వాడగా నేను వినలేదు. నాకు కుట్లు అంటే మమత. నలగకుండా చీరవుంటే మమత అని తెలుగుభాషలో ఎవ్వరు వాడగా నేను వినలేదు. 'మమత'కు అర్థం ప్రీతి, లేక ఇష్టం అని కావచ్చును. కాని ఆ ప్రయోగం కొంచెం ఎబ్బెట్టుగా వుంది. బహుశా రచయిత్రి "రైము" కుదరడానికి అట్లావాడారు యేమొ.

ముఖ్యంగా ఈమధ్య వనితాలోకంలో వ్యాసాలు రాసే రచయిత్రులు (ఎక్కువగా రచయితలకన్న రచయిత్రులే ఈ రకం సంభాషణ జరుపుతున్నారు.) "మా స్నేహితురాలు ఇట్లా అన్నది. మావారు నన్ను అట్లా ఎగతాళి పట్టిస్తున్నారు. మా అమ్మ అట్లా కోప్పడింది. మా బాబాయి అట్లా చేసాడు" మొదలైన ప్రసంగాల ధోరణిలో వ్యాసాలు వ్రాస్తున్నారు. కాని అది అంత ఆరోగ్యకరమైన పద్ధతి కాదు. ఈ పద్ధతి చదువరులను ఆకట్టుకోదు సరి కదా, చదివేదానిమీద విసుపు జనింప చేస్తుంది. అట్లా అని సంభాషణ ధోరణిలో రాయకూడదు అని నా అభిప్రాయంకాదు. వ్యాసం మొత్తంమీద ఒకటి, రెండుచోట్ల అయితే పరవాలేదుకాని, అంతా అట్లాగే సాగితే రచయిత్రి చెప్పదలుచుకొన్నది మాటిగా చెప్పలేదు.

రచయిత్రిని విమర్శించడం నా అభిమతం కాదు. చెప్ప తలుచుకొన్నది సున్నితమైన హాస్యంతో ఉండాలే కాని, అతి భరించలేము. పొదుపు సర్వత్రా కావలసినదేను. ఏమైనా రచయిత్రి పాత బట్టల పొదుపు చక్కగా రాసారు.

శ్రీమతి లక్ష్మి. (రాబర్ట్సన్‌పేట)

సవరణ

11—3—66 సంచిక 6 వ పేజీలోని 'వినాయక దామోదర్ సావర్కార్ అస్తమయం'లో కీర్తిశేషులైన సావర్కార్ జన్మించిన సంవత్సరం 1863గా పొరపాటున ప్రచురింపబడినది. పాఠకులు దాన్ని 1883గాగమనించ కోరుతున్నాము.—సం॥

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం: 18—3—'66

విశ్వావసునామ సం॥ ఫాల్గుణ మాసం బ॥ ద్వాదశి

సంపుటము: 58 సంచిక: 29

స్థాపితము:
1908

*

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు:
శివలెంక రాధాకృష్ణ

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీథి, మద్రాసు-1

క్రొత్తరేట్ల ననుసరించి 14—1—1966 మొదలు ఆంధ్రసచిత్ర వారపత్రిక చందా వివరాలు.

భారతదేశం

	పోస్టుద్వారా
	రూ. పై.
సంవత్సర చందా	19.25
6 మాసముల చందా	9.62
3 మాసముల చందా	4.80

ఇతర దేశాలకు
ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	24.50
అర్ధసంవత్సర చందా	12.25

రచయితలకు విజ్ఞప్తి

తమ రచనలతో కాక విడిగా స్టాంపులు పంపే వారి రచనలు తిప్పి పంపడం సాధ్యం కాదు. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే అవకాశం కూడా లేదని గుర్తించ ప్రార్థన

సం॥

మనలో మాట

దక్షిణ దేశంలో దేవాలయాలు అసంఖ్యాకంగా వున్నాయి. అలాంటి వాటిల్లోవే నామక్కల్ ఆలయాలు కూడా. ఇందుకు సంబంధించిన వ్యాసం (మధ్య పేజీలలో) వ్రాసిన శ్రీ ఎన్. రామకృష్ణ మా పాఠకులకు పరిచితులే.

* * *

అమెరికా సహాయం, పి. ఎల్. 480—మొదలయిన వాటిని గురించి శ్రీ శ్రీకృష్ణ యీ వారం 'ఢిల్లీలేఖ' వ్రాశారు. ఇండియాకు సహాయాన్ని అంద చేసేందుకు ప్రపంచ దేశాలు కొన్ని ముందుకు వస్తున్న తరుణం యిది. అందుకు సంబంధించిన సాధక బాధకాలను 'ఢిల్లీ లేఖ' లో చదువవచ్చు.

* * *

కొత్త నటి భారతి ఫొటో, యీ వారం ముఖచిత్రంగా వేశాము. ఈ వర్ధమాన నటిని గురించిన చిన్న వ్యాసం 54 వ పేజీలో చూడవచ్చును.

* * *

కారణాంతరాలవలన, యీ వారం వైజ్ఞానిక గాథాశతి పడలేదు!

* * *

వచ్చేదే ఉగాది ప్రత్యేక సంచిక. మా పాఠకులకు ప్రత్యేకమైన రచనలను అందచేయాలనే కృషి జరుగుతోంది. ఇందులో చాలావరకు సిద్ధంగా వున్నాయి. ఎక్కువ పేజీలతో వెలువడే యీ సంచిక వెల మామూలే!

విషయానుక్రమణిక

ముఖచిత్రం: నటి భారతి (ఫొటో: ప్రభాకర్)



మరు మరీ చికలాగ కనిపిస్తున్నదే?
గినీ అధ్యక్షపదవి
ఘనా అధ్యక్షపదవి
బ్రతకడం కన్నా చావడమే మెరుగు కాదూ?
ప్రజ
కేంద్ర బడ్జెట్ విపరీతమైన పన్నులు
తాష్కెంట్ చికిత్స జరిగినా నీగుండెలో మార్పు లేదే?
దహొమీలో విప్లవం
కాంగోలో విప్లవం
ఎగువ వోల్టాలో విప్లవం
చాదాలో విప్లవం
ఉగాండాలో విప్లవం
ఘనాలో విప్లవం
అల్జీరియాలో విప్లవం
నైజీరియాలో విప్లవం

న్యూ ఢిల్లీ లేఖ

ఆహారం!

అమెరికా అందచేస్తున్న సహాయం కొనసాగాలనీ, ఆహార ధాన్యాలు ఆ దేశం నుంచి తరలి రావాలని అంటూ మన ప్రభుత్వాధినేతలు ప్రారంభించిన ఉద్యమం చూస్తుంటే అలీన విధానంయొక్క అర్థం మారిపోయిందా అనిపిస్తున్నది. కమ్యూనిస్టు సంస్థలు కొన్ని ఐశ్వర్యంతో తులతూగే యీ రోజుల్లో అలీన విధానానికి పదును పోతున్నది.

ఆహారమంత్రి ప్రసంగం

'ఇండియాకోసం ఆహారం' అనే ఉద్యమంలో ఒక భాగంగా యిటీవలనే మన ఆహార మంత్రి 34 మంది రాయబారుల నుద్దేశించి ప్రసంగించారు. దాదాపు ఎనిమిది అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా యీ సభలో పాల్గొన్నారు.

అమెరికా ప్రభుత్వ విదేశాంగ కార్యదర్శి శ్రీ డీన్‌రస్క్ గతవారం వాషింగ్టన్‌లో మాట్లాడుతూ, ఇండియాకు సహాయం చేసే కార్యక్రమంలో, అమెరికాతో మరో 18 దేశాలు చేతులు కలిపాయని తెలిపారు. ఇండియాలోవుండే నూరు మిలియన్లమందిని పీడిస్తున్న యీ కరువు చక్క దిద్దేందుకు కృషి జరుగుతోందనీ, యీ మొత్తం సహాయం విలువ షుమారు 70 మిలియన్ల డాలర్లు ఉంటుందని అంచనా వేశారు. దాదాపు 6.5 మిలియన్ల టన్నుల ఆహారాన్ని పంపుతున్నట్లు అమెరికా ఇండియాకు వాగ్దానం చేసిందని ఆయన అన్నారు. కమ్యూనిస్టుల దురాక్రమణను ప్రతిఘటించటానికి గాను ఇండియా గైకొన్న దృఢ విశ్వయాన్ని ఆయన అభినందించారు.

దేశ దేశాల దగ్గర ఇండియా బిచ్చమెత్తటం మనేది, అమెరికాతోనే ఆరంభం అయింది.

నిపుణుల ఉవాచ:

అమెరికా అధ్యక్షుడు గత సంవత్సరంలో ఇండియాకు నిపుణులను కొందరిని పంపారు. వారు తమ నివేదికలో:

“అమెరికా ఉత్పత్తి చేస్తున్న మొత్తం గోధుమలను, ఇండియా అవసరాలను దృష్టిలో ఉంచుకొనిచూస్తే యీనాడు అమెరికా పంపుతున్న గోధుమ చాలా ఎక్కువగానే ఉంది. అమెరికాలో పండే మొత్తం గోధుమలలో ఐదింట రెండు వంతులు ఆ దేశానికి కావాలి. ఐదింట ఒక వంతు ఇండియాకు వస్తున్నాయి. మిగిలినవి యితరత్రా ఖర్చు అయిపోతున్నాయి. ఇండియాలో సప్లయి అవుతున్న ఆహార ధాన్యాలలో ఎనిమిది శాతం అమెరికా గోధుమలే.” “1950 లో ఇండియా ఆహారపు దిగుమతుల అవసరాలు నిశ్చలంగా ఉన్నాయి. కాని, అవి క్రమేణా పెరిగి పెరిగి 1964—65 నాటికి 6.7 మిలియన్ మెట్రిక్ టన్నుల మేరకు చేరింది. గత 15 సంవత్సరాలలోని ఉత్పత్తుల సంఖ్య యింకా కొనసాగినా, లేదా, నాలుగవ ప్రణాళికలో మూడవ ప్రణాళికకంటే ఎక్కువ సాధించలేకపోయినా, ఆహార ధాన్యాలు దిగుమతుల అవసరాలు, ధరల స్థిరీకరణ ఆవశ్యకత బాగా పెరుగుతుంది. దీని ఫలితంగా ఏడు మిలియన్ టన్నుల (1964—65లో) దిగుమతుల అవసరాలు 1967—68 నాటికి 10 మిలియన్‌ల టన్నులకు, నాలుగవ ప్రణాళికాంతానికి 15 మిలియన్‌ల టన్నులకు పెరుగుతాయి. అమెరికా కూడా యిదే పద్ధతిన ఇండియాకు ఆహారం అందచేయటం నిరవధికంగా కొనసాగితే, 1967—68 నాటికి అమెరికాలోని 1/3 వంతు గోధుమ ఇండియాకే కావలసి ఉంటుంది. 1970—71 నాటికి అమెరికా గోధుమలోని సగం భాగం ఇండియాకే కావలసి ఉంటుంది.”

ఇండియా కర్తవ్యం...?

ఇదీ ప్రవీణుల అభిప్రాయం. అమెరికా సహాయాన్ని విమర్శిస్తూనో, లేక వ్యతిరేకిస్తూనో యీ వాక్యాలు వ్రాయటం జరగలేదు.

కాని పి. ఎల్. 480 లక్ష్యాలు వేరు.



భారత్‌కు అత్యవసర ఆహార సహాయ పథకం క్రింద గోధుమతో అమెరికా ఓడ మద్రాసు రేవులో ఇటీవలనే సరుకు దిగుమతి చేసింది. అమెరికన్ కాన్సల్ డా॥ రాబర్ట్ కార్ట్‌వెల్ లాంఛనంగా ఒక 'గోధుమ ప్యాకెట్'ను మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ ఎం. భక్తవత్సలంకు అందజేస్తున్న దృశ్యం.

అమెరికా సహాయం...కొన్ని సమస్యలు

అమెరికాలో వ్యవసాయపు ధరలను హద్దులో ఉంచుతూ, అక్కడ మిగిలిన అదనపు ధాన్యాన్ని ప్రయోజనకరమైన అవసరాలకు అందచేసేందుకే పి. ఎల్. 480 ఏర్పడింది. అదనపు ఆహారాన్ని అమెరికా కూడా ఎలాగైనా వినియోగించుకోవాలి. సముద్రంలో పడవేయలేరు గదా!

విద్యార్థుల ఔదార్యం !

ప్రారంభదశలోనేగాక, యీనాడుకూడా ఇండియా పి. ఎల్. 480 ద్వారా ఎంతో ప్రయోజనాన్ని పొందుతున్నది. ఇది చూచే యితర దేశాలు కొన్ని కూడా అమెరికాను సహాయం అర్థించాయి. కనీసం 12 మిలియన్ల టన్నుల ఆహారాన్ని అందచేయవలసిందిగా మన ఆహార మంత్రి అభ్యర్థన. మొత్తంమీద ఇండియా అన్ని దేశాలను ఆహార సహాయం అర్థిస్తున్నది. హాలెండ్‌లో, స్కూలు విద్యార్థులు యింటింటికీ తిరిగి, ఆకలిగొన్న భారతీయులకోసం ఆహారాన్ని సేకరిస్తున్నారట.

ఒక్కసారి గతంలోకి చూదాం. శ్రీ నెహ్రూ గనుక సజీవులయి వున్నట్లయితే యీ 'యాచన' ఉద్యమానికి ఆయన అంగీకరించి ఉండేవారుకాదు. మరో వైపు ఢిల్లీ హోటళ్ల ముందు లంచ్, డిన్నర్ పార్టీల బోర్డులు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. పార్టీలలో మద్యం మంచినీరులాగా ప్రవహిస్తుంది. లెక్కలే గనుక సేకరిస్తే ప్రభుత్వ రంగాల్లో పనిచేసే కొందరు ప్యూనులు, కొన్ని నెలలకు సరిపడే ఆహార ధాన్యాలను దాచిపుంచారు.

ఏది నిజం....?

ఆహార ధాన్యాల ఉత్పత్తికి సంబంధించిన అంకెలు ఎంతవరకు నిజం అనే ప్రశ్నకు పార్లమెంటులో ఆహారమంత్రి సైతం "సంతృప్తికరమైన" సమాధానాన్ని యివ్వలేకపోతున్నారు. ఇది కొత్త ఆరోపణేమీ కాదు. ఆహార ధాన్యాల ఉత్పత్తి సంఖ్యలు పూర్తిగా నిజం కాదని బ్రిటిష్‌వారి కాలంలోనే అంగీకరించటం జరిగింది. రైతుల పట్ల కేవలం నామమాత్రమైన సానుభూతి చూపే నగరవాసులకు ప్రభుత్వం వల్లనే తగినంత రక్షణ యీనాడు లభిస్తోంది. ఉదాహరణకు, పంజాబ్‌లో మండలాల రద్దు అనంతరం గోధుమ ధరలు పెరిగితే, దీనివలన రైతులకు, వ్యవసాయదారులకు లాభం ఉంటుంది.

ఎరువుల పంపిణీ విషయంలో ఇండియా, అమెరికా విధానాన్ని అనుసరించవలసి వస్తున్నది. అమెరికా సహాయ విభాగపు కార్యదర్శి డాక్టర్ జాన్ లెవిస్‌కు, ఇండియాలో ఆర్థికశాఖ కార్యదర్శి శ్రీ భూతలింగంగారికీ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను గత వారమే విడుదల చేశారు. అమెరికా కోరిన కొన్ని వాగ్దానాలను ఇండియా ఎలా ఆమోదించిందీ దీని ద్వారా తేట తెల్లమవుతుంది.

ఇండియాలో ప్రత్తి పండే ఎకరాలలో కనీసం సగం వాటిల్లో ప్రత్తి బదులు ఆహార ధాన్యాలు పండించవలసిందిగా అమెరికా ప్రభుత్వం ఇండియా ఆహార శాఖామంత్రిని కోరింది. అంటే, దీని ఫలితంగా అమెరికా నుంచి యింకా ఎక్కువ ప్రత్తిని ఇండియా దిగుమతి చేసికొనవలసి ఉంటుంది.

మాజీ ఆర్థికమంత్రి ఆంక్షలు

ప్రత్తి దిగుమతి చేసికొనే ప్రసక్తి లేకుండా అన్ని ఏర్పాట్లు చక్కదిద్దుకోవాలని, ఇండియా తన కృషిని కొనసాగిస్తూనే ఉన్నది. పి. ఎల్. 480 ద్వారా ప్రత్తిని దిగుమతి చేసికోవటంపై మాజీ ఆర్థికమంత్రి ఆంక్షలు విధించారు కూడా. ఈజిప్టునుంచి కూడా రూపాయి మారకం మీదనే ప్రత్తిని దిగుమతి చేసికోవాలనే కృషి కొనసాగుతున్నది.

లోగడే వ్రాసినట్లు, ఇండియా 'వరిపంట' విషయమై స్వయం సమృద్ధిని సాధించవచ్చును. ఈ ఉత్పత్తులు క్రమేణా పెరుగుతున్నాయి. బియ్యం వాడేవారిని, గోధుమలు తినవలసిందని బలవంతపెట్టటం ఆత్మ హత్యా సదృశం. ఏమయినా, ప్రత్తి పంటను తగ్గించుకోకుండానే, ఇండియా 'వరిపంట' విషయమై స్వయం-సమృద్ధిని సాధించటానికి మిక్కుటంగా అవకాశాలున్నాయి.

మరో మార్గం....

మరో మార్గం కూడా ఉంది. అంతగా అవసరం అయితే, అమెరికా, తన ప్రత్తి పంటనే తగ్గించుకొని, దాని బదులు గోధుమను పండిస్తే, ఆకలిగొన్న వారికి సాయపడ్డ కీర్తి కూడా దక్కుతుంది.

—శ్రీ కృష్ణ ●

రచయితలకి మనవి

1—4—1966 తర్వాత వ్రాత ప్రతులని తిప్పి పంపే విషయమై కొత్త పద్ధతిని అవలంబించవలసి వస్తున్నది. 1—4—1966 వరకూ మా కార్యాలయం చేరే వ్రాత ప్రతులతోబాటు తగు మాత్రం తపాలా బిళ్లలు జత పరచినట్లయితే తిప్పి పంపే ప్రయత్నాలు ఎప్పటిలాగే జరుగుతాయి.

1—4—1966 తర్వాత మా కార్యాలయానికి చేరే వ్రాత ప్రతులతోబాటు రచయిత (త్రు) లు తమ పేరు: చిరునామాతోబాటు తగు మాత్రం తపాలా బిళ్లలు అతికించిన కవరులు పంపాలి. ఆ తేదీ తర్వాత ఇటువంటి (సెల్ఫ్ ఎడ్రెస్‌డ్ ఎన్వలప్స్ విత్ పోస్టేజ్) కవరులతోబాటు వచ్చిన వ్రాత ప్రతులే తిప్పి పంపటం జరుగుతుంది.

ఉత్త తపాలా బిళ్లలు జతపరచి పంపరాదు !

రచయితలు ఈ నిబంధనని గమనించి ఎప్పటివలె మాతో సహకరించగలరని ఆశిస్తున్నాము.

సంపాదకుడు,
ఆంధ్ర సచిత్ర వార పత్రిక.



మేలిరకం "డస్ట్" టీలలో సాటిలేనిది
లిప్టన్స్
హిమాలయన్
గోల్డెన్ డస్ట్ టీ
HIMALAYAN
FINEST GOLDEN DUST TEA
LIPTON'S
FINEST
GOLDEN DUST TEA
ఈ టీతో మీరు కమ్మని, చిక్కని బంగారు ఛాయగల టీ కప్పుల వెంబడి కప్పులు అతి త్వరలో తయారుచేయగలుగుదురు. ఈ పానీయమును మీరే త్రాగి చూడండి. మీ అతిధులకుకూడా యివ్వండి. మీరు తప్పక సంతోషముతో వికసిస్తారు. అవును- మీ ఆనందభరితులైన అతిధులుకూడాను లిప్టన్స్ హిమాలయన్ గోల్డెన్ డస్ట్ టీ మేలిరకం టీలలో నిజంగా అద్వితీయమైనది.
LIPTON
లిప్టన్స్
అంటే
మంచి టీ



ఉ**ప్మా**సురు పట్టినట్టే వుంది.

బంగాళాఖాతంలో యెక్కడో వాయుగుండం కాబోలు. ఒంటిలి వాన వస్తున్న సంగతి కిటికీలో నుంచి కొంచెం తెలుస్తోనే వుంది.

గడియారం ఐదు కేసి సరిగెడుతోంది. నా వేళ్ళు టైపురైటర్ మీదున్నా మనసెక్కడో వుంది. దరి దాదు టం కదిగితే వడగళ్ల వాన అన్నట్లు ఇలా వాకొకటి నానెత్తి మీదడి.

బాస్ రగాన్‌తో 'బెల్' మోగింది. 'సార్' వంగినా దానులు ఇట్టే తిరిగొచ్చి 'రమ్మంటున్నా' రన్నాడు. నాపాళ్ళ మండిపోయింది.

మా 'బాస్' మంచివాడని మొన్న మధ్య దాకా నాకు నమ్మకం వుండేది. కాస్త కోపిష్టి అయితేనేం నాపట్ల మంచివాడు అనే వాణ్ని. ఒకరిద్దరు క్లార్కులకి కిది కోపకారణం అయింది కూడాను. కాని ఆయన ఇహ 'మాట' దక్కించుకొనేలా లేడు. ఇవాళ మా డైరెక్టర్ నా కళ్ళకి పుత్త ఉడుకు మోతుగా కనపడ్డాడు.

ఎంత పై పిస్టునైతే మాత్రం నాకూ వో జీవితం వుంటుందనుకోనక్కర్లా. పోనీ యిది యిరవైయ్యో శతాబ్దం కదా కాస్త అలా నటించవచ్చుగా!

కాని యిహ దుఃఖమంతా నా లోపల పూర్తి కాకుండానే నేను మా 'బాస్' దగ్గరి కెళ్లి డ్రాఫ్టు తెచ్చుకుని మరీ వచ్చాను.

ఎన్నడూ లేనిది యివాళ మా 'బాస్' నేను 'యస్సార్' పొజిట్ ఆయన దగ్గరకు వెళ్లేసరికి నవ్వుతూ వున్నాడు. ముసిముసిగా ఎర్రని పళ్లు కనపడేలా నవ్వుతున్నాడు. అది నవ్వుకాదు, 'వల'. యజమాను లందరి దగ్గరా ఇహ ఆయుధముంటుంది.

''కాస్త యిది అర్జెంటు..ఆ డామ్‌ఫూల్ లాయర్ ఆలస్యంగా పంపించాడు డ్రాఫ్టు...'' అన్నాడు.

నేను నవ్వుతూ 'అలాగే సార్' అంటూ యివతలికి వచ్చాను. ఇవతలికి వొచ్చి దుఃఖపడ్డాను.

ఎంత టయిపిస్టునీ, వేతి క్రింద వుద్యోగినీ అయితే మాత్రం నాకూ యిరవై నాలుగేళ్ల వయస్సూ, ఐదడుగుల నాలుగంగుళాల పొడవూ వున్నాయి కదా! కాస్త 'సొంత లైఫ్' వుంటుందనుకోనక్కర్లా...

కాని యిప్పుడెన్నమకొని యేంలాభం! టైప్ రైటర్ మీద "వడవా" బాగుతున్నాను. జ్ఞానం వొందకే వుండాల్సింది గకింపారం చూసిపోవడం [illegible] కాని [illegible] వుండాల్సింది!

పాతికేళ్ళు వస్తోన్నా నా కామాత్రం తెలివితేట లుండాల్సింది.

ఏ రాగా దేనిరాంటి ఓ అందమైన అమ్మాయి నీ. శుభ ముహూర్తాన నన్నా "వో అందమైన పురుషుడవు సుమా" అన్నట్లు చూస్తుంది. ఫలానా రోజా మనం అలా వెళ్దామా అంటే 'ఫ్వా' అనో 'విరాయిష్యం' అనో అంటుంది. అదే జ్ఞానం యిది వరకే వుంటే ఈ అరగ చాకిరీ తప్పేది కదా!

అవతల వాన తెరపి యిచ్చింది కాబోలు. జనం, బళ్ళూ అన్నీ తోసుకుపోతున్న సందడి వినపడుతోంది.

నేను మాయతో సరిగ్గా ఐదు గంటలకి బ్రాడ్వే థియేటర్‌కి వస్తానన్నాను. అక్కడి నుంచి యెక్కడికైనా పారిపోవాలనుకున్నాను. కాని కర్మ! ఐదు ఇరవై అయిపోయింది. నేనింకా బానిస చాకిరీ చేస్తున్నాను.

బాస్ 'మొహాన' అది ఎంతట ''పారేద్దామా'' అని వుంది. ఇంచుమించు అంతపని చేశాను. అవతలికి పరిగెత్తాను. 'లిఫ్టు' కేసి వెళ్లనేలేదు. మూడంతస్తులు మెట్లు తప్పించి మెట్లు మీదకి గెంతుతూ దిగేశాను.

''నేనో అమ్మాయికి డేట్ యిచ్చాను సార్!''

''నా కివాళ అప్పాయింట్‌మెంటుందండీ''

క్రింద పెద్ద వానే కురిసింది. జనం యింటి మొహం పట్టి 'పోలో'మని పోతున్నారు. ఎవరో వెంట తరుముతున్నట్లు పారిపోతున్నారు!

'చితచిత' లాడుతున్నాయి రోడ్లు. బురద! కార్లకీ, బస్సులకీ అదేదో నాటి ప్రజ్ఞలాగే వుంది. 'బ్వా బ్వా' మంటూ గొప్ప విసురుగా పోతున్నాయి!

చిరాగ్గా వుంది. చిరాగ్గా కూడా వుంది. ఛీ!ఛీ! పాడు నగరం. ఓ ఆగస్టూ, నవంబరూ అనే తేడాలేదు. వేళాపాళా లేకుండా చెప్పా పెట్టాకుండా వచ్చేయడమే!

జడివాన జల జలా...

ప్యాంటు మడత పెట్టుకుంటే... వోనాహా! ఇదివరకింత పట్టింపు వుండేదికాదు. కాని నప్పుడు ప్యాంట్ నలిగిపోడం నాకిష్టం లేదు.

మాయతో పరిచయమయ్యాక నాకు తెలీకుండానే నాలో యిలాంటి 'నాగరికత' బాగా పెరుగుతోంది!

చిన్న తుంపర........

మబ్బుల మీద ఇంద్రుడి రథం పెద్ద ఆర్భాటంగా ఉరుముతో పోతోంది! క్రింద నాలుగు చక్రాల రథాల మీద జనం పారిపోతున్నారు. ఇళ్లకి ఉడాయిస్తున్నారు.

ధాద! ధాద!! జడి జడిగా వాన!

ఆరగంటైనా అయ్యింటుంది. బోలెడు మంది ఆడపిల్లలు అందంగా, అందం లేకపోయినా వొయ్యారంగా, యిలా, అలా పోతున్నారు.

సుజాతలు, సుబ్బులు, మరియమ్మలు, యమునలు, కావేరులు, ఈస్తర్లు ఈనాటి అందరూ 'వర్కింగ్ లాస్'లు! వొయ్యారంగా చీరె కుచ్చెళ్లను చేతులోత్తి వొకవేపుకి యిలా పైకెత్తి పట్టుకుని చినుకులకీ చినుకులకీ మధ్య నుంచి పోతున్నారు.

నా ప్రక్కనించే 'బర్రు'న ఆర్. టి. సి. బస్సు దూసుకుపోయింది. పొగరు. చూసుకోగాదూ! డేర్‌హవుస్ అంటూ అంతెత్తు భవనం, కాని ధాని ముందు యిలా చితచితా బురద నీళ్లూ....

అదీ, నాకర్మ కాకపోతే నా మీదే ట్రుల్లింపాలి?

ఒక్కగెంతు వేశాను. పుట్‌పాత్ మీదకి!

ఇంచుమించు వో పెద్దమనిషి మీద పడ్డాను. తప్పు నాదే అనుకోండి కాని ఆ పెద్దమనిషి మాత్రం మంచివాడా? చూడండి మరి.

చినుకులు తొందరగా ముసురుకున్నాయి. ముసురు ముసిరి వానపడుతోంది. గాలివానో, గగ్గోలు వానో వస్తుందని జనం పారిపోతున్నారు. ఇదేమీ పట్టించుకోకుండా తమలపాకులకు తాపీగా సున్నం రాసుకుంటూ త్యాగరాజ కీర్తనొకదానిని అంతకు క్రితమే నోట్లో వేసుకున్న సోగాకుతో నమిలేస్తో నిశ్చింతంగా పోతున్నాడు.

పోడా మరి!

లుంగీ నంచె యిలా ఎత్తి అంతెత్తు పైకి నడుంకి కట్టేసుకున్నాడు.

నే నింకా పూర్తిగా మీద పడకుండానే 'సారీ' అన్నాను. ''తప్పుకుంటా''డనే ఆశతో.

''ఎన్నాయన్నా! సారీ!'' అని కసిరి, చూసుకుని పోవయ్యా అనే అర్థంతో యింకా ఏవో అని మళ్లీ ఆకులకు సున్నం రాసుకుంటూ వెళ్లిపోయాడు.

నేను లోపల లోపలే తిట్టుకున్నాను.

ఆరోజు కూడా యిలాగే జరిగింది. తొలిసారి నా జీవితంలో మాయ అడుగు పెట్టిన రోజు కూడా యిలాగే వుంది వాతావరణం. కాని ఆతర్వాత ఎంత హాయిగా వుందని. మాయ అంటే మిస్ మాయాదేవి. ఆమె గురించి నేనెంత చెప్పినా యింకా చాలదనే అనిపిస్తుంది. అంతకన్న యెక్కువ గ్లామర్ ఆమెలో వున్నదని మీరు చూస్తే అనుకుంటారు.

సరోజాదేవి మెడ మీద వైజయంతిమాల మొహం, మాలాసిన్హా కళ్లు అతికి నట్లుంటుంది మాయ. ఆకళ్ళు చాలా పెద్దవి. మనల్ని 'వెధవా' అన్నట్లు చూస్తున్నాయో, 'డార్లింగ్' అంటూ ఎలకరిస్తున్నాయో చెప్పుకోడం కష్టం. గొప్పగా వుంటాయా అమ్మాయి మాటలు 'రెమింగ్టన్' మెషిన్‌లా పరిగెడతాయవి!

ఆమె చూస్తే ఆచూపుతో రెండర్థాలుంటాయి. నవ్వితే చాలు! ఆనవ్వు కైపులో మూర్ఛి మనం మరచి పోయి చీకారు క్రిందో పడిపోడం ఖాయం.

ఆరోజు ఆగస్టు నెల మొదట్లో అనుకుంటాను. లేకపోతే నేను ఖాళీ జేబు తడుముకుంటూ నడక సాధన ఎందుకు చేస్తూంటానూ?

తనేమో...ఏమో మరి ఎలా వస్తుందో, అంతకుముందు చూస్తే గదా తెలిసేది, కాని, అంగవ్న

నాయకన్ వీధిలో నుంచో ఆర్ముగం లేన్‌లో నుంచో వస్తో వుంది. నేనిలాగే వస్తున్నా. తను, నావెనకాతల రావడం నే గమనించలా. ఫ్యాంట్ కాళ్లు శుభ్రంగా మోకాళ్ల దాకా మడత పెట్టేశా..చెప్పులు తొడుక్కున్నానో....లేదా కాయితంతో చుట్టి....

మొహం ప్రొద్దున్నించి కారిపోయిన చెమటతో కాస్త 'ఉప్పు' కూడా పేలిపోయింది. అదృష్టం పారీస్ కార్నర్‌లో అలా దారి కాసింది మరి. మామూలు లైసెన్సుని. ఈమధ్య కాస్త లావెక్కిపోయేనుట కూడా. అని మా హొటలు వాడు అన్నాడు. 'కోశా' డేమో మరి!

ఆవేళ నేనేమో యిందాకా వెళ్లిన 'వెత్తలపాక్' భాయీ జాగాలో వున్నానన్నమాట. అతని మీద నేను 'చెంగున'న గెంతినట్లే ఆమె నా మీదకు ఆనాడు గెంతింది!

ఆమె చేతిలో గొడుగుంది.

సన్నని ఆ చేతికి రిస్టు వాచీ వుంది.

రెండో చేతిలో 'జిప్' గల ఎర్రని వానిటీ బ్యాగ్ వుంది.

కుచ్చిళ్ళు జాగర్తగా సాటిన్ లంగా స్పష్టంగా కనపడుతూ వుండగా ఎత్తి పట్టుకుని, వానిటీ బ్యాగ్ చేత్తోనే వాటినీ పట్టుకుని, వయ్యారంగా వస్తోన్న మాయ...నామీద.. యించుమించు నా మీదే పడ్డది. పడాలనుకోలేదు. కాని అలా జరిగింది.

హడిల్ చచ్చేనంటే నమ్మండి.

'సారీ' అని నేనే ముందనేశాను

షాక్ తగిలినట్లు 'ఝుల్లు' మంది నాకు.

అలాగే అయింది. 'షాక్' కొడితే ఎలా వుంటుంది. ఝుల్లు మంటుంది మనం చచ్చిపోకుండా బ్రతికే వుంటాం! ఆహా! అదో గొప్ప అనుభూతి కదూ!

"వో..నెవర్‌మైండ్" అన్నది. ఆమె నా'సారీ'కి బదులుగా, క్షమించాను ఫో అన్నట్లు పయిట సర్దుకుంటూ గొడుగు మీద ఆసరాగా తాను నేల మీద పడిపోకుండా ఆదుకున్న 'మాయాదేవి'!


చెప్పాను కదూ.. పేలగా సన్నగా నాజూగ్గా వుండే రకం కాదు మాయాదేవి. కండపుష్టి దండపుష్టి గల అమ్మాయే. వానపడ్డ రోడ్డు 'చితచిత' జారుతున్నది.

మాయాదేవి కట్టుకున్నది పయిటంచు మీద నుంచి యింకా లేబిల్ కూడా చింపని కొత్త నైలాన్ చీరె. రంగు ముదురు పసుపు పచ్చ. అందు తన మాటపాతికా లేక మాటముక్కై పౌనుల బరువు నంతా నేలపాలు చేయకుండా ఆ గొడుగు మీదనే ఆనుకున్నది.

కాని వచ్చిన యిబ్బందంతా నాకే. అందమైన పడుచుపిల్ల అలా మీద పడిపోతూన్నదే అన్న భయంతో, మోకాళ్లు వొంచి, అప్రయత్నంగానే వంగున్న నాకు సరిగా డొక్కలో, మాయాదేవి గొడుగు వచ్చి గుచ్చుకుని వుంది. అంతే!

దాని మీదనే ఆ'లతాంగి' తన చీరె బురద, కాకుండా, తాను క్రిందపడగా జనం ఆ దృశ్యం విరగబడి చూడకుండా తనను తాను కాపాడుకుంది! మీకీ అవస్థ యిప్పటికీ అర్థం కాకపోతే యిక స్వానుభవంతో తప్ప అర్థం అవదులేండి!

చివరికి ఆవిడ తన గొడుగు తీసుకున్న తర్వాత నిటారుగా నా బిడదుగుల నాలుగంగుళాల యెత్తూ





GPE-Aiyars NE 4 TEL

మాయ

నిలబడి, డొక్కలో తడుముకుంటున్నట్లు తెలియకుండా తడుముకుని 'వూ' మన్నాను.

ఓ భాషలో తిడుతుందా? అని ఆలోచిస్తున్నాను. వేషం మర్యాదగానే వుంది. చూద్దాంలే అని తిట్లు తినడానికే సిద్ధపడ్డాను.

'పాపం' అన్నది ఎర్రని చిన్నపెదాలు కదిపి. 'పాపం' అని వుంటే యేబాధా లేకపోను. కాని తెనుగులోనే జాలిపడ్డది మాయాదేవి. (అప్పటి కాపేరు నాకు తెలియదు)

ఎక్కడలేని కోపమూ ఒక్కసారి వచ్చింది నాకు!

"నీ మొహం! గుర్రమంత ఆడపిల్లవి, నా డొక్కలో చచ్చేలా గొడుగుతో పొడిచేసి యింకా పాపం అంటావేమిటీ? అందామనుకున్నాను. కాని పెదాలు విడితే వొట్టు!

"మరేం ఫర్వాలేదులెండి! మీకేం దెబ్బ తగల్లేదు కదా?" అన్నాను నాలిక తడుపుకుంటూ. డొక్కలో పోటు డొక్కలోనే అదుముకుని!

అలా అయింది యీ పరిచయం.

అబ్బ! ఇంకా నాలుగు సందులు దాటాలి. హైకోర్టు నెత్తి మీద లైట్‌హవుస్ వెలిగింది. తిరుగుతోంది. అయ్యయ్యో! మాయా అక్కడ వానలో, (మునురే అనుకోండి. వాన మొత్తెయడంలేదు) ఎంతసేపైందో నుంచోని ఎదురు చూస్తో! ఏమనుకుంటుందో. తిడుతోంది కాబోలు. పైగా ఎక్కడికి వెళ్దామంటుందో......

సరిగ్గా జ్ఞాపకం వొచ్చింది. జేబులో చూసుకున్నాను. పర్సు లేదు నాకు. నాలుగే కాయితాలు చేతికి తగిలాయి. అందులో ఒకటే రెండు రూపాయిల కాయితం. మిగతావి రూపాయి కాయితాలే! నాకు క్రుంగిపోతున్నట్లనిపించింది. ఈ డబ్బులేం సరిపోతాయి!

నాలో ఉత్సాహం చస్తోంది.

ఎంత హాయిగా వుంది. ఆవేళ కూడా యిలాగే వున్నది. బరువైన మేఘాలున్నాయి ఆకాశం మీద. దీపాలు వెలిగే సరికి యీరోడ్లన్నీ ఆవేళ యెంత బాగున్నాయని.. ఇవాళ కూడా అలాగే వాన. అదే వాతావరణం. మాయకు వస్తానని చెప్పాను. 'ఎక్కడకైనా పారిపోదాం' అన్నాను.

"కాని యెక్కడికి పారిపోతాం. అన్నీ కలిపి ఐదొందలు పైసల్లేని బ్రైపిస్ట్ రమణా! ఎక్కడికిపోతావ్?"

కారు క్రింద పడిపోతే...ఆస్పత్రిలో పడేస్తారు. మాయకు యీసంగతి యెలాగో అలా తెలుస్తుంది. తను వస్తుంది "సారీ" అంటుంది.... యిప్పుడీ "అపాయింట్‌మెంట్" ఎలా తప్పించుకోడం మరి?

సినిమాకి వెళ్లాలంటే? పోయిన శనివారంలాగ, మెరినాకి వెళ్లి పీచ్‌మల్బా తినాలంటే? వాన మొత్తేస్తోంది...తడిస్తే జలుబుచేస్తుంది. మనం టాక్సీలో పోదాం రాండి అంటే....


ఏమన్నా సరే. నాదగ్గిర తంతే మరో పైసాలేదు. జనం అటూ యిటూ ప్రవాహంలో కొట్టుకుపోతున్నారు. ఒక్క తెలిసిన మొహంలేదు. అప్పైనా యిచ్చే నాథుడుంటే బాగుణ్ను... కావాలంటే వడ్డీ యిస్తాను...

అంతలో రానే వొచ్చింది బ్రాడ్వే అనే సందు...

45 వ పేజీ చూడండి

సీరియల్

కరుణ



కొండముది శ్రీరామచంద్రమూర్తి

జరిగిన కథ

జమదగ్ని భార్య శారదాంబ తన కుమారుడు ప్రసన్నతోబాటు విశ్వనాథంగారమ్మాయి కరుణను కూడా పెంచి పెద్దచేస్తుంది. పెద్దకుమారుడైన మన్మథను జమదగ్ని తమ్ముడు చలపతి పెంచుకుంటాడు. కరుణ—ప్రసన్నలకు వివాహ మవుతుంది. మన్మథ కూడా పై చదువులు చదవటానికి నిశ్చయించుకుంటాడు. కరుణ, మన్మథ, వీరభద్రంలు ఎం. ఏ. లో చేరటానికి వాల్తేరు వెళ్తారు. సీటు సంపాదించటానికి మన్మథ చేసిన ప్రయత్నాలు వ్యర్థం అవుతాయి. చివరికి ప్రొఫెసర్ సీలకంఠం ద్వారా సీటు సంపాదించగలుగుతాడు మన్మథ. ప్రసన్న ఉద్యోగ ప్రయత్న సఫలమవుతుంది. పెడదారి పట్టిన వీరభద్రాన్ని మార్చటానికి మన్మథ చేసిన ప్రయత్నం విఫలమవుతుంది.

21

విశ్వనాథం వూరినుంచి వచ్చినరోజున ఎవరిని చూడటానికీ బయటికి వెళ్లలేదు. వళ్లంతా, రైలు ప్రయాణం మూలాన పులిసినట్లుయింది. పైగా రాత్రంతా నిద్రలేదేమో, స్నానం చేసి, హొటలునుండి కేరియర్ తెప్పించుకుని భోజనం చేసింతర్వాత, కళ్లమీదకు నిద్ర దానంతటు అదే వచ్చేసింది. చన్నీళ్లస్నానం చేస్తున్నపుడు ఆయనకు కరుణ ఇంట్లో లేని లోటు మొట్ట మొదటగా కన్పించింది. హొటలు భోజనం చేస్తున్నపుడు కరుణ తనను ఇన్నాళ్లు తల్లిలా ఎలా కాపాడిందో జ్ఞాపకంవచ్చి, కళ్లల్లో నీళ్ల నిల్చాయి. సాయంకాలానికి, వంటరితనం భరించరానిదైంది. పుస్తకం చదువుకుందామంటే మనసు రాలేదు. ఎన్నడూ లేనిది, సినిమాకు పోయి కాసేపు కాలక్షేపం చేసివద్దామా అనిపించినా, దురదృష్టవశాత్తూ కాకమ్మ పిచ్చికమ్మ కథలమీద తీసిన తెనుగు జానపద చిత్రాలూ, 'బాయ్ మీట్స్‌గర్ల్' కథనే బట్టలుమార్చి తొడిగిన హిందీ సినీమాలూ తప్ప, మంచి 'క్లాసిక్' ఏమీ కన్పించలేదు. కాసేపు అటూ ఇటూ ఆ సందె వెలుగులో తిరిగి, ఇంటికి వచ్చేశాడు. అతనికి వంట ఇంట్లో ఎలుకలు చప్పుడు చేస్తే, కరుణ వంట వండుతున్న భ్రాంతి కలిగేది. బయటనుండి గులాబీల వాసన కదిలివస్తే కరుణ పూలు ముడుచుకొంటున్నదేమో అనిపించేది. ఎన్నడూ లేనిది ఆ రాత్రి అతనికి కలవరింతలు కూడా వచ్చేయి.

మర్నాడు నిద్ర లేవగానే, పాచిమొహంతోనే ప్రక్కమీదినుండి దిగకుండానే అనుకొన్నాడు. "నే నీ లంకంత కొంపలో వంటరిగా ఉండలేను. జమదగ్నినో, కళ్యాణినో వచ్చి ఉండమంటాను" అట్లా అనుకున్న తర్వాత అతనికి కొంత ధైర్యం వచ్చింది. మనస్తిమితం చిక్కింది. కాల్యకృత్యాలు ముగించుకొని, దార్లో కాఫీ త్రాగి, జమదగ్ని ఇంటికి బయలుదేరాడు. దార్లో ఒకరిద్దరు తెలిసినవారు కనిపిస్తే యూనివర్శిటీ సంగతులు,కరుణను ఎం.ఏ.లో జేర్పినవైనం గొప్పగా చెప్పాడు. "అన కూడదుగానీ, అమ్మాయికి పెళ్లయింతర్వాత, లక్షణంగా కాపరం చేసుకోనీక, ఇంకా ఈ చదువు లెందుకయ్యా?" అన్నాడు వాళ్లలో ఒకడు.

"మరి అల్లుడేం చేస్తున్నాడూ?" అని అడిగాడు ఆ ఇద్దర్లో ఒకాయన.

విశ్వనాథం వదనం చిన్నబోయింది. ఏవో సమాధానాలు చెప్పి, మనసులో ఉత్సాహమంతా నీళ్లు కారిపోగా, కాళ్లీడ్చుకుంటూ, ఇదివరలో జమదగ్నిఉంటున్న పెంకుటింటి దగ్గరకు వచ్చి,

"జమదగ్నీ! జమదగ్నీ!" అంటూ పిలిచాడు నీరసంగా. ఎవరూ పలకలేదు. వాకిట్లోవున్న గన్నేరుచెట్టు మాత్రం ఆయనను గుర్తు పట్టినట్టు తల వూపింది.

రెండు మూడుసార్లకుపైగా పిల్చి పిల్చి విశ్వనాథం చివరకు తలుపు తట్టాడు. వెంటనేవచ్చి ఎవరూ తలుపు తీయలేదు. తట్టగా, తట్టగా కొంత సేపటికి చలపతి లోపలునుంచి, "ఎవరూ?" అంటూ వచ్చి తలుపు తీశాడు.

"మీరా?" అన్నాడు చలపతి, విశ్వనాధాన్ని చూచి. "రండి. రండి" అంటూ లోపలకు ఆహ్వానిస్తూ.

"విశాఖపట్నంనుంచి ఎప్పుడు వచ్చారు? అబ్బాయికి సీటు దొరికిందా?— హాస్టల్లోనే చేరాడా? డబ్బు సరిపోయిందా?— ఇంకా ఏమన్నా కావాలన్నాడా? హాస్టల్లో భోజనం ఎట్లా ఉంది? పోనీ, బిస్కట్లు, పళ్లు కొనుక్కోమని చెప్పకపోయినారూ?" అన్నాడు.

విశ్వనాథానికి, చలపతి ప్రశ్న పరంపర కొంత విసుగు అనిపించినా, ఆ ప్రశ్నల వెనకాలవున్న ఆర్ద్రత ఆయనకు చకితుణ్ణి చేసింది. ఆ కారణంచేతనే అన్నింటికీ వోప్పి.

కగా సమాధానం చెప్పి; "ఇల్లంగా ఇంత నిశ్శబ్దంగా ఉంది? వీళ్లంతా ఏరీ?— ఏ వూరెళ్లారూ?" అని అడిగాడు. చలపతి గతుక్కుమన్నాడు. గుండెలమీద కుంపటిలాంటి ప్రశ్న. సమాధానానికి గొంతుకలో రాయి పడినట్లయింది. అయినా చెప్పక తప్పదు.

"వాళ్లు ఇల్లు ఖాళీ చేసి వెళ్లారు?"

ఆ జవాబు విశ్వనాథానికి అర్థంకాలేదు. "ఖాళీ చేశారా? అంటే?"

"అంటే ఏముంది? వామీద కోపం వచ్చి, నాపటం నా నెత్తినకొట్టి, మరో గూడు వెతుక్కున్నారు."

విశ్వనాథానికి అంతా అగమ్యగోచరంగా ఉంది. "మీమీద కోపం రావడం ఏమిటి? మరో గూడు వెతుక్కోవడమేమిటి? మీ పటం మీ నెత్తిన కొట్టడమేమిటి?"

జరిగిన విషయం చలపతి చెప్పలేదు. 'అయినా ఇటువంటి విషయాలు దాయాలన్నా దాగవు. అందుచేత పూర్తిగా చెప్పివేయడమే ఉత్తమం' అనుకున్నాడు చలపతి.

అంతా విన్నతర్వాత, "వీరభద్రం విషయంలో, మీ అన్నదమ్ము లిద్దరూ విడిపోయినారా?" అన్నాడు విశ్వనాథం ఆశ్చర్యంతో. "మీ ఇద్దర్నీ రామ లక్ష్మణులను కొనేవాణ్ని!"

చలపతి కొంచెంసేపు వూరుకొన్నాడు. తనలో తను అనుకొన్నట్టుగా అన్నాడు. "వీరభద్రం విషయంలో కాదు! మన్మథ విషయంలో!"

కాసేపు కూచుని అక్కణ్నుంచి లేచి వచ్చేశాడు విశ్వనాథం. ఆ ఇల్లంతా ఆయనకు కళా విహీనంగా కన్పించింది. పిల్లల అల్లరిలో, ఆడవాళ్ల హడావిడిలో, మగవాళ్ల దబాయింపులతో హృదయాన్ని ఆకట్టుకుండా, నిర్జీవంగా నిశ్చేతవంగా పాడుబడ్డ శిథిలాలయం లాగా కన్పించే కొంప గూడా ఒక కొంపక్రింద లెక్కేనా? వస్తూ వస్తూ చలపతితో అదే అన్నాడు.

"విభేదాలమాట ఎట్లా ఉన్నా, వాళ్లని ఇంట్లోనుంచి వెళ్లనివ్వడంలో మీరో పెద్ద

కరుణ

తప్పిదం చేశారు. లంకంత ఇంత ఇంట్లో మీ రొక్కరూ ఎట్లా ఉండగలరు?"

చలపతి, విశ్వనాథాన్ని గేటు దాకా సాగనంపుతూ అన్నాడు. "అవును. ఉండలేను. అందుకనే ఇల్లు అద్దె కిచ్చేస్తున్నాను. ఇల్లేకాదు. పొలం కూడా కౌలు కిచ్చేస్తాను. ఆ వచ్చే డబ్బు పెట్టుకుని, రామా కృష్ణా అనుకొంటూ నేనూ మన్మథ దగ్గరే ఉంటాను."

'ఇల్లూ పొలమూ కూడా చలపతి తన స్వాధీనంలోకి తీసుకుంటే, ఈ వయసులో జమదగ్ని ఏం చేసి, కుటుంబాన్ని పోషించగలడు?' అన్న సందేహం విశ్వనాథానికి కలిగింది. అయితే ఆ సందేహం జమదగ్నిని కలుసుకున్న తర్వాతగాని తీరలేదు. చలపతిని అడిగి, జమదగ్ని అడ్రసు తీసుకుని, మెల్లగా ఇల్లు వెతుక్కుంటూ వెళ్లాడు. వెళ్లేసరికి, జమదగ్ని ఇంటిముందు వున్న చిన్న గదిలో కూచుని, పది బైండు పుస్తకాలు ముందు పెట్టుకుని, లెక్కలు రాయడం కూడడం, చేస్తున్నాడు!

ఆయన విశ్వనాథాన్ని చూడగానే, "ఏమేవ్! మీ అన్నయ్య వచ్చాడు. కాళ్లు కడుక్కోను నీళ్లు పట్రా!" అని లోపలకు పెద్దగా కేక లేశాడు. "ఎవరూ వచ్చింది?" అంటూ శారదాంబ లోపల్నుంచి నీళ్లచెంబుతో బయటికివస్తూ ఆయనను చూసి, "ఎప్పుడొచ్చారు మీరు? అబ్బాయి కులాసాగా ఉన్నాడా? సీటు దొరికిందా? అమ్మాయిని ఎక్కడ అట్టే పెట్టారు?" అని అడిగింది.

ఆమె అడిగింతర్వాత, విశ్వనాథం ఒక్కొటొక్కటిగా జవాబులు చెప్పుకొని వచ్చేటంతలో జమదగ్ని, మనసులోపలి ఆత్రుత ఆపుకోలేక అడిగేశాడు. "వీరభద్రానికి సీటు వచ్చిందా? నేనుపంపించిన డబ్బు అందిందా? ఎట్లా ఉన్నాడు?"

విశ్వనాథం తను చెప్ప దల్చుకొన్న సమాధానం చెప్పి ముందుగా జమదగ్నిని శాంతపర్చాడు. కానీ అది ఆయనలో అశాంతినీ ప్రజ్వరిల్లజేసింది. "వాల్తేరు స్టేషన్లో దిగింతర్వాత నాకు మళ్లీ వీరభద్రం కన్పించలేదు." అన్న సమాధానం అతనిని అమితంగా కలవరపర్చింది. ఆతని కలవరపాటు ఆయన నిట్టూర్పులో కన్పించింది.

మన్మథ యం. ఏ. లో చేరిన వయినమూ, కరుణ ప్రొఫెసరుగారింట్లోనే వుండే సంగతీ శారదాంబను బాగా సంతృప్తిపర్చినాయి. "మీరు శ్రమ అనుకోక వెళ్లారు గనుక పనులన్నీ లక్షణంగా పూర్తి చేసుకు రాగలిగారుకాని, లేకపోతే చిన్నపిల్లలు, వాళ్ల మొహం, వాళ్లేంచేయ గలిగే వాళ్లు?" అన్నది. తను ప్రస్తావన చేయ దల్చుకొన్న విషయానికి అప్పటికిగాని వీలు దొరకలేదు విశ్వనాథానికి.

"ఆ! నేను వెళ్లకుండా వుంటేనే బావుండేది!" అన్నాడు విచారంగా.

"ఏం జరిగింది?" జమదగ్నిలో అనుమానం శారదాంబలో భయం.

"ఏం లేదు, వెళ్లకుండావుంటే, మీరా ఇల్లు వదిలిపెట్టి రావలసి వచ్చేదేకాదు." జమదగ్ని ఇహ ఉన్న విషయం దాచలేకపోయాడు. విశ్వనాథాన్ని వో కుర్చీలో కూచోమని, తానో ప్రక్కన కుర్చీలో కూచుని, మధ్య మధ్య శారదాంబ ఒక్కొక్క మాట కలుపుతుండగా, జరిగిన విషయం యావత్తూ పూసగుచ్చినట్లు చెప్పాడు.

అంతా విని, తొట్టుపాటు కనబడనీయకుండా విశ్వనాథం అడిగాడు. "మీరసలు, పైనుంచి పిడుగులు పడినా కంగారు పడరుగదా? నాల్గు దశాబ్దాల అనుబంధాన్ని ఒక్క క్షణంలో ఎట్లా తెగ తెంపులు చేసుకోగల్గారు?—అదీ అతి స్వల్ప విషయంమీద!"

అప్పుడు ప్రసన్న అడుగుపెట్టాడు లోపలకు. మామగార్ని చూడగానే ముందుగా నమస్కారం చేశాడు. కరుణనుగూర్చి ప్రశ్నించాలనుకొని, మొహమాటపడి, ఆయన అడిగిన ప్రశ్నకు తానుగా సమాధానం చెప్పాడు. "అనుబంధాలకన్నా వ్యక్తిత్వాలు ముఖ్యం మాష్టారూ! వ్యక్తిత్వంలేని బ్రతుకులు వాసనలేని పూవుల వంటివి."

"కాదు నాయనా! వ్యక్తిత్వ సంపద ఎంత విశిష్టమైనదైనా, ఆత్మీయులముందు దానికి విలువలేదు. నువ్వు వీధిలో ఏ కలెక్టరో, గవర్నరో కావచ్చు. ఇంట్లో మాత్రం తల్లి నిన్ను "ఏరా అబ్బాయి" అని పిలవవలసిందే! నువ్వొక మహా రచయితవో మహా గాయకుడవో కావచ్చు. ఇంట్లోమాత్రం నీ కుర్రవాడు నిన్ను 'నాన్నా' అని పిలిచి నీ చంక నెక్కవలసిందే! అట్లా చెయ్యని నాడు, జీవితం కృతకంగా తయారవుతుంది. నువ్వొక ఏకాకివని భావించుకోవలసి వస్తుంది"

"కానీ ఆ ఆత్మీయులే, స్వార్థపరులైనప్పుడు, మానసికంగా అంధులైనప్పుడు, డబ్బు జబ్బుతో, పిచ్చి ప్రేమతో బాధపడుతున్నప్పుడు!—"

"నిజమేనయ్యా! అప్పుడు మన మనసులూ గాయపడతాయి. మీరు చేసిన పనే చేస్తారు అందరూ. కానీ తెగినదారాన్ని ముడివెయ్యాలికాని, తెగిన తుంపులను ఇంకా తెంపకూడదు.

"అయితే మమ్మల్నేం చెయ్యమంటారు?"

"మీ ఇంట్లోకి మిమ్మల్ని మళ్లీ వెళ్లమంటున్నాను"

"ఇది ఇంక అసంభవం"

"అయితే మా ఇంటికి రండి—కానీ ఇంతమంది బంధువులున్న ఈ వూళ్లో మీ రిట్లా అద్దె ఇళ్లల్లో బాధపడడం నాకు ఇష్టంలేదు."

"మీ ఇంటికా?" జమదగ్ని ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. మా ఇంటికే! ఇప్పుడు నా ఇంట్లోమాత్రం ఎవరున్నారు గనుక? కరుణ వెళ్లిపోయింది. ఇల్లంతా బావురుమంటోంది. అయినా నా చాదస్తంగాని, ఇంకా అది నా ఇల్లేమిటి? అమ్మాయిది, అల్లుడిదీనూ!— అంచేత నా మాట విని మీ అబ్బాయి ఇంటికిరండి."

జమదగ్ని ప్రసన్నవైపు ప్రశ్నార్థకంగా చూశాడు. ప్రసన్న ఎటూ తేల్చలేక శారదాంబ వైపు చూశాడు. అద్దె ఇంట్లో "వారం రోజుల జీవితానికీ, జైల్లో ఉంటు



స్పష్టంగా భోవిరేచుకొంటున్న శారదాంబ; తనకు 'సరే' అందామని ఉన్నా, తండ్రీ కొడుకుల మనః ప్రవృత్తు లెట్లా ఉన్నాయోనని, జవాబు చెప్పటానికి సంశయిస్తోంది. ఆ అవకాశం కళ్యాణి జారవిడుచుకో దల్చుకోలేదు. "మనం కాదంటే, మామయ్యగారి మనసు గాయపడుతుంది" అన్నది రహస్యంగా, ప్రసన్నతో.

ప్రసన్న అవునన్నట్టు తల వూపాడు.

మెత్తబడుతున్న వాళ్ల మనసులు మరింతగా సుముఖ మయ్యేట్లు విశ్వనాధం మాట్లాడాడు.

"ఎందుకు మీరింత సందేహిస్తారు ? నేను మీకు పరాయివాణ్ణా ? మా సంప్రదాయం మీకు క్రొత్తదనా ? ఇంట్లో ఉన్న ఆడవాళ్ళు మీతో కయ్యానికి కాలు దువ్వుతారనా ? మీరు వండి నాలుగు మెతుకులు పెడితే తినేవాణ్ణి ! మీరు కూచోమన్న చోట కూచునేవాణ్ణి ! నా పుస్తకాల ప్రపంచంలో నేను బ్రతికేవాణ్ణి! నన్నెందుకు సందేహిస్తారు ?"

"సరే. సరే. వస్తాం. అట్లాగే మీ యింట్లోనే ఉంటాం." జమదగ్ని జవాబిచ్చాడు.

జమదగ్ని కుటుంబం విశ్వనాధం ఇంటికి వెళ్లడమూ, ప్రసన్న కాలేజీలో ట్యూటరుగా చేరడమూ ఒక్కరోజునే జరిగాయి. అల్లుడు ఉద్యోగంలో చేరుతున్నాడన్న సంగతి విని, విశ్వనాధం అన్నాడు,

కరుణ

"ఇంట్లో కూచుని ఏ ఐ. ఏ. ఎస్ కో, మరే స్టేట్ గవర్నమెంట్ గెజిటెడ్ జాబ్ కో చదవవచ్చు కదా — కాలేజీలో ఆ ట్యూటరు ఉద్యోగం కన్నా ! ఈనాడు కాలేజీల్లో ఉద్యోగాలు కాలక్షేపం కోసం గానీ, విద్యాతృష్ణతోనూ, విద్యార్థులకు చదువు చెప్పాలనీ కాదు. బహుశః నువ్వు చాలా చాలా డిసపాయింట్ అవుతావేమో ! ముందు జాగర్తకోసం చెబుతున్నాను. డిపార్ట్‌మెంట్‌లో కూచుని, పోచికోలు కబుర్లు ఎవరితోనూ చెప్పకు. ఎవరన్నా వాదనకు వస్తే వాళ్లదే రైటను. విద్యార్థులను నీ సోదరులుగా ప్రేమించు. ప్రిన్సిపాలుగారు చెప్పిన పని ప్రతి పనీ సంతోషంగా చెయ్. పదిమందిలో ఉన్నా, పుస్తకమే నీకు మంచి స్నేహితుడని జ్ఞాపకం ఉంచుకో."

ప్రసన్న, ఆయనకు కృతజ్ఞతలు తెల్పి వెళ్లిపోయాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు బజార్లో పూలు కొనుక్కుని వచ్చాడు. గడపలో ఉండగానే 'చెల్లాయ్' అంటూ కేక వేశాడు. లోపలేవో మాటలు వినబడుతున్నాయి. తల్లి కంఠస్వరం గుర్తుపట్టవచ్చు. మరొక ఆవిడ ఎవరో గుర్తుపట్టటానికి వీలులేకుండా ఉంది. బొంగురుగా మాట్లాడుతోంది. తొంగిచూస్తే నెత్తిమీద తెల్ల ముసుగు కన్పించింది. ధోవతి అంచుకు ఉన్న ఎర్రని ఆవులు కొట్టి వచ్చినట్టు కనబడ్డాయి.

"ఆఁ! ఏంలేదు. మా బంధువులు కొందరు వచ్చారు. కోడలుపిల్లను చూడాలంటున్నారు. కళ్యాణిని తీసుకువెళ్లి ఒక్క వారం రోజులు ఉంచుకు పంపించేస్తాను" అంటున్నది గోవిందమ్మ.

ప్రధానం అనుకొన్నా, పెళ్లికాని పిల్లను వాళ్ల యింటికి పంపడం శారదాంబకు ఇష్టంలేదు. పైగా ఎవరో వస్తే, వాళ్ళే వచ్చి పిల్లను చూసి వెళ్లడం సబబు కానీ పిల్లనే తీసుకువెళ్లడం ఏమి బావుంటుందీ? అనిపించిం దావిడకు. తన మనసులో ఉన్న సందేహం బయటపడనీకుండా "ఇంటెడు చాకిరీ ఇద్దరం ఉంటేనే కావడంలేదు. ఇంక దాన్ని కూడా మీరు తీసుకువెళ్తే ఇహ నా పని నరకమే" అన్నది.

"ఎంతమ్మా—ఇట్టే పంపించేస్తాను. ఒక్క వారం రోజుల్లో !"


అర్థంచేసుకోలేని వాళ్లకు, కుండ బద్దలు కొట్టినట్లు మొహంమీద చెప్పడము తప్ప మరో మార్గంలేదు. శారదాంబకు ఆమె అభ్యర్థనను తానెందుకు తిరస్కరిస్తున్నదీ అబద్ధంతో కలిపి చెప్పక తప్పలేదు.

"ఇప్పుడు అమ్మాయి ఇంట్లో ఉండే సమయం కాదు. అంచేత పంపించవద్దను కున్నాను."

"పోనీ, ఆ నీళ్ళేవో అక్కడే పోసుకుంటుంది."

శారదాంబకు అటువంటి మనుష్యులతో కలిసి వ్యవహరించడం అలవాటు లేదు. ఆమె పట్టుపట్టి అక్కడే కూచోవడం, ఆమెలో మరింత అసహనానికి కారణమైంది. విసుగ్గా అన్నది. "వద్దండీ! అట్లా అమ్మాయి నొక్కత్తెనూ పంపించడం నాకు ఇష్టంలేదు."

గోవిందమ్మ మొహం ఎర్రబడ్డది. నెత్తిమీది ముసుగు ముందుకు లాక్కుంటూ "ఫలానా కారణంచేత పంపించలేకపోతున్నామూ అని చెప్పలేక పోతున్నారు. మొండిగా పంపించము అని మాత్రం



అంటున్నారు. మీరు చెప్పిన కారణాలు అబద్ధాలని నాకు తెలుసు. నాకు తెలుసు ననీ, బాధపడి వెళ్లిపోతున్నానని మాత్రం మీరు తెలుసుకోండి.'' అని, ఇహ నక్కడ ఉండకుండా బయటికి వచ్చేసింది. శారదాంబ ఆమెను ఎన్నో విషయాలు అడుగుదా మనుకొన్నది. వీరభద్రాన్ని గూర్చి తెలుసుకుందా మనుకొన్నది. ఏవీ అడగటానికి వీలులేకుండా పోయింది.

ప్రసన్న వచ్చిన కాస్సేపటికి, కళ్యాణి కూడా 'లేడీస్ రిక్రియేషన్ క్లబ్' నుంచి వచ్చేసింది. వస్తూనే శారదాంబ ద్వారానే గోవిందమ్మ అక్కడకు వచ్చిన వైనం, తనను పంపించమని అడిగిన వైనం .తన తల్లి తిరస్కరించిన సంగతి తెలుసుకొని ఎంతో బాధపడిపోయింది. తనకు తనే ఆలోచించుకుని, ''నువ్వు చేసిన పని బావుండలేదమ్మా ! ఆవిడే స్వయంగా వచ్చి అడిగినప్పుడు, నన్ను పంపించకపోవడం అంత మంచిదికాదు.'' అన్నది.

శారదాంబకు కోపం వచ్చింది. ''నేను చేసిన పని, మంచిదో కాదో, నాకు నువ్వు చెప్పనక్కర్లేదు. నేను చేసిన పని అది. కాదనుకొంటావా, నీ ఇష్టం మొచ్చినట్లు చెయ్ !''

కళ్యాణి అప్పటికే ఒక నిశ్చయానికి వచ్చేసింది. ప్రసన్నను పిల్చి వో రిక్షా పిలిపించుకొంది. చీరలు నాలుగు వో సంచీలో సర్దుకుంది. ప్రసన్న తోటి, ''నువ్వా రారా. అక్కడ దిగబెట్టి వద్దువుగాని.''అంది. శారదాంబ అంతా చూస్తూ మౌనంగా వూరుకొన్నది. ''మీ నాన్నతో అయినా చెప్పి వెళ్లరాదూ ?'' అన్నది తీరా వెళ్లేటప్పుడు.

''ఆయన అంతా అర్థం చేసుకుంటారు. నువ్వు చెప్పు.''

కళ్యాణి కూచున్న రిక్షా కదిలి ముందుకు పోయింది. పైనుంచి సిరాలా పడుతున్న చీకటి. సిరా వానకు అడ్డంగా వీధి దీపాల వెలుతురు గొడుగు. సినిమా హాల్స్లోంచి మాటలూ, పాటలూ రోడ్డు మీదకు వినిపిస్తున్నాయి. ప్రైకు రిక్షాలో ఉంచుకుని, పెద్దగా ఎడ్వర్టయిజ్మెంట్ చేస్తూ లాటరీ టిక్కెట్లమ్ముతున్నారో కూడలిలో. హోటళ్లు కిటకిట లాడుతున్నాయి. సెంటర్లు కళకళ లాడుతున్నాయి. తన ప్రక్కనే కూచున్న ప్రసన్నను ఉన్నట్టుండి అడిగింది కళ్యాణి. ''నేను చేస్తున్న పని తప్పంటావా ?''

''తప్పు కానీ, రైటు కానీ, సందేహాలు మాత్రం పెట్టుకోకు. చెయ్యదల్చుకున్న పని చేసెయ్.''

ప్రసన్న తెచ్చిన పూలతో కుట్టుకొన్న దండ, జడలో నుండి జారిపోవడం చూసి, అది తిరిగి సర్దుకుంటూ అన్నది కళ్యాణి. ''వదిన దగ్గర్నుంచి ఉత్తరా లేమైనా వస్తున్నాయటరా ?''

''వూఁ !'' ప్రసన్న హుషారుగా లేకపోవడం చూచి అడిగింది కళ్యాణి. ''ఏవిట్రా అన్నయ్యా! అంత పరధ్యాన్నంగా ఉన్నావ్ ?''

ప్రసన్న ఉలిక్కిపడ్డాడు. ''ఏం లేదు. మన ఇంటి పరిస్థితులను గురించే ఆలోచిస్తున్నాను.''

''ఆలోచించి పని లేదురా ! ఏ సమయానికి ఎట్లా చేయువలసిన అవసరం ఏర్పడితే, అట్లా చేసేడమే !''

రిక్షా వాకిట్లో ఆగడం చూసి, గోవిందమ్మ ఎవరోనని ముందుకు వచ్చింది. కళ్యాణి రిక్షాలో నుండి సంచి తీసుకుని దిగుతూ, ''నమస్కారమండీ అత్తయ్యగారూ !'' అన్నది మెల్లిగా.

లోపలికి వచ్చిం తర్వాత అడిగింది మెల్లగా. ''మీ అమ్మగారే పంపించారా ?— నువ్వు ఇంట్లో ఉండే సమయం కాదన్నది. తనొక్కత్తె చాకిరీ చేసుకోలేనన్నది.'' కళ్యాణి మువునమే సమాధానంగా వూరుకొంది.

గోవిందమ్మ, ప్రసన్నను కూచోమని అనలేదు. ఆ రాత్రికి అక్కడ భోజనానికి ఉండమని అనలేదు. అతను కూడా కళ్యాణితో మాత్రం చెప్పి, వచ్చిన రిక్షాలోనే తిరిగి వెళ్లిపోయాడు.

''అదేమిటమ్మా ! వెళ్లేవాడు, నాతో చెప్పయినా వెళ్లాడు కాదేం ?'' అన్నది

గోవిందమ్మ, అమాయకత్వం నటిస్తూ.

"మా అన్నయ్యకు గడుసుతనం తెలీదండీ!" అన్నది కళ్యాణి గడుసుగా, అత్తగారివేపే చూస్తూ.

* * *

యూనివర్సిటీ లైబ్రరీ అంతా చీమ చిటుక్కుమన్నా విన్పించేటంత నిశ్శబ్దంగా ఉంది. అక్కడా ఇక్కడా ఒకళ్లిద్దరు విద్యార్థులు తమ పఠనంలో తాము మునిగి బాహ్య జగత్తును మర్చిపోయినట్లు కనిపిస్తున్నారు. 'గేట్' దగ్గర మనుష్యుల్ని 'రిసీవ్' చేసుకుని, వాళ్లవాళ్ల వస్తువుల్ని తన దగ్గర భద్రపర్చే అటెండరు కునికిపాట్లు పడుతున్నాడు. అసిస్టెంట్ లైబ్రేరియన్లు 'కార్డ్స' వరుసగా పేర్చడంలో ఏకాగ్రత ప్రదర్శిస్తున్నారు. చీఫ్ లైబ్రేరియన్, లైబ్రరీ బయట ఉన్న తోటలో ఎండలో నిల్చుని, తనకు తెలిసిన మిత్రునితో పూసులాడుతున్నాడు.

రజని గంటసేపటినుంచి తనకు కావలసిన పుస్తకం కోసం నానా తంటాలూ పడుతున్నది. కానీ ఆ పుస్తకం మాత్రం కనబడడంలేదు. సామాన్యంగా యూనివర్సిటీ విద్యార్థుల్లో ఒక దురలవాటు ఉన్నది. అది తమకు కావలసిన పుస్తకాన్ని, ఉదాహరణకు, ఏ ఇంగ్లీషు విమర్శనా గ్రంథాన్నో తీసుకువెళ్లి, కెమిస్ట్రీ పుస్తకాలుండే ఏ 'రాక్' లో గుర్తుగా ఒక చోట దాచడం. అట్లాగే అనేకసార్లు కెమిస్ట్రీ పుస్తకాలు హిస్టరీ 'రాక్,' లో కనిపిస్తాయి. ఆంగ్ల నవలలు హిందీలో వెళ్లి దాక్కుంటాయి. సంస్కృత గ్రంథాలు, ఉర్దూ వెనకాల కనిపిస్తాయి. తనకు కావలసిన "ఉదరింగ్ హైట్స్" ఎక్కడో అదేవిధంగా దాక్కొని ఉంటుందని వూహించుకొంటుంది రజని. నుదుటికి పట్టిన చెమటను తుడుచుకొంది. వంగి, పుస్తకాలు వెతుకుతున్నదల్లా, వెనగ్గా నీడగా వో మనిషి నుంచోవడం చూసి ఉలిక్కిపడింది.


"ఎక్స్‌క్యూజ్ మి మేడమ్? మీరంత శ్రమపడడం నాకు బాగాలేదు. యువర్ మోస్ట్ ఒబీడియంట్ సర్వెంట్, ఇదిగో ఇక్కడున్నాడు, వీడికి చెప్పండి, మీకే పుస్తకము కావాలో, నిముషంలో తెచ్చిస్తాడు." అన్నాడు సింహాద్రి అప్పలస్వామి, కాలర్ సరిచేసుకుంటూ, ఆమెవేపు వెకిలిగా చూస్తూ, "థ్యాంక్స్!—ప్లీజ్— డోన్ట్ డిస్టర్బ్! నాకు మీ సహాయం అక్కర్లేదు." రజని కోపంగా అన్నది.

"మగవాళ్ల సహాయం లేకుండా ఆడవాళ్లేం చేయగలరు చెప్పండి? లేడీస్ ఆర్ లేడీస్! ఉత్త వీక్లింగ్స్. చూపులతో, మగవాళ్ల మనసు దోచడం తప్ప, మగువలు మరేం చేయగలరు?"

"మగువలు ఏం చేయగలరో, ఏం చేయలేరో మీ దగ్గర పాఠాలు నేర్చుకోవలసిన దుస్థితి నాకు పట్టలేదు. దయచేసి నన్ను డిస్టర్బ్ చేయకుండా అవతలికి వెళ్తారా?"

సింహాద్రి అప్పలస్వామి అక్కడ నుంచి ఒక్క అంగుళం అవతలికి కదలలేదు. పైగా ఆమె ప్రక్కకే వచ్చి నుంచుని, తనూ 'రాక్' లో పుస్తకాలను అటూ యిటూ కదుపుతూ "మై డియర్ మోస్ట్ బ్యూటిఫుల్ ఏంజల్! ఇక్కడ నుంచోడానికి మీకు ఎంత హక్కు ఉందో, నాకూ అంతే ఉన్నది. ఇవి వెళ్లడమంటారా? పుష్పాన్ని విడిచి భ్రమరం ఎక్కడికి వెళ్లగలదు? చంద్రుణ్ణి విడిచి వెన్నెల ఎక్కడ ఉండగలదు? సముద్రుని బాహుబంధాల్లో కాక నదులు..." తాగినవాడు తూగినట్లు సింహాద్రి మాట్లాడుతున్నాడు. రజనికా ఒక చెంపన కోపం, ఒక చెంపన దుఃఖం ముంచుకు వస్తున్నాయి. ఎవరైనా చూస్తారేమో అన్న అనుమానం, అవమానం ఒకవైపున, అతని మాటలకు కోపం మరొకవైపున ఆమెను ఆలోచించుకోనీయడంలేదు. సింహాద్రి మరొక్క అడుగు ముందుకు వేశాడు. "ఏకాంత కలిసినది ఏకాంతమున నన్ను?" అన్నాడు. ఆమె చెయ్యి పట్టుకోటానికి తన చెయ్యి ముందుకు జాపాడు.

రజనికి, తను లైబ్రరీలో ఉన్నానన్న సంగతీ, తను ఆడపిల్లనన్న సంగతీ మర్చిపోయింది. చేతిలో ఉన్న పుస్తకాన్ని అప్పలస్వామి మీదకు విసిరికొట్టింది. పుస్తకం తగిలి, మొహం దిమ్మరబోయిన సింహాద్రి అప్పలస్వామి 'అబ్బ' అన్నాడు. ముక్కు




పట్టుకొన్నాడు. రక్తం వస్తున్నట్టు నరాలు జివ్వుమంటున్నాయి. చర్మం చిర్లిపడినట్లు బాధపెడుతోంది. అతను స్వస్థతపడి, కళ్ళు తెర్చేసరికి, రజని వెళ్లిపోయింది. గేటు దగ్గరగా వీరభద్రము, మరో స్నేహితుడూ లోపలికి వస్తూ కన్పించారు. సింహాద్రి 'స్టాప్ హర్' అని పశుప్రకోపనంతో అరవబోయి, అది లైబ్రరీ అన్న సంగతి చటుక్కున స్ఫురణకు వచ్చి, అరవడం మాని, గబగబా అడుగులు వేసుకుంటూ రజనిని అనుసరించాడు. రజని వీరభద్రాన్ని దాటి ముందుకు వెళ్లేసరికి రోడ్డుమీద కరుణ, సబిత కన్పించారు. రజని గుండెలు ఇంకా వేగంగా కొట్టుకుంటున్నాయి. వెనకకు చూసింది. 'డెవిల్స్' అన్నది. కరుణను, సబితను తోడు చేసుకొని, జీడిమామిడి తోటగుండా, అడ్డదారిన సిరిపురం క్వార్టర్స్‌కు బయల్దేరింది. రజని తొందరపాటు చూసి, ఆ స్నేహితురాండ్రిద్దరూ ఆశ్చర్యపోతున్నారు. "ఏం జరిగింది ?" అంటూ ప్రశ్నలపై ప్రశ్నలు కురిపించారు. రజని దారిలో నడుస్తూ, తను అవమానింపబడిన విషయమంతా పూసగుచ్చినట్టు వినరించింది. "డాడీతో చెప్పి అతన్ని సస్పెండ్ చేయిద్దామా?" అన్నది సబిత, తనే అవమానింపబడినట్లు ఫీలవుతూ.

"అట్లా కాదే, ఇట్లాంటి రోగ్స్‌ని ఉప్పుపాతరలో వేయించాలి." అన్నది కరుణ.

"అంతకుముందు, వాళ్లకు చక్కగా దేహశుద్ధి జరగాలి."

వాళ్లు మాట్లాడుకొంటూ ముందుకు నడవడంలో, చెట్లను చాటు చేసుకుని వచ్చిన సింహాద్రినీ, వీరభద్రాన్నీ, అతనితో పాటు ఉన్న మరో వ్యక్తినీ గమనించలేదు. కాళ్లక్రింద ఎర్రమట్టీ, ఇసుకా కలిసిన నేలమీద కాళ్ళు బలంగా పడుతున్నాయి. యూనివర్సిటీ కేంపస్ వెనకాల గుబురుగా పెరిగిన జీడిమామిడితోటలో ఎండ మగతగా నిద్రపోతోంది. ఆ చెట్టుమీద కాకి ఒకటై, ఈ చెట్టుమీద కాకి ఒకటీ ఒకరొకర్ని చూసి హెచ్చరికలు చేసుకుంటున్నాయి.

(సశేషం)



"అంతా రెడీ అయిపోయినది. ఇంక నువ్వు లేవడమే తరవాయి" అంటూ సుడి గాలిలా తలుపు తోసుకుని లోపలికి వచ్చాడు వలోద్య.

ఏటూ తెగని లెక్కలతో కుస్తీ పడు తున్న రమాకాంతం నెమ్మదిగా బర్రువుగా తల పైకెత్తేడు. ఆ కళ్లకు ఎదుటి వస్తువుల గుర్తింపు లేదు. ఆ మనస్సు చేస్తున్న లెక్కల నుంచి బయటపడలేదు.

"అల్లా చూస్తావేమిటోయ్! తెమల మంటూంటేనూ"

"ఎక్కడికీ ప్రయాణం?"

"అప్పుడే మరిచిపోయావా? జాగరద్ వెడదామన్నావు కదూ?"

"జాగరద్" అన్నమాట రమాకాంతాన్ని గణిత ప్రపంచంలోంచి లాక్కువచ్చి ఇవతల పడవేసింది. రష్యన్ భాషలో ఆ మాటకు ఊరి బయటకు వెళ్లడం అని అర్థం.

మాస్కో చుట్టుపక్కల దట్టమైన అడవులున్నాయి. వాతావరణం బాగుంటే శని ఆదివారపు శలవురోజుల్లో యూనివర్శిటీలో చదివే ఆడామగా జట్లుజట్లుగా బుజాల మీద పెద్దపెద్ద మూటలు వేసుకుని పట్టణం విడిచి వెళ్లిపోతూ ఉంటారు. ముప్పైనలభై మైళ్ల బస్సుల మీదవెళ్లి, ఏదో అడవిలో గుడారాలు వేసుకుని, చేపలు పట్టి, కుక్క గొడుగులు ఏరి, చితుకులతో చలిమంటలు వేసుకుని, ఆటలతో పాటలతో పట్టణ వాతావరణాన్ని మరిచి హాయిగా గడిపి వస్తూ ఉంటారు.

జాగరద్ అనే మాటకు అంత అర్థం ఉంది. రమాకాంతం మాస్కో వచ్చి ఏడాది కావస్తోంది. ఇంతవరకూ ఒక్కసారి కూడా **జాగరద్ వెళ్లే అవకాశం చిక్కలేదు.** బిగువైన స్పోర్ట్స దుస్తులలో ఉత్సాహం పెల్లుబికే రష్యన్ ఆడపిల్లలతో కలిసి జాగరద్ వెళ్లేవాళ్లను చూచి కించిత్తు అసూయ కూడా పడ్డాడు.

ఈ రోజున వలోద్య ఆహ్వానిస్తున్నాడు. అతడు రమాకాంతం పక్కగదిలో ఉంటున్నాడు. ఇద్దరూ ఒకే డిపార్టుమెంటులో రీసెర్చి చేస్తున్నారు. అతని పూర్తి పేరు వ్లదీమిర్ ఇవానిచ్ కరల్యోఫ్. అందులో మొదటిది అతని పేరు. రెండవది తండ్రి పేరు. మూడవది ఇంటిపేరు. ఒకపాటి పరిచయస్తులైతే అతని పేరును తండ్రి పేరుతో కలిపి పిలవాలి. బాగా పరిచయస్తులైతే మొదటి పేరును కుదించి వలోద్య అనీ, ముద్దు అయితే వోవ అనీ, ఇంకా ముద్దు అయితే వోవచ్కా అనీ పిలుస్తారు.

ఆ ఆహ్వానానికి రమాకాంతం ఎగిరి గంతేశాడు. చేస్తున్న లెక్కల దస్త్రం మూసేశాడు. వలోద్య వివరాలు కొద్దిగా చెప్పేడు. సాయంకాలం బస్సు మీద 'మిహాయిలవ్స్కి' అనే చోటికి వెళ్లి, అక్కడి నుంచి మరో నాలుగు మైళ్లు అడవిలోకి నడవాలి. అక్కడ రాత్రి ఉండాలి.

"అడవిలో చలేస్తుంది. భోజనం బాగుండదు. వాతావరణం ప్రస్తుతం బాగుంది. రేపు బాగుంటుందన్న రూఢిలేదు. సైయేనా?"

"ఇంకా అడుగుతున్నావూ? రెడీ!"

"అడవిలో రాత్రి పడక. రేపు సాయంకాలం తిరిగి వస్తాం. రానూపోనూ నడక పది మైళ్లేనా ఉంటుంది నడవగలవా?"

హిందూదేశస్తులు సుకుమారులనీ, కష్టమైన పనులేవీ చెయ్యలేరనీ అప్రథ ఒకటి రష్యాలో బాగా ఉంది. అందుకనే కష్ట పడడాన్ని గురించి వలోద్య ఇంతగా నొక్కులు నొక్కుతున్నాడని గ్రహించి రమాకాంతం చిరునవ్వునవ్వేడు.

"ఇంతకీ వెడుతున్నది ఎంతమంది?"

"నువ్వూ నేనూ కాక మరో ఇద్దరు అమ్మాయిలు. సరిగ్గా సరిపోతాం"

సరిగ్గా సరిపోవడమంటే ఒక మగవాడికి **ఒక ఆడపిల్ల** చొప్పున ఉండడ మన్నమాట. అడవాళ్ల సంఖ్య ఎక్కువగా ఉన్నా, మగవాళ్ల సంఖ్య ఎక్కువగా ఉన్నా ఇబ్బందే అని అతని ఉద్దేశం. రమాకాంతం నవ్వుకున్నాడు.

"ఆ పిల్లలు ఎవరు? పేర్లు ఏమిటి?"

"అది అంతా వాళ్ల నడిగి నువ్వే తెలుసుకో. నన్నెందుకు అడుగుతావు? అందులో ఒక్క అమ్మాయినే నేను ఎరుగుదును రెండో పిల్ల ఎవరో నాకూ తెలియదు"

ఇల్లాంటి ప్రయాణాలకి అపరిచితులైతేనే మంచిదంటాడు వలోద్య. రమాకాంతం ఏరకం బట్టలు తొడుక్కోవాలో ఏమేవి కొనితేవాలో తెలియజెప్పేడు.

"సాయంకాలం నాలుగ్గంటలకి వస్తాను కలిసి వెడదాం. దగవరీలిస్? (సరేనా!"

"దగవరీలిస్" (సరే.)

వలోద్య బయటికి వెళ్ళిపోయాడు. రమాకాంతం కిటికీ తలుపు తెరిచాడు. పంతొమ్మిదో అంతస్తు నుంచి కిందికి చూస్తూ ఉంటే పండ బారుతున్న బిర్యోజ (భూర్జ?) వృక్షాల తోపు, దూరంలో లమనోసఫె విగ్రహం కనబడుతున్నాయి. సైకిళ్ల మీద పోటీలుగా పోతున్న పిల్లలు, బుజాల మీద గుడారాల మూటలతో వంగి వంగి వెడుతున్న జనం, ఈ ఎండలో వాలీ బాల్ ఆడుతున్న పిల్లలు.... అంతా కోలా హలంగా ఉంది. ఎంత చక్కని సమయం లెక్కలతో వ్యర్థం అయిపోతోందీ ?

రమాకాంతం యూనివర్శిటీ హాస్టలులో భూమి అడుగున ఉన్న గస్త్రినోమ్‌కి, వెళ్ళాడు. బిస్కట్లు, వెన్న, కల్బసా కొన్నాడు. కల్బసా అన్నది పందిమాంసంతో చేసిన ఒక వస్తువు. మాంసం ఉడకబెట్టి, మెత్తటి గుజ్జులా చేసి, రోకలి అంత లావున కడ్డీలుగా నొక్కి, సెలోఫిన్ పేపరుతో మూసి అమ్ముతారు. దానిని ఆపళంగా తినవచ్చు. ఇటువంటి ప్రయాణాలకి అది చాలా వీలు.

రమాకాంతం పుట్టినది పరమ ఛాందస వైదిక కుటుంబంలోనే అయినా స్వదేశంలో ఉండగానే ఇటువంటి తిళ్లకి అలవాటు పడ్డాడు. పైచదువుకి రష్యా వచ్చాక రష్యను లకు మల్లేనే ముప్పొద్దులా మాంసాహారమే.

సరిగ్గా నాలుగింటికి వలోద్య వచ్చాడు. అతని కోటుజేబులో నుంచి బయటికి కన్పిస్తున్న సీసా మూతను బట్టి అది "స్త్రీల్చ్న యూవోద్కా" (మన పరిభాషలో వోడ్కా) అని గ్రహించాడు రమాకాంతం.

యూనివర్శిటీ క్లబ్బు గేటు దగ్గరకు కుడివైపు గంటస్థంభం మీద టెంపరేచరు 16 డిగ్రీలు చూపిస్తోంది.

"మా బెజవాడలో అయితే నడి శీతాకాలంలో కూడా ఇంతకన్నా వేడిగా ఉంటుంది" అన్నాడు రమాకాంతం.

నూటపదకొండో నెంబరు బస్సు ఎక్కి, అక్టోబరు స్క్వేర్‌లో దిగేరు. ఆ స్క్వేర్‌ని కొద్దిరోజుల క్రిందటి వరకూ కలూజ్‌స్కీ స్క్వేర్ అనేవారు. అది ఒక విప్లవ వీరుడి పేరు. పేరు మార్చిన కారణం తెలియదు రమాకాంతానికి. ఆమాటకు వస్తే అసలు ఎవరికీ తెలియదు.

"కల్యూజ్‌స్కీ కన్న అక్టోబర్ గొప్పదని ఈమధ్యనే తెలిసింది కాబోలు, పేరు మార్చేరు."

వలోద్య ఏమీ మాట్లాడలేదు. ఒక్క క్షణం కను బొమ్మలు ముడిచేడు. తాను ఆమాట అనకుండా ఉండవలసింది అనుకున్నాడు రమాకాంతం.

ఇక్కడి నుంచే పట్టణ బహిః ప్రాంతాలకు పోయే బస్సులు బయలుదేరుతాయి. చేరుకోవలసిన మిహాయిలవ్స్కీ 48 కిలోమీటర్ల ఉంది.

"అదిగో వస్తున్నారు మనవాళ్లు!"

ఇద్దరు ఆడపిల్లలు చేతిలో పెద్ద సంచులతో, నీలిరంగు స్పోర్ట్స్ దుస్తులతో కనిపించారు.

ఒకళ్లనొకళ్లు చూచుకున్నారు. ఆఇద్దరి



పిల్లల కళ్లల్లో రమాకాంతరావు మీదే ఉన్నాయి. ఆ కళ్లల్లో భారతదేశంలో అతనికి పరిచయమైన సిగ్గు సంకోచం లేవు. రమాకాంతంలో మాత్రం సిగ్గుపాలు ఇంకా పూర్తిగా పోలేదు. ఆ సిగ్గును గాంభీర్యం అనే ముసుగుతో దాచుకోడానికి ప్రయత్నిస్తూ ఉంటాడు.

"ఇదిగో ఇతడే రావు"

రమాకాంతరావును ఆ పిల్లలకు పరిచయం చేశాడు వలోద్యా. అతడిని అక్కడ అంతా రావు అనే వ్యవహరిస్తారు. మూడు దీర్ఘాక్షరాలున్న అంత పెద్దపేరును రష్యనులు పలుకలేరు. అపసవ్యంగా ఉచ్చరితం కావడం ఇష్టంలేక తన పేరు రావు అనే చెప్పుకుంటాడు.

"జ్డాస్త్ విత్యే!" అని పరస్పరాభివందనలు అయాయి.

ఆ ఇద్దరిలో వలోద్యా స్నేహితురాలు తమార. ముఖం తీర్చిదిద్దినట్లుంది. రెండవ అమ్మాయి పేరు ఎకతరీన. అందరూ కాత్య అనీ, ముద్దు అయితే కత్యూష అనీ పిలుస్తారు. ఆమె సామాన్యంగా ఉంది.

రజ్జుసర్ప భ్రాంతి

నెత్తి మీద కొప్పులా ముడిచింది. చదువుకున్న ముఖంలా కూడాలేదు. కాని, మేధమెటిక్సుతో యూనివర్శిటీ పూర్తి చేసిందని తరువాత తెలిసింది.

ఎక్కువ మాట్లాడుకోడానికి వ్యవధే లేకపోయింది. బస్సు కదిలిపోతూ ఉంటే నలుగురూ ఎగిరి ఎక్కేశారు. బస్సు నిండా ఒకటే జనం. ఒంటికాలి జపం అయిపోయింది. వలోద్యా తమార ఒక చోటికి చేరేరు. రమాకాంతానికీ, కాత్యకీ మధ్య నలుగురైదుగురు నిలుచుని ఉన్నారు. బస్సు నడుస్తున్నంత సేపూ మాట్లాడడానికి లేకపోయింది.

బస్సు ఆగింది. నలుగురూ కిందికి దిగేరు. కాత్య చాలా హుషారుగా ఉంది. నవ్వులు, పాటలు, పొడుపు కథలు, హాస్యాలు, పరుగులు, అందుకోవడాలు— అన్నింటికీ, మొదలు కాత్య. తమార స్వయంగా మితభాషి. వలోద్యా ఎందుకనో ఆరోజున చాలా తక్కువగా మాట్లాడేడు.

"రావు! నీకు మాదేశం నచ్చిందా?" అంది కాత్య.

పరిచయమైన మరుక్షణం నుంచీ నువ్వు నువ్వు అనడం రష్యనులకు అలవాటు నిజానికి నువ్వు అనేది చాలా చక్కని మాట అది సాన్నిహిత్యానికి మారుపేరు. 'బాలే సుతానాం' ఉండనే ఉంది. తెలుగుదేశంలో బాల్య పరిచయాలు తప్ప మిగిలినవనీ, ఎం కాలం నుంచి ఎంత సన్నిహితంగా ఉన్నా 'మీరు'గానే మిగిలిపోతాయి. ముంద ఎబ్బెట్టుగా ఉన్నా, రమాకాంతానికి ఈ పద్ధ నచ్చింది.

"తినడం మొదలు పెడదామా?"

కాత్య సంచీలో చెయ్యిపెట్టి ఏదో వస్తువును బయటికి తీసింది. చూడడాని చక్కలంలా ఉంది. అందరికీ తలోకట ఇచ్చింది.

కుడీ ఎడమా బిర్యోజ, సస్నో, యేల్ దూప్, తోపల్ వృక్షాల చిట్టడవి. మ అంత దట్టంగా ఏమీలేదు. ఆకులు అన్నీ పండిపోయి సగం పైగా రాలిపోయి ఉన్నాయి కొన్ని పొదలు చిక్కని ఎరుపు రంగులో కొన్ని పసుపు రంగులో, కొన్ని ఆకుపచ్చగ ఉన్నాయి.

అప్పుడూ అప్పుడూ ఎదురయే ఏవ ట్రక్కుల లైట్లు తప్ప అంతా చీకటిగ ఉంది. మనుష్య సంచారం ఏమీలేదు మెలికలు తిరుగుతూ పోతున్న సన్నని రోడ్డు మీది గతుకులలో నిలిచిన వర్షపు నీటితో గన్నవరం కాలువ గట్టులా ఉంది. ఇటు వంటి అడవిలో, చీకటిలో అపరిచితులై మగవాళ్లతో కలిసి తిరగడానికి ఆ ఆడ పిల్లలకు భయంలేదు కాబోలు. పెళ్లికాని పిల్లలను అల్లా పంపడానికి వాళ్లవాళ్లకీ అభ్యంతరం లేదు కాబోలు. ఈమాట రమాకాంతానికి నాలుక చివరిదాకా వచ్చింది కాని, అడగలేదు.

"ఈ అడవిలో ఏయే జంతువు లుంటాయో?"

"బాబోయ్! ఆ ప్రశ్న మాత్రం వెయ్యకు. నాకు అసలే భయం. అందులోనూ చీకటి" అని భయం నటించింది కాత్య.



పెళ్లికొడుకు తను దిగిన ఫోటోల్లోకల్లా బాగావచ్చింది ఇదేనటమా! ... . అందుకే ఇది ఇచ్చాడు !

"ఇద్దరు వీరాధివీరులం ఉండగా మీకు ఆపద రానిస్తామా?"

"స్పసీబ!" అన్నారు కాత్య తమారాలు. ఆ మాటకు కృతజ్ఞులం అని అర్థం.

హరిద్వార్ దగ్గర అడవికి విక్రమ్ సింగ్‌తో కలిసి వేటకు వెళ్ళిన రోజు జ్ఞాపకం వచ్చింది రమాకాంతానికి. పెద్దపులి అడుగులు ఎల్లా ఉంటాయో, వాటి ఆకారాన్ని బట్టి అది మగదో, ఆడదో ఎంత పొడుగు ఉంటుందో ఎల్లా తెలుసుకోవచ్చునో విక్రమ్‌సింగ్ దగ్గర నేర్చుకున్న విషయాలు వాళ్ళకు వివరించాడు రమాకాంతం, అడవి జంతువుల గుట్టుమట్లు అన్నీ తనకు బాగా తెలుసు నన్నంత ధీమాతో. సంభాషణ యథాప్రకారంగా ఇండియాలోని పాములు, కోతులు, పెద్దపులుల చుట్టూ తిరిగింది. ఇండియాలో వీధులలో కూడా పెద్దపులులు తిరుగుతూ ఉంటాయనీ, ప్రతివాడూ ఒక ఏనుగును పెంచుకుంటూ ఉంటాడనీ రష్యన్ పిల్లలు అనుకుంటూ ఉంటారు.

నలుగురూ ఒకళ్ల చేతుల్లో ఒకళ్ళ చేతులు దూర్చి, సన్నని రోడ్డు మీద ఇరుకు ఇరుగ్గా నడుస్తున్నారు. తమార సంచీలోంచి ఏపిల్ తీసింది.

"చాకు ఎక్కడ ఉందో కనిపించడంలేదు. ఒకరి తరువాత ఒకరు కొరుక్కుందాం"అని తాను ముందర కొరికి వలోద్య కిచ్చింది. అతడు కొరికి కాత్యకి ఇచ్చాడు. ఆతరువాత రమాకాంతం చేతికి వచ్చింది.

అసలు ఎంగిలీ అనేమాట రష్యను భాషలో లేదు. ఒక్క రష్యనులోనే కాదు మనదేశ భాషలలో తప్పించి మరేభాషలోనూ ఎంగిలీ అనేమాట లేదు. బ్రౌన్ తన నిఘంటువులో ఎంగిలికి ఇంగ్లీషు మాట దొరకక నాలుగైదు వాక్యాలలో దాని అర్థాన్ని వివరించాడు. ఎంగిలికి మనదేశంలో ఉన్న పట్టింపు మరెక్కడా ఉన్నట్టులేదు.

ఇతరుల ఎంగిలి తినడం రమాకాంతానికి ఇదే మొదటిసారి కాదు. డైనింగు హాలులో తింటూ తింటూ ఉన్న చెమ్చాతో బల్ల మీద మధ్యగా అందరి కోసం పెట్టిన ఉప్పు తీసుకోవడం అక్కడ బహు సామాన్యం. ఐస్‌కాండీ ఒక్కటి కొని నలుగురైదుగురు



పిల్లలూ వరసగా ఒకరి తరువాత ఒకరు తినడం మామూలే. రమాకాంతానికి ఈపని వెగటుగా అనిపించేది మొదటి రోజులలో. ఇది ఆరోగ్యానికి భంగకరంకాదా అనేవాడు. తోటి ఇండియన్ స్నేహితు డొకడు రమాకాంతం అనుమానాన్ని తీర్చేడు.

"రష్యన్ ఆడపిల్ల దొరికితే ముద్దు పెట్టుకోడానికి తయారేకాని వాళ్ళ కొరికిన ఏపిల్ మాత్రమేనా అభ్యంతరం?"

ఆ సమాధానం విని రమాకాంతం నివ్వెరపోయాడు. ఆలోచించగా అదీ నిజమే అనిపించింది.

కాత్య అందించిన ఏపిల్ తీసుకొని పెద్ద ముక్క కొరుక్కున్నాడు రమాకాంతం.

"అయ్యయ్యో! అంతా కొరికెయ్యకు. మాకు కూడా మిగుల్చు" అంది తమార.

మునుపైపున చిన్నపిల్లలు కాకి ఎంగిలి చేసి, సమిష్టిగా తినడం అభివర్ణించాడు రమాకాంతం.

"చొక్కా కింద పెట్టి కొరకడం ఎందుకూ?"

కాత్యకి దాని ఉపయోగం ఏమిటో అర్థం కాలేదు. రమాకాంతం సమాధానం ఇవ్వలేదు.

రజ్జుసర్పభ్రాంతి

"అదిగో ఎలుగుబంటి!" ఉన్నట్టుండి రమాకాంతం భయంగా అరిచేడు.

"మా అడవులలో ఎలుగుబంట్లు లేవులే"

"నేను అన్నది అడవిలో ఎలుగుబంటిని గురించి కాదు. అదిగో ఆకాశంలో"

రమాకాంతం సప్తర్షి మండలాన్ని చూపించాడు. దానిని పాశ్చాత్యులు పెద్ద ఎలుగుబంటి అంటారు.

"దొంగా!"

కత్యూష రమాకాంతం వేళ్ళు గట్టిగా నొక్కింది.

మూడు కిలోమీటర్లు నడిచేక కంకర రోడ్డు వదిలి, కుడివైపు తిరిగి, అడవిలోకి కాలిదారి పట్టేరు. దారి ఒక్క తమారకి తెలుసు. ఆమె స్నేహితు లెవరో అక్కడ ఉంటున్నారుట. రాత్రి ఆరుబయట చలి అనిపిస్తే వాళ్ళఇంట్లో పడుక్కోవాలని నిర్ణయం. ఆ ధీమాతోనే ఆలస్యంగా బయలుదేరేరు.

దారి అంతా తడితడిగా జారుడుగా ఉంది. ఏవేవో కొమ్మలు ముఖాలకు తగులుతున్నాయి. పాములు ఉండవని తెలియడం చేత భయం లేదు. 'ఇక్కడ రవుడీలు ఆడపిల్లలను ఎత్తుకుపోయి అల్లరి చేయడం లేదు కాబోలు' అనుకున్నాడు రమాకాంతం.

తమార జర్రున జారిపడపోయింది. ఆమెను లేవదీయబోయి రమాకాంతం కూడా పడ్డాడు. సాధారణంగా ఇటువంటి ప్రయాణాలకు మంచిబట్టలు ఎవరూ వేసుకోరు. అటువంటి ప్రత్యేకమైన దుస్తులు లేని రమాకాంతం ఒక్కడే తాను మామూలుగా వేసుకునే సూటు వేసుకున్నాడు.

కత్యూష పకపకా నవ్వింది. చెయ్యి అందించి లేవదీసింది.

"జారి పడతాను బాబోయ్!" అని భయం నటించి, కాత్య జబ్బలు గట్టిగా పట్టుకుని నడువసాగేడు రమాకాంతం.

చీకట్లో దారి తప్పి, మరో మూడు కిలో మీటర్లు అధికంగా నడిచి, రాత్రి తొమ్మిదింటికి ఆఇంటికి చేరుకున్నారు. అది సమిష్టి వ్యవసాయ క్షేత్రానికి సంబంధించిన ఇల్లు. తమార చనువుగా లోపలికి వెళ్ళి, పక్కగది తలుపు తెరిచింది. లోపల ఎలక్ట్రిసిటీ కూడా ఉంది. జెనరేటర్‌కి బలం చాలక కాబోలు లైటు వెలుగు హెచ్చుతూ తగ్గుతూ ఉంది.


తెచ్చిన సామాను కిందికి దింపి ఒళ్ళు విరుచుకున్నారు. ఆడపిల్లలు భోజన ప్రయత్నాలు చేశారు. కల్బసా పలుచగా రేకుల్లా కోసి, రెండు బ్రెడ్ ముక్కల మధ్యని పెట్టి, అందరికీ అందించారు. వోడ్కా సీసా మూత తీసి అందరికీ అందించాడు వలోద్య. రమాకాంతరావు తనకు వద్దన్నాడు.

"రావ్! మీదేశంలో వోడ్కా దొరుకుతుందా?"

"వోడ్కా కాకపోతే అంత ఘాటైన మరో రకం ఏవో దొరుకుతాయి."

"మీదేశంలో ఎవరూ తాగరట కాదూ? నిషేధం ఉందిట నిజమేనా?"

"తాగ కూడదని రూలు ఉంది కాని కొందరు తాగుతూనే ఉంటారు. ఇదివరకు అటువంటి నిషేధం ఉండేదికాదు. నిషిద్ధం కాదు కదా అని అందరూ తాగేవారూకాదు. తాగడం పంచమహా పాతకాలలోనూ ఒకటి అంటూంది మా శాస్త్రం. నేను తాగకపోవడా



నికి మతం మీాది భక్తి కాదు కారణం.”
“మరి?”
“డాక్టరు వద్దన్నాడు”
‘ఓస్. డాక్టరు నన్నూ వద్దన్నాడు. వాళ్లని అడిగితే మరోలా ఎందుకంటారు?”
భోజనం అయాక నలుగురూ బయలు దేరేరు. లక్ష్యం ఏమీాలేదు. ఎటు తోస్తే అటు. దూరంగా కుక్కలు మొరుగుతు న్నాయి. దూరాన లోయలో మంచు తెర కప్పి సముద్రమేమో ! అన్నట్లు ఉంది. వలోద్య, తమార జట్లూపట్లూలు వేసుకుని, అనుకుని నడుస్తున్నారు.
ఉన్నట్లుండి వెనుక పాటుగా వచ్చి ఎవరో రమాకాంతాన్ని ఒక్క తోపు తోశారు.. ఉలిక్కిపడి వెనుదిరిగి చూశాడు. పకపకా నవ్వుతూ కాత్య పరుగిడుతోంది. రమా కాంతం ఆమెను ఒక్క పరుగులో అందు కుని, పారిపోతున్న ఆమె జడ పట్టుకున్నాడు. రష్యాలో ఆడపిల్లలకు జడ లుండడం పాత ఫాషను.
“ నీ జడ చాలా బాగుంది” అన్నాడు తెలుగు సినిమాలో హీరో వర్ణించే డైలా గులా.
“నిజంగానా? మా జట్టు పిల్లలంతా జడలు కత్తిరించేసుకున్నారు! నేను తప్ప”
“కొప్పు పెడతావు దేనికీ? ఇల్లాపొడుగ్గా వదిలేస్తే ఎంత మజాగా ఉంటుందో ! మా దేశంలో ఆడపిల్లలు జడ చివర జడ గంటలు అని కట్టుకుంటారు. వాళ్లు నడు స్తూ ఉంటే జడగంటలు తకధై తకధై అని అటూ, ఇటూ ఆడుతూ ఉంటే చాలా బాగుంటుంది. ఉండు నీకు జడ గంటలు కడతా”
రమాకాంతం ఉమ్మెత్తకాయలు కోసి ఆమె జడ చివర కట్టేడు.
“రావ్! మీా దేశంలో అమ్మాయి ఎవ రైనా ఉందా ?”—నెమ్మదిగా అడిగింది చెవిలో.
“మా దేశంలో ఒక్క అమ్మాయి ఏం ఖర్మం? మాటికి 51 మంది అమ్మాయిలే”
“నేను అడిగింది అదికాదు. నీకు ప్రదూగ ఉందా అని.”
‘ప్రదూగ’ అంటే స్నేహితురాలు అని నిఘంటుపర్థం. కాని, నాతురలో పెళ్లిచేసుకో బోయే పిల్ల అని అర్థం ఆ రెండ్

అర్థం తనకు తెలియనట్లు నటించాడు రమాకాంతం.
“నాకు స్నేహితురాళ్లు చాలామందే ఉన్నారు. అందులో ఒక్క పిల్లను విడదీసి ఇదిగో ఈ అమ్మాయే నా స్నేహితురాలు, మిగిలినవాళ్లు కాదని చెప్పడం ఎల్లాగ? ఇతరులకు కోపం రాదా?”
“నీకు తెలియనట్లు నటిస్తున్నావ్. నీకు రష్యన్ ఇంత బాగా వచ్చునుకదా. ఈ మాటకి అర్థం తెలియదంటే నేను నమ్ముతానా? అన్నట్లు నువ్వు ఈ దేశం రాకముందే మా భాష నేర్చుకున్నావా ?”
“లేదు. ‘ఆబేవేగే’ల దగ్గరనుంచి ఇక్కడే. అంతకు ముందు ఒక్క మాట కూడా రాదు.” ఆ మాటను అతడు చాలా గర్వంగా చెప్పుకుంటాడు. “రష్యన్ ఇంత బాగా మాట్లాడుతున్నావు. ఎన్ని ఏళ్లనుంచి ఇక్కడ ఉంటున్నావు?” అని ఎవరో ఒకరు అతన్ని అడుగుతూనే ఉంటారు.
“అబ్బే! ఏళ్లు ఎక్కడ! పది నెలలు అయింది వచ్చి” అంటాడు సాగదీస్తు న్నట్లు.
“నువ్వు అడిగిన అర్థంలో నాకు ప్రదూగ ఎవ్వరూలేరు ఇంతవరకూ” అన్నాడు కత్యూష కళ్లలోకిచూస్తూ. మొదట్లో చూచినప్పటికన్న ఇప్పుడు ఆమె అందంగా కనిపిస్తోంది. ఆరోగ్యమైన సౌష్ఠవమైన శరీరం. ఆమె బుగ్గలు రెండు అర చేతుల లోనూ పట్టుకున్నాడు.
“అరే. వాళ్లు ఏరీ? చాలా దూరం పోయినట్లున్నారు. పద వెతుకుదాం” అని అప్పుడే జ్ఞాపకం వచ్చినట్లు రమాకాంతం చెయ్యి పట్టుకుని ఎదరకు తీసుకుపోయింది.
“తమారా! వోవా!” అని షడ్జ మంలో కేకవేసింది. వాళ్ళు దగ్గరలోనే కనిపించారు
“చలిమంట వేసుకుందాం రండర్రా !” ఉత్సాహం అంతా కాత్యదే.
పొడిగాఉన్న పుల్లలు కొద్దిగా దొరి కేయి. కదిలిపోతున్న మంట వెలుగులో కత్యూషముఖం వింత సోయగాలు పోయింది.
“రావుకి నువ్వు బాగా నచ్చేవు” అన్నాడు వలోద్య.
“నిజంగానా? స్పసీబ!” అంది కాత్య.
రమాకాంతం నవ్వి వూరుకున్నాడు.
చలిమంట ఆరిపోయింది. ఒంటిగంట కావస్తోంది. అందరికీ ఆవలింతలు వస్తు

రజ్జుసర్ప భ్రాంతి

న్నాయి. "పోయి పడుక్కుందాం రండి!" అంది తమార.

గదిలో రెండు మంచాలు, వాటిమీద చెరో దుప్పటీ పరిచి ఉన్నాయి.

కాశీ మజిలీ కదలలో కత్తి మధ్యలో పెట్టుకుని ఒపక్కమీద రాజకుమా రుడు, రాజకుమార్తె పడుక్కోవడం జ్ఞాపకం వచ్చింది రమాకాంతానికి. ఆడపిల్లల నిద్ద రినీ మంచాలమీద పడుక్కోమని తామిద్దరూ కింద పడుకుంటాం అని చెప్దామను కున్నాడు.

అంతలో "స్పకోయ్ నయానోచ్! (గుడ్ నైట్)" అని ఆడపిల్లలిద్దరూ లోపల మరోగదిలోకి వెళ్లిపోయారు.

తనకు కలిగిన ఆలోచనలకి రమా కాంతం నవ్వుకున్నాడు.

గదిలో చలిగా ఉంది. పగిలిన గాజు తలుపులోంచి రివ్వున గాలి వీస్తోంది. దుప్పటీ ముసుగుపెట్టి వలోద్య అప్పుడే గుర్రు పెడుతున్నాడు. రమాకాంతానికి అంతా కలతనిద్ర. తెల్లవారుజామున కోళ్లు కూశాయి. కోడికూత విని ఎంత కాలమైందా అనుకుంటూ కళ్లు విప్పేడు.

రమాకాంతంలేచి బయటికి వచ్చాడు. బయట అంతా పొగమంచు. నేల అంతా చెమ్మగా ఉంది. నిన్నరాత్రి చీకట్లో కన బడనివన్నీ ఇప్పుడు కనబడుతున్నాయి. ఆ ఇల్లు కర్రలతో కట్టి ఉంది. రష్యాలో పూర్వకాలపు ఇళ్లు అన్నీ ఇల్లాగే ఉంటాయి. ఇంటి చుట్టూ కోళ్లు, ఆవులు, కుందే ళ్లూనూ. పల్లెటూరి వాతావరణాన్ని భంగ పరుస్తూ ఆ ఇంటి నడికొప్పున టెలివిజన్ ఏరియల్.

కొంకరించుకుపోయే నీళ్లతోనే రమా కాంతం ముఖం కడుక్కున్నాడు. వలోద్య దంత ధావన పరికరాలేవీ తెచ్చుకోలేదు. ఏ చెట్టు కొమ్మనో విరిచి తోముకుంటా డేమో. అబ్బే! అటువంటిది వాళ్లు ఎర గరు.

"ఒక్కరోజు పళ్లు తోమకపోతే ఏమీ మునిగిపోదులే" అన్నాడు వలోద్య.

అంతలో ఎక్కడినుంచో బ్రష్షు తీసుకు వచ్చి తోమసాగేడు. అది తమారాదిట! రమా కాంతం ఆశ్చర్యపడ్డాడు. ఒకరు కొరికిన కాయ మరొకరు కొరకడానికీ, ఒకరి బ్రష్షు మరొకరు వాడడానికీ పోలికలేదు. అతనికి మాత్రం ఆ పట్టింపులులేవు. ఆ పిల్లకీ లేవు కాబోలు.

నాస్తా పూర్తిచేసి నలుగురూ అడవికి అడుపడి నడవసాగేరు. ఏ దారీ తెన్నూ లేదు. ఎటుతోస్తే అటు. చుట్టూ అడవి అంతా బంగారు రంగులో ఉంది. ఒక్క నెల్లాళ్లు ముందుగావస్తే ఇంకా బాగుండేది.

కుక్క గొడుగుల సీజను అయిపోయింది. రమాకాంతం తంటాలుపడి కుక్క గొడు గులు చాలానే ఏరుకు వచ్చాడు కానీ, అవి అన్నీ విషపు కుక్క గొడుగులట. వాటిని తినకూడదట. కాడ సన్నంగా గొడుగు పలుచగా పెద్దదిగా ఉంటే అది మంచిది కాదు. కాడ లావుగానూ, గొడుగు బలంగా చిన్నదిగా ఉండాలి. ఇంకా ఏవేవో భేదాలు చెప్పేరుకాని రమాకాంతానికి అర్ధం కాలేదు.

ఒకచోట గడ్డి మేటిమీదపడి దొర్లేరు. చెరువులో చేపలు పట్టేరు. తమార, వలోద్య ఫోటోలు తీశారు. కాత్య రక రకాల పిచ్చి పువ్వులు కోసింది. ఏవో చెట్టు కాయలు. బొగడకాయలలా ఉన్నాయి. వాటికి నెత్తిమీద టోపీలాఉంది. వాటిని పందులు తింటాయిట. వాటిని దండగుచ్చి మెడలో వేసుకుంది.

ఒకచోట పెద్ద చీమలపుట్ట. ఆ చీమల శరీరం సగం ఎరుపూ, సగం నలుపూనూ. అవి మన ప్రాంతపు దుగ్గాని చీమలలా ఉన్నాయి.

"రావ్! చీమల ఏసిడ్ రుచిచూస్తావా?" అంది కాత్య. ఒక గడ్డి పరకను ఆ చీమల గుంపుమీద దొర్లించింది. చీమలు ఆగడ్డి పరకను తెగకుట్టేయి. చీమలను విదిలిం చేసి ఆ గడ్డిపరకను నాకమని రమాకాంతానికి ఇచ్చింది. అది పుల్లగా బాగుంది.

పేక బయటికితీసి రమాకాంతంవాళ్లకు గాడిద ఆట నేర్పేడు.

సాయంకాలం ప్రయాణ సన్నాహంలో ఉన్నారు అంతా. చాలాహాయిగా, చాలా సంతోషంగా గడిపేను అనుకున్నాడు రమా కాంతం. అన్నట్లు కత్యాష్యను గురించిగాని, తమారను గురించిగాని తాను ఏమీ తెలుసు కోనేలేదు. వారి ఎడ్రస్సులు తీసుకుని అప్పుడప్పుడు కలుసుకుంటూ ఉండాలి అనుకున్నాడు. టెలిఫోను నెంబర్లు, ఎడ్ర స్సులూ వ్రాసి ఇమ్మన్నాడు.

"ఎందుకూ?" అంది తమార.

"ఎందుకేమిటి? నా స్నేహితులు ఏం చేస్తున్నారో అప్పుడప్పుడు తెలుసుకోడానికి"

"తెలుసుకోవాలని ఉంటే నా ద్వారా తెలుసుకోవచ్చునులే" అన్నాడు వలోద్య.

"ఏమి జెలసీ అయ్యా!" ముదలకించింది కాత్య.

ఆ పిల్లలిద్దరూ కాగితాలమీద అడ్రసులు వ్రాసి ఇచ్చారు.

ఆడపిల్లలు మగవాడి అడ్రసు ఇమ్మని అడగడం మర్యాదకాదు! అందుకనే వాళ్ళు అడగలేదు. ఆ పిల్లలు అతని స్వంత విషయాలేవీ అడగలేదు ఇంతవరకూ.

సామానులు పుచ్చుకుని మరో చుట్టు దారివెంట బయలుదేరారు. దారిలో క్లోవ్యన్ అనే చెట్టువి పండబారిన ఆకులు కోసింది కాత్య. అవి లతలా అందంగా ఉంటాయి. వాటిని ఇంట్లో అలంకరిస్తారు.

ఆడపిల్లలిద్దరూ ఒకచోట ఆగేరు. వలోద్య రమాకాంతం దగ్గరకు వచ్చాడు. గొంతు తగ్గించి, "ఇందాకా వాళ్ళ అడ్రస్సులు రాసి ఇచ్చిన కాగితాలు ఇల్లా ఇయ్యి. ఏం రాశారో చూస్తాను" అన్నాడు.

రమాకాంతం ఆశ్చర్యపడ్డాడు.

"తరవాత ఇంటి దగ్గర చూద్దువుగానిలే"

"కాదు. పని ఉంది. ఇప్పుడు చూపించు"

వలోద్య ముఖం చాలా సీరియస్‌గా ఉంది. మూడవ ప్రపంచయుద్ధం వచ్చి పడుతుందేమో అన్నంత భయపడుతున్నటుగా ఉంది. అది అన్యాయవల్లనా! నాగరికులు ఎవ్వరూ అంత బాహాటంగా అన్యాయని చూపించరు. ఇష్టంలేకపోయినా జేబులో ఉన్న కాగితపు మడతల్ని వలోద్యకి అందించాడు రమాకాంతం.

ఆ కాగితాలు చదివి, జాగ్రత్తగా చింపి, అవతల పారేశాడు వలోద్య.

"వాళ్ళ అడ్రస్సులు నువ్వు తెలుసుకోకూడదు. ఆఖరికి వాళ్ళ ఇంటి పేర్లు కూడా నీకు తెలియకూడదు. మనం ఇక్కడ గడిపినట్లుగా మరిచిపోవాలి. వాళ్ళ పొరపాటున నీకు అడ్రస్సులు ఇచ్చారు. చాలా తప్పు అయిపోయింది. అది తప్పు అని నేనే వాళ్ళకు చెప్పేను. వాళ్ళు కూడా ఒప్పుకుని ఆ కాగితాలు తిరిగి తీసుకోమన్నారు. వాళ్ళు డిఫెన్సుశాఖలో పని చేస్తున్నారు. విదేశీయుడితో స్నేహం ఉన్నట్లు తెలిస్తే వాళ్ళ ఉద్యోగాలు పోతాయి. జైల్లో కూడా పడేస్తారు......"

రమాకాంతం కోపంతో వణికిపోతున్నాడు. అందులో ఒక్క అక్షరం కూడా అతడు నమ్మదలుచుకోలేదు. అదంతా పెద్ద అభూత కల్పన. ఇల్లాగని వాళ్ళని భయపెట్టి ఉంటాడు. వాళ్ళు నమ్మి ఉంటారు. వలోద్య చెప్పినది ఎంతవరకూ నిజమో ఆ పిల్లలకు తెలియదు. ఏదో ప్రమాదం ఉందంటున్నాడు. ఎందుకు వచ్చిన గొడవ? ఇల్లాచేస్తే ఏ బాధాలేదు. ఇదీ ధోరణి. వలోద్య ఇంకా విద్యార్థి. వాళ్ళు ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళు. ఏది ప్రమాదమో ఏది కాదో ఆ పిల్లలకన్నా వలోద్యకి ఎక్కువ తెలుసునా? పైగా ఆ పిల్లలు పని చేస్తున్నామని చెప్పిన చోట్లు డిఫెన్సుకి సంబంధించినవన్న జ్ఞాపకంలేదు. ఒకవేళ సంబంధించినా విదేశీయుడితో పరిచయాన్ని నిషేధిస్తాయా! వలోద్యని చూచి జాలిపడాలో, అసహ్యించుకోవాలో రమాకాంతానికి అర్థంకాలేదు.

దారిలో ఎవ్వరూ మాట్లాడలేదు. అందరి మనస్సుల్లోనూ ఇదే తిరుగుతోంది. ఏమీ జరగనట్లే ఉండడానికి రమాకాంతం ప్రయత్నించాడు. బస్సులో కాత్య అతనిపక్కన కూర్చుంది. ఆమె ఏవేవోవిషయాలను గురించి మాట్లాడుతోంది. రమాకాంతం ఊఁ ఆ అని తప్ప మరేమీ అనడంలేదు. ఒక స్నేహితుడి మనస్సు గాయపడిందనీ, దానికి ఒక విధంగా తానే కారణమేమో అనీ ఆమె బాధపడుతున్నట్లుంది. ఆఖరికి రమాకాంతం చెవిలో చెప్పింది.

"రావ్! ఇల్లా జరుగుతుందని అనుకోలేదు. ఇందులో నా పాత్ర ఏమీలేదు."

రమాకాంతం ఏమీ మాట్లాడలేదు. ఒక మహా సంస్థ భయంమీద బ్రతుకుతోంది. అందులో వూహించుకున్న భయం ఎంతో నిజమైన దెంతో తెలియదు. తెలుసుకోడానికి భయం.



హోస్టలుకి తిరిగివచ్చాక రమాకాంతం వలోద్యని తన గదికి పిలిచాడు. ఒక కప్పు కాఫీ ఇచ్చి, తన అనుమానాలన్నీ బయట పెట్టేడు.

"మా దేశ పరిస్థితి నీకు తెలియదు. ఏది ప్రమాదమో నేను ఎరుగుదును. మీ దేశంలోమాత్రం దేశరక్షణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోరా?" అన్నాడు వలోద్య.

"దేశంమీద నీ కింతటి ప్రేమఉండడం మెచ్చుకోతగ్గదే. వాళ్ళకి నాతోడి పరిచయమే అపాయకరమని తెలిసినప్పుడు అసలు నన్ను ఎందుకు తీసుకు వెళ్ళేవు? పోనీ ఆ విషయం నాకు ముందుగా ఎందుకు చెప్పలేదు....! ఆ కాగితంలో ఏంరాశారో చూస్తానని అబద్ధంచెప్పి తీసుకోవలసిన పని ఏముందీ? అల్లా చెప్పకపోతే ఇవ్వనని అపనమ్మకమా?—వాళ్ళు ఉద్యోగం చేస్తున్నామన్న చోట్లు నువ్వు అన్నట్లుగా డిఫెన్సు మినిస్ట్రీలోకాదే......"

"వాళ్ళు నీకు అబద్ధం చెప్పి ఉంటారు ఏదో ఒకటి చెప్పకపోతే బాగుండదని. అసలు వాళ్ళు రాసిచ్చిన అడ్రస్సులూ అబద్ధవేనేమో" అన్నాడు వలోద్య.

హాతోస్మి. ఇలా వీళ్ళని జయించినవాడు లేడు.

"ఆ రాసిన అడ్రసులు నిజమైనవి కాకపోతే నువ్వు తీసుకుని చింపెయ్యవలసిన పని ఏమిటి? ఇంతకీ వాళ్ళపేర్లు తమార కాత్య అన్నవి నిజమేనా? లేక అదీ కల్పనేనా? అసలు ఈ జరిగినదంతా కలా నిజమా?..'

ఆమాటకు వలోద్య నవ్వేడు.

ఇంతకీ నిజమైన కారణం ఏమిటో రమాకాంతానికి అర్థంకాలేదు. ముందర అనుయతో ప్రారంభమై, అది కప్పిపుచ్చడానికి డిఫెన్సు సంగతి ఎత్తి, అది తేలిపోతున్నట్లు కనబడగానే అబద్ధం మీద అబద్ధం ఆడేడా?

"ఆ తీసిన ఫోటోలు తగులబెట్టి వెయమనీ సలహా ఇచ్చాను. నీకు మా దేశ పరిస్థితులు అర్థం కావు" అన్నాడు వలోద్య.


అయితే అపాయం అన్నది నిజమేనా? అది వట్టినే కల్పించినదే అయితే ఇంత పద్ధతిగా ఆలోచించగలడా?

రమాకాంతం మనస్సు గజిబిజి అయిపోయింది. రెండు చేతులలోనూ కణతలు పట్టుకుని కూర్చుండిపోయాడు.

నామక్కల్ దేవాలయాలు


ఫొటోలు, వ్యాసం:
ఎస్. రామకృష్ణ

నామక్కల్ కోట, తటాకం!



సేలం—తిరుచనాపల్లి రోడ్డుమీద ఉన్న నామక్కల్ ఎన్నో దేవాలయాలకి ప్రసిద్ధి. నామగిరి అమ్మన్, నరసింహర్, రంగనాథర్ గుళ్ళు నామక్కల్ చుట్టూ ఉంటాయి. కొండమీద ఒక కోట ఉంటుంది. ('కొండ ఎత్తు 200 అడుగులు.) ఈ కోటకాక ఒ పాడుపడిన దేవాలయం, ఒక మహమ్మదీయ పతాక ధ్వజం కూడా పైన ఉంటాయి. మహమ్మదీయులు ఒక పెద్ద చెట్టుక్రింద ప్రార్థనలు జరుపుకుంటారు.

కోటని 'పోలెగర్' వంశం వాడయిన రామచంద్ర నాయకుడు కట్టాడని కొందరి అభిప్రాయం. మైసూరు రాజుల క్రింద సేనాధిపతిగా పనిచేసిన లక్ష్మీ నరసయ్య కట్టాడని మరికొందరి అభిప్రాయం. మొత్తంమీద, అది 200 ఏళ్ల కన్నా ప్రాచీనం కాదని మాత్రం చెప్పవచ్చు. 1768లో బ్రిటిష్‌వారి అధీనంలోకివచ్చిన ఈ కోటని తర్వాత హైదర్ అలీ, టిప్పూసుల్తాన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఊరు పేరు ఈ రాతికొండ (కల్) వల్లనే వచ్చింది.



సమీపంలోనేవున్న మురుగన్ విగ్రహం

రాతికొండ పశ్చిమంవైపు శ్రీ నరసింహర్, శ్రీ నామగిరి అమ్మన్, శ్రీ హనుమార్‌ల దేవాలయాలు ఉంటాయి. తూర్పున శ్రీ రంగనాథుని గుడి ఉంటుంది. ఇవి రాతిలో చెక్కినవి. పల్లవకాలంనాటివి.

నరసింహ దేవాలయం 7—8 శతాబ్దాలలో 'అడియమాన్' నాయకులలో ఒకరు కట్టించాడుట. దీనిపేరు కూడా 'అడియేంద్ర విష్ణు గృహం'. నామగిరి గుడీ, హనుమంతుని గుడీ 14—15 శతాబ్దాల్లో కట్టినవిట.

నరసింహుని విగ్రహం భక్తి, ఆశ్చర్యాలని కలిగించేటట్లు ఉంటుంది. గర్భగుడిలో హిరణ్యవధ, అనంత శయన విష్ణువు, వరాహావతారం మొదలయిన వాటికి సంబంధించిన శిల్పాలు ఉంటాయి. నరసింహుని చేతిమీద ఒక కవచం ఉంటుంది. ఇది తీసేస్తే, హిరణ్య

పాడుబడిన దేవాలయంపై మహమ్మదీయ పతాక ధ్వజం?



నరసింహుడు.

కశిపుని చంపినప్పుడు అంటిన రక్తాన్ని సూచించే ఎర్రని రంగు 'మరక' కనిపిస్తుంది ఇది అప్పటి శిల్పుల నైపుణ్యానికి నిదర్శనం. నరసింహదర్శనం ముందు నామగిరిని దర్శనం చేసుకొవాలి.

రంగనాధుని గుడిలోనూ చక్కని చెక్కడాలు ఎన్నో కనిపిస్తాయి.

హనుమంతుని గుడి

ఇక్కడి ఆంజనేయస్వామి విగ్రహం చాలా పెద్దది. పైన కప్పు ఉండదు. కాబట్టి 18 అడుగుల విగ్రహం స్పష్టంగా కనిపిస్తుంది. హనుమంతుడికి కట్టే ధోవతిమీద రామనామం ముద్ర వేసి ఉంటుంది. ఇక్కడ ప్రతిదినం అభిషేకం జరగదు—ఇంత పెద్ద విగ్రహానికి అభిషేకాలు చెయ్యటం చాల ఖర్చుతో కూడే పని కనుక. కాని భక్తులు ఎవరో అప్పుడప్పుడు ఏదో చేయిస్తూనే ఉంటారు. వడమాలలు తరచు కనిపిస్తూ ఉంటాయి..

బాలకురుచి మురుగన్

నామక్కల్‌కి పదిమైళ్ల దూరంలో బాలకురుచి అనే వూరు ఉంది. ఇక్కడ ఒక చిన్న కొండమీద వేటకాని ఆకారంలో ఉన్న మురుగన్ గుడి ఉంటుంది. 'వేడన్' విగ్రహం నాలు గడుగుల ఎత్తు ఉంటుంది. శిల్పం చక్కగా, సున్నితంగా ఉంటుంది. ఒక చేతిలో ఈటె, మరొక చేతిలో కోడిపుంజు ఉంటాయి...●



ఒకే రాతితో తయారయిన యీ హనుమంతుని విగ్రహం ఎత్తు 18 అడుగులు.



తేనె మనసులు

తివారీ-శాలివాహన

ఇంగ్లీషులో 'క్యూ', 'యూ' లకు ఒక ప్రత్యేకత ఉంది. విడదీయరాని విశిష్టమైన అనుబంధం ఆ రెంటిదీను. 'క్యూ' లేకుండా 'యూ' కి విలువ, ఉనికీ లేవు. ఆ రెండూ చిత్రమైన జంట.

అలాంటి జంటే శ్రీపతి, సీతాపతీను. అంటే వరుసక్రమాన్ననుసరించి శ్రీపతి క్యూ, సీతాపతి యూ.

అంతేకాక శ్రీపతి, సీతాపతుల సంబంధం ఉసిరికాయ ఉప్పు న్యాయం వంటిది. మళ్లీ ఇక్కడా ఉసిరికాయ శ్రీపతి, ఉప్పు సీతాపతి. ఉసిరికాయ కంటే ఉప్పుకు ఉన్న ప్రాముఖ్యత చాలా గొప్పది.

"ప్రాముఖ్యత ఆ రెంటిదీ గాదు. ఆ రెండూ కలిసే సమయంది. అంటే కాలంది," అంటాడు సీతాపతి.

'కాలం అంటే దేవుడు' అనే విషయం మీద అతనో సందర్భంలో ఆరు గంటల ఉపన్యాసం యిచ్చాడు!

ఈ ఉపన్యాసాలవల్ల కలిగింది కాదు వీళ్లిద్దరిమధ్యా పరిచయం.

పార్థివ చైతన్యాన్ని సమస్తమూ తనలో నింపుకుని లోకానికి వెలుగుని దానం చేయటానికి సూర్యుడు అప్పుడే బయటికి రాబోతున్న ఒకనాటి శుభోదయాన—

పదమూడంతస్తుల భవనం ముందున్న పేవ్‌మెంట్ మీద నిలబడి దిక్కులు చూస్తూ ఆత్మానందాన్ని పొందుతున్న సమయంలో సీతాపతికి తటస్థపడ్డాడు శ్రీపతి.

"నగరాల సౌందర్యం చూడాలంటే రాత్రి ఎనిమిదింటికీ, తెల్లవారుఝామున ఐదు, ఐదున్నరకీ మాత్రమే చూడాలి." అనే నిశ్చితాభిప్రాయం కలిగినవాడు సీతాపతి.

ఇలాంటి అభిప్రాయాలు, ఆనందాలు అతనికి చాలా ఉన్నాయి ! అతనో ఆదర్శవాది, రసద్రష్ట, సహృదయుడూను ! వీటన్నింటినీ మించి మనం గమనించవలసిన విషయం అతని జీవితం 'వడ్డించిన విస్తరి' వంటిదని.

"రూపాయకు చిల్లరుంటే ఇస్తారా ?"

చిల్లరకోసం తన ఆనందాన్ని భంగపరచిన యువకుణ్ణి చిరాగ్గా ఎగాదిగా చూసేడు సీతాపతి. పొట్టిగా, బక్కపలచగా ఉన్న ఆ గిరజాలబ్బాయి ముక్కుతో మాట్లాడటం—అదీ తెలుగులో చిత్రంగా ధ్వనించి, చిల్లర లేకపోగా—అతనికి కావలసిన పావలా కాసును చేబదులిచ్చి రిక్షావాడ్ని పంపించాడు.

మరో గంటకి — మైలు దూరానికి మూడుంబావలా రిక్షా ఛార్జి చెల్లించిన ఘనుడుగా శ్రీపతిని విస్తుబోయి చూసి, రిక్షావాడి బ్రతుకుతెరువు తెలివితేటలకి తనివితీరా నవ్వుకున్నాడు సీతాపతి.

అప్పటికప్పుడే తెల్లవారిపోవటంతో— శ్రీపతి తెలివిని గుర్తుకు తెచ్చుకుంటూ— అతన్ని తనతోపాటు రూమ్‌కు తీసుకు వెళ్లాడు సీతాపతి.

కనుకనే, ఆనాటి రిక్షావాడి తెలివితేటలు, తన తెల్లవారిన తెలివీ—తన జీవన పథాన్ని వో 'యూ' కర్వ్‌గా మార్చివేసిందని లోలోపల ఆ రిక్షా అతనికి ధన్యవాదాలు చెప్పుకుంటూ ఉంటాడు శ్రీపతి. ఆ 'కర్వ్' కి రెండు కొసలూ అతని బాల్యావస్థలోని దుస్థితి, అత నిప్పుడున్న ఉన్నత స్థితీ !

సీతాపతి దగ్గర తనావేళ చేబదులుగా తీసుకున్న పావలా తిరిగి యిచ్చేసినా, అతనికి ఆజన్మాంతం ఋణగ్రస్తుడయిపోయానని వాపోతూ ఉంటాడు శ్రీపతి, ఈనాటికీ కూడా.

అతని బాధలో గల నిజాయితీని పరామర్శించి, అతన్ని ఉపశమింపజేసి, గుండెనిండా సీతాపతి పట్ల కృతజ్ఞతని నింపుకున్న అతన్ని అభినందించటం—అతని కథ విన్నవాళ్లంతా ఈనాడు చేస్తున్న పని.

* * *

శ్రీపతి చెప్పుకు పోతున్నాడు. కంఠం దాకా దుప్పటి కప్పుకుని రెండు చేతులూ గుండెలమీద పెట్టుకుని పైకి చూస్తూ పడుకుని ఉన్నాడతను.

"మావూరు వదిలి బైటికి రావటం నా కిదే మొదటిసారి. కాకుంటే, ఏ నాలు

గ్లైదుసార్లో, పదిమైళ్లలో ఉన్న టవున్‌కు వెళ్లానేమో అంతే. తొలిసారిగా ఈ మహా నగరం రావటమంటేనే గుండె బేజా రెత్తింది. కాని వూళ్లో, ఏ భాషా సరిగా రానివాణ్ని 'నేనా ఉద్యోగమేం చేస్తాను.' వద్దనుకుని వూరుకున్నాను. కాని మా చెల్లి ఉమ ....''

శ్రీపతి ఒక్క క్షణం ఆగి దీర్ఘంగా నిట్టూర్చేడు. సీతాపతి ఆతృతగా అతని వైపు చూసేడు. నాలికతో పెదవులు తడిచేసుకుని చెప్పసాగేడు శ్రీపతి.

"ఉమ మాటంటే నాకు వేదవాక్కు. 'దుర్లభమైన అదృష్టం అంది వస్తే చేజేతులా జారవిడుచుకోవద్దు' ని పోరు పెట్టింది. మా అక్కయ్య అదే సలహా యిచ్చింది. 'ఒకరి కొకరం తోడుగా ఉంటాము. నీకేం దిగులక్కర్లేదు, వెళ్లి రమ్మ' ని. గుండెలు చిక్కపట్టుకుని, మనసును అక్కయ్యా, ఉమల దగ్గర వదిలి యీవూరొచ్చాను''

శ్రీపతి కంఠం రుద్ధమైంది. గబగబా అనేశాడు. "నే ననుకున్నదంతా అయింది. ఏ ఆఫ్రికా అరణ్యాల నుంచో దిగుమతయినట్లున్నాడే' అన్నాడా ఇన్‌స్ట్రక్టరు నన్ను చూసి. ఇక రేపణ్ణుంచీ మిగిలినవాళ్లంతా అలాగే హేళన చేయటం మొదలెట్టారు.

శ్రీపతి గొంతు పూడుకపోవటం గమనించిన సీతాపతి అతని కళ్లల్లో నీళ్లు కూడా తిరిగి ఉంటాయని వూహించాడు. అనునయింపుగా మాట్లాడటం మొదలెట్టేడు.

"అంతగా దిగులుపడాల్సిన అవసరమేం లేదు శ్రీపతీ ! నే నున్నానుగదా, నీ కన్నివిధాలా సహాయంగా ఉండటానికి. చదువులో నువ్వు అందరికన్నా తక్కువవాడివి కావడం కంటే, నీ వాలకం, స్వభావం—ఈ రెండే నీకు యిలాంటి చిక్కుల్ని తెచ్చిపెడుతాయి. ఆయన అన్నాడని బాధపడుతున్నావే గాని, ఒక్క విషయం ఆలోచించు. యాభై మందిలో టక్ చేసుకోకుండా వచ్చింది నువ్వొక్కడివి. అందరి ముఖాలూ రాకెట్లో చంద్రమండలానికి వెళ్తున్నట్లు ఆనందిస్తుంటే—ఆ ఆనందం లేకపోతే పోనీ, అంతకు వెయ్యిరెట్ల దైన్యం, విచారం, భయం నీ కళ్లల్లో గూడు కట్టుకున్నై. ఇవన్నీ తీసెయ్ ! అంతమందిలో కనీసం జుట్టు కూడా సరిగా దువ్వుకోకుండా వచ్చింది నువ్వొక్కడివి అవునా కాదా ? నీకో విషయం చెప్తున్నా గుర్తుంచుకో శ్రీపతీ! మొదటిరాత్రే నా చొరవకి మరోలా అనుకోకు. మనం రేప్రొద్దున చేయబోయేది సమాజం దృష్టిలో కొంచెం గొప్ప ఉద్యోగం. దానికి తగ్గ డాబు, దర్పం, బేషజం మనలో ఆశించటం సంఘానికి సహజం. నేనేదో బరువుగా మాట్లాడుతున్నా ననుకోవద్దు. విలక్షణమైన నీ అవతారం చూసి జోక్ వేశా డాయన. ఐనా ఎవరో ఏదో అన్నారని బాధపడటం కంటే— వారన్నమాటల్ని మన మంచికి వాడుకోవటం అలవాటు చేసుకోవాలి. ఒక్క మాటలో చెప్పాలంటే, నువ్వు నిండైన నీవుగా మారాలి. ఇప్పుడు నీలో గొప్ప వెలితి ఉంది, తెలిసిందా ?''

శ్రీపతి మాట్లాడలేదు. తనను గురించిన ఏదో గొప్ప నిజం సీతాపతి తన కపగతం చేశాడనే భావన కలిగింది అతని మనస్సులో. ఆ భావనని కేంద్రంగా చేసుకుని ఆలోచనల సంఘర్షణ బయలుదేరింది.

పరిచయం వృద్ధిపొందకుండానే తన ఉపన్యాసంతో శ్రీపతి మనసును బాధ పెట్టానేమోననే అనుమానం కలిగింది సీతాపతికి. కాని దాన్ని అంతలోనే ప్రక్కకి నెట్టేడు. నిజమైన స్నేహితుడుగా మనదలచుకొన్నప్పుడు తన కిలాంటి మొహమాటాలు పనికిరావనుకున్నాడు. అదే విషయాన్ని పైకి చెప్పేశాడు శ్రీపతితో.

అది విని అన్నాడు శ్రీపతి. "పైకి చెప్పలేని ఏవేవో భావాలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నై సీతాపతిగారూ! మీ స్నేహాన్ని పొందటం నా అదృష్టం. ఇంతకంటే ఏమీ చెప్పలేను.''

సీతాపతి మనస్సు చివుక్కుమంది. కొంచెం కోపంగా అన్నాడు. "ఆత్మీయత పెరగాలంటే పడికట్టు పదాల మర్యాద పోవాలి శ్రీపతీ! నన్ను 'గారూ' అనక్కర్లేదు. చూశావా, అదే నీలో ఉన్న బలహీనత. ప్రొద్దుటినుంచీ నిన్ను నేను పేరెట్టి పిలుస్తుంటే నువ్వేమో 'గారే— బూరే' అని తినేస్తున్నావ్ నన్ను.''

ఇద్దరికీ సన్నగా నవ్వు వచ్చింది. నవ్వుకున్నారు. ఒక్క తృటిలో శ్రీపతికి కళ్లు చెమర్చాయి. పేరుకు తప్ప 'శ్రీ' కి విలువ లేని తన బ్రతుకును, ఎమ్మే చదువుకున్న లక్షాధికారి సీతాపతి జీవితంతో పోల్చుకుని, అతని మంచితనాన్ని అనుభవించేసరికి శ్రీపతి గుండె ద్రవించిపోయింది.

అభిమానం గౌరవంగా పెరిగి కృతజ్ఞతగా మారి, కన్నీరుగా బయటి కొచ్చింది శ్రీపతికి. అతని పరిస్థితిని గమనించనట్లుగా మీవూరెలా ఉంటుందో చెప్పు శ్రీపతీ'' అనడిగేడు సీతాపతి.

'సీతాపతికి అన్ని తెలివితేటలతో బాటు మనుష్యుల మనసులు చదవటం కూడా చేతొచ్చు' నని తెలుసుకుని విస్తుపోయాడు శ్రీపతి.

బరువుగా వూపిరి పీల్చుకుని, ముక్కుపుటా లెగరేసి ఒక్క క్షణం ఆగి చెప్పసాగేడు శ్రీపతి.

"మా వూరు కూడా మాకు తగినట్లే ఉంటుంది. అమ్మా, నాన్నా లేని నావంటి అమాయకుడిలా, ప్రపంచాన్ని చూసి బెదురుతూ, వయస్సు ముదిరినా, తనవాళ్ల సౌఖ్యం కోసం పెళ్లి చేసుకోకుండా ఉద్యోగం చేస్తున్న మా అక్క 'రమ' లా దైన్యంలో గాంభీర్యాన్ని పులుముకుని, అనురాగం ఆప్యాయత, ఆదరణా తప్ప మరేమీ ఎరుగని మా ఉమ వంటి కన్నెపిల్ల మనసులా స్వచ్ఛందంగా, నాలుగు ఏరులు నలువైపులా తనని చుట్టేస్తే జీవన వలయంగా మారిన ఆర్థిక వ్యవస్థలో చిక్కుకుని 'ఆశ' తో బ్రతుకుతున్న మాలాగా నింగికి చూపులు సారించి బిక్కుబిక్కుమంటూ ఉంటుంది. మా వూళ్లో వాళ్లకి రేడియోను గురించి చదువుకోవటమే గాని దాన్ని చూసి, విని, ఆనందించే పర్వదినం ఇంకా రాలేదు. చాలా ? ....''

సీతాపతికి ఆశ్చర్యం వేసింది. ప్రపంచమంతా నాగరికత పెరిగి, ఇంతగా అభివృద్ధి చెందుతుంటే, ఇంకా యిలాంటి కుగ్రామా లున్నాయా ! అనిపించింది. పదేళ్ల క్రితం తన వూళ్లో తను గోలీకాయలాడుకున్న చెరువుగట్టున ఈరోజు నిలిచి ఉన్న 'హోవర్ హెడ్ టాంక్', హెల్తు సెంటర్, హైయర్ సెకండరీ స్కూలు, పిల్లల పార్కు కళ్లకు కట్టినై. ఎక్కడో చదివిన వాక్యం గుర్తుకొచ్చింది.—"ఉన్నదీ అంటే లేదు అన్నమాటే. చీకటి ఉన్నది అంటే వెలుగు లేదనే ....'' దీన్నిబట్టి అభివృద్ధి ఉన్నదీ అంటే లేదు అని కూడా అర్థమున్నమాట !

శ్రీపతి అవులింతకు ఆలోచనని త్రెంచి "మరి మీ అక్కయ్యా.....'' అని అర్ధోక్తిలో ఆపేడు సీతాపతి.

"మూడు మైళ్ల దూరంలో ఉన్న హైస్కూల్లో ఎస్సెల్సీ ప్యాసై, ట్రంకు

వింగా అయి, మా వూళ్ళో ఉన్న ఎక్కైక ఎలిమెంటరీ స్కూల్లో రెండో టీచర్‌గా పనిచేస్తున్నది. ఏటా వచ్చే పది బస్తాల ధాన్యానికి మా అక్క నెలనెలా తెచ్చే డెబ్బయి రూపాయల వంజుడు .... ఇక గూడంటావా, ఉంది వో బంగళా."

"మరి మీ చెల్లి ....?"

"మా చెల్లి ఏమీ చదువుకోలేదు. కాని, మా అక్కయ్యను మించిన లోకజ్ఞానం, తెలివితేటలూ మా ఉమ కున్నాయి. దాని చలాకీతనమే వేరు. చదువుకోలేదన్నమాటే గాని మా అక్కయ్య ద్వారా, నా ద్వారా ఎన్నెన్నో విషయాలు అడిగి తెలుసుకుంటూ ఉంటుంది. ఆఁ .... పైగా వట్టి వాగుడు కాయ .... ఉమంటే నా ప్రాణంలో ప్రాణం. అక్కకూ అంతే."

ఈమాట లంటూన్నప్పుడు శ్రీపతి కంఠస్వరంలోని ఉద్వేగం, మాటల్లోని ఆవేశం పసిగట్టిన సీతాపతి, శ్రీపతి కళ్ళల్లో వెలిగిన వెలుగునూ తన కళ్ల ముందు చిత్రించుకో గలిగేడు. 'తోడ బుట్టినవాళ్ళులేని దురదృష్టవంతుడ్ని. ఆ మమత, అనుభూతి అలాంటివి కాబోలు!' అనిపించి నిట్టూర్చేడు.

క్షణాల తర్వాత శ్రీపతిని పిలిచేడు— "రేపు ఉదయం పారిస్‌కు పోయొద్దాం..." అంటూ.

శ్రీపతి నుంచి సమాధానం రాలేదు. అతని వూహల్ని, తన్మయతని, భంగం చేయటం ఇష్టంలేక నిద్రకు ఉపక్రమించాడు సీతాపతి.

* * *

శ్రీపతికి అదొక వింత అనుభవంగా ఉంది. బస్ స్టాపులో నిలబడి వచ్చే పోయే వాహనాల్ని, మనుషుల్నీ చూస్తుంటే అతనికి ఆశ్చర్యంగా ఉంది. అందులోనూ మ్యాటర్ల మీద జంట జంటలుగా వెళ్లే స్త్రీ పురుషుల్ని చూస్తుంటేను, బస్సు కోసం పడిగాపులు పడుతూ, కొంపలు మునిగిపోతున్నట్లు, పుస్తకాలు తిరగేస్తున్న కాలేజీ స్టూడెంట్సుని చూస్తుంటేను అతనికి అదోలా అనిపించింది.... మద్రాసు నగరంతో పోల్చుకుంటే వాళ్ల వూరు వూరు కాదనిపించటంలో ఎంత విజమో, ఇక్కడ తిరిగే జనంతో పోల్చుకుంటే తమ వూళ్లోవాళ్ళ మనుష్యులే కారన్నది అంత నిజమనిపించింది.

ఈ వింతలన్నిటిలోకీ వింతయినది — అతను 'పారిస్ కార్నర్' ని చూడటం. సీతా

తేనెమనసులు

పతితో కలిసి, బస్సు దిగగానే అన్నాడతను. "ఇదే ది గ్రేట్ పారిస్ కార్నర్" అని—శ్రీపతి చుట్టూతా పది నిముషాలు పరికించాడు. అతని వూహల్లో అతను వూహించుకున్న పారిస్ కార్నర్ వేరు. అందులో అదొక పెద్ద కూడలి. ఒక రోడ్డు అక్కడ మలుపు తిరుగుతూ ఆరంతస్థుల వో పెద్ద భవంతిని చుట్టి వెళ్తూ ఉంటుందనీ, ఆ భవంతికి సరిగ్గా ఎదురుగా మరో త్రారోడ్డు పారాడుతూ ఉంటుందనీ, అతని భావనా చిత్రణ. కాని అతను చూస్తున్నది వేరు.

మద్రాసును గురించి వూహించుకున్నవన్నీ యిలాగే ఉన్నా యతనికి. ఆ నగరం వింతలు చెప్తూ, చూడవలసినవి చూపుతూ శ్రీపతిని త్రిప్పేడు సీతాపతి. హైకోర్ట్సు, లైట్ హౌస్, చూసిన తర్వాత రూమ్‌కు బయల్దేరేరు. మధ్యలో సీతాపతి ఒక బట్టల దుకాణంలోకి దారితీసేడు.

షాపు లోపలికి వెళ్లిన తర్వాత గాని అసలు విషయం తెలియలేదు శ్రీపతికి. "నా దగ్గర డబ్బులేదు. పైగా ఈ ఆడంబరాలన్నీ నాకు నచ్చవు. నాకొద్దు" అని గట్టిగా చెప్పేడు.

"చినిగిన పైజామాతో రోడ్లు వూడడవటమేం దేశసేవ కాదు గానీ, రావోయ్. డబ్బు కోసం కట్టి పడేయర్లే నిన్నిక్కడ."

సీతాపతి మాటలకి ఎదురు చెప్పటానికి సాహసించలేకపోయాడు శ్రీపతి. బిల్లు రాయిస్తే డెబ్బయిఆరు రూపాయలయింది —రెండు జతలు.

క్లాసుకు వెళ్లి కూర్చున్నా డన్న మాటే గాని ఆలోచనంతా గుడ్డలమీదే ఉంది శ్రీపతికి. సీతాపతి ఔదార్యం అతన్ని చాలా ఇరుకున పెట్టింది. అతని ప్రవర్తన కూడా అప్పులకంటే ఎక్కువగా ఉంది. అరవై రూపాయలతో ఆ వూళ్లో దిగిన తనకు తిండీ బట్టా అన్నీ అమరుస్తున్న ఆపద్బాంధవుడై నాడు సీతాపతి.

ఇన్‌స్ట్రక్టర్ శ్రీపతి పరధ్యానాన్ని తదేకంగా పరీక్ష చేస్తూ ఉండటం గ్రహించి అతన్ని మోచేత్తో కుదిపేడు ప్రక్కనే కూర్చున్న సీతాపతి. శ్రీపతి తెప్పరిల్లుకొనే సరికి ఏదో నిర్వచనాన్ని చెప్పమని అడగనే అడిగాడు ఇన్‌స్ట్రక్టర్.

శ్రీపతి లేచి నుంచున్నాడు. కాళ్ళూ చేతులూ జావకారినై. ముఖంనిండా చెమట క్రమ్మింది. నోట మాట రాలేదు. పరాకు చిత్తగించినందుకు శ్రీపతిని హెచ్చరికచేసి పాఠంలోకి వెళ్లిపోయాడు ఆ పెద్దమనిషి.

శ్రీపతికి తల కొట్టేసినట్లయింది. కడుపులో ఏదో బాధ మొదలైంది.

—పదకొండున్నర కాగానే వో పది నిముషాల విరామం ఉంటుంది. అందరూ సరదాగా మాట్లాడుకుంటూ బయటికి నడిచేరు, జేబుల్లోని ఖరీదైన సిగరెట్ పాకెట్లు చేతుల్లోకి తీసుకుంటూ.

శ్రీపతికి వాళ్ళందరూ అంత సరదాగా, సంతోషంగా ఉన్నందుకు ఉక్రోషం వచ్చింది. సన్నగా తనలో తను ఏదో గొణుక్కుంటూ వసారాలో తారట్లాడ సాగేడు. ఇతని వాలకాన్ని గమనిస్తూ అమూల్యమైన ఆ విరామ సమయంలో ఐదు నిముషాలు వెచ్చించాడు సీతాపతి.

"తీరిగ్గా రాత్రికి ఆలోచించవచ్చు గానీ, పద, కాఫీ త్రాగివద్దాం." అన్నాడు.

"నా కక్కర్లేదు." విసుగ్గా, దృఢంగా ఉంది శ్రీపతి సమాధానం. ఇది విని, చిరునవ్వు నవ్వుతూ సీతాపతి నుద్దేశించి ప్రక్కనే ఉన్న వో మిత్రు డన్నాడు. "ఆయనంతా ఘనపదార్థపు వ్యక్తి. మీరు రండి. పోదాం."

శ్రీపతి ఉడికిపోయాడు. ఏదో అనాలని గట్టిగా ప్రయత్నించాడు. కానీ అనలేక పోయాడు. సీతాపతి శ్రీపతి అవస్థ గ్రహించి చేత్తో అతన్ని ముందుకు నడిపించేడు. "కాఫీ అలవాటు చేసుకోండి ఇక్కడ కాలం గడవదోయ్" అంటూ ముందుకు సాగేడా మిత్రుడు.

సీతాపతితో కాంటీన్‌కు పోక తప్పలేదు శ్రీపతికి.

మధ్యాహ్నం ఒంటిగంటకు ఇద్దరూ కలిసి రూమ్‌కొచ్చి భోజనం పూర్తిచేశారు. సీతాపతి ఎక్కడో పనుందని వెళ్లేడు, అటునుంచి క్లాసుకు హాజరవుతానని. ఆఫీసుకు చేరటానికి శ్రీపతి ఏ నెంబరు బస్సెక్కి, ఎక్కడ దిగాలో అంతా వివరంగా చెప్పి వెళ్లాడు సీతాపతి. కాని శ్రీపతికి ఆరోజు మనసు మనసులో లేదు. సిటీలో బస్ ఛార్జీల క్రింద ఎక్కువగా ఖర్చవుతోందని కోపమొచ్చి, నడిచే వెళ్లాలని తీర్మానించుకున్నాడు.

ఫలితంగా రెండింటికి రూమ్ నుంచి బయలుదేరినవాడు మూడుంబావుదాకా తిరిగి



తేనెమనసులు

తిరిగి దారితప్పి, గత్యంతరంలేక అర్ధ రూపాయ రిక్షాకి చెల్లించి ఆఫీసుకు చేరుకున్నాడు.

శ్రీపతి ఏ అవస్థకు గురయినాడో వూహించగలిగిన సీతాపతికి అతనిమీద జాలి వేసింది గాని, ఒక అవర్ అయిన తర్వాత వచ్చిన ట్రైనీ మీద ఇన్‌స్ట్రక్టరుకు కోపమే వచ్చింది.

అవమానాన్ని అరటిపండులా మింగేస్తూ తల వంచుకోవటం తప్పలేదు శ్రీపతికి. సీతాపతి ప్రక్కన లేకుంటే తన పని 'ఖాళీ' యే నన్న విషయం తెలుసుకున్నాడు తనావేళ. ఈ సత్యానికి తార్కాణంగా ఆవేళ మరో ఉదంతమూ జరిగింది.

మిత్రుడి బాధని ఉపశమింపజేసేందుకు సినిమా కార్యక్రమం వేసేడు సీతాపతి. అందులోనూ అది ఇంగ్లీషు సినిమా. శ్రీపతికి జీవితంలో తొలి అనుభవం— ఇంగ్లీషు సినిమా చూడటం.

మరో లోకంలో గడిపినట్లయింది శ్రీపతికి సినిమా చూస్తున్నంతసేపూ. జీవితంలో తను తెలుసుకోవలసినవి చాలా ఉన్నాయనిపించింది. మనస్సులో అదో రకమైన జిజ్ఞాస రేకెత్తింది. సినిమా వదలిన తర్వాత జనం రద్దీలో సీతాపతీ, శ్రీపతీ విడిపోయాడు. హాలుకు కొద్ది దూరంలో శ్రీపతి మిత్రుడికోసం నిరీక్షిస్తూ నిల్చున్నాడు. అంతే ..... మర్నాడు ప్రొద్దున సీతాపతిని ఫోన్‌చేసి పిలిపించుకుని పోలీస్ లాకప్‌లో నుంచి బయటపడ్డాడు. తీరా విషయ మేమిటంటే – నగర పారిశుద్ధ్యాన్ని గురించి బొత్తిగా తెలియని శ్రీపతి న్యూసెన్స్ కేస్‌లో ఇరుక్కున్నాడు.

ఈ సంఘటన జరిగిన తర్వాత శ్రీపతికి సీతాపతిని వదలి తిరగటానికే భయం పట్టుకుంది. ఆఫీసుకు రావటం నుంచీ అన్ని పనుల్లోనూ ఇద్దరూ కలిసి తిరగటం మొదలెట్టేరు.

మూడు నెలల ట్రైనింగులోనూ ఒక నెల గడిచింది. ఈ నెలరోజుల్లోనూ మరి కొన్ని అనుభవాల్ని పొందేడు శ్రీపతి. వాటిల్లో ముఖ్యమైనవి రెండు. ఒకటి పన్నెండు అంతస్థుల 'ఎయిర్ కండిషన్డ్' భవనం మీదకి లిఫ్ట్‌లో వెళ్ళి అక్కడ్నుంచీ మద్రాస్ నగరాన్ని చూడటం, రెండవది తన వూహా చిత్రణకు విరుద్ధంగా ఉన్న బీచ్‌ని తిలకించటం. సముద్రాన్ని గురించి వో నికరమైన అభిప్రాయం ఉండేది శ్రీపతికి. అదేమంటే వాళ్ళ వూరి ప్రక్కన ప్రవహించే గుండ్లకమ్మలాగే రెండు ఒడ్డులూ కనబడతాయని. అంతేగాక, అది ఏదో ఒక దిశ నుంచి మరో దిశకు ప్రవహిస్తూ ఉండాల్సిందేనని అతని నమ్మకం. వీటిలో ఈ ఒక్క లక్షణమూ అతను చూసిన సముద్రానికి లేకపోవటం వింతగానే అనిపించిందతనికి. తన వూహా రూపాన్ని గురించి శ్రీపతి సీతాపతికి చెప్పినప్పుడు అతను శ్రీపతి అమాయకపుటూహకు నవ్వుకున్నాడు.

ఆరోజు.....

అర్ధరాత్రి ఎందుకో నిద్ర మెళుకువచ్చి లేచాడు సీతాపతి. రూమ్‌లో 'జీరో వాట్ బల్బు' వెలుగుతూనే ఉంది. అలారం టైంపీస్ టిక్కుటిక్కుమంటూ పన్నెండుంబావుని సూచిస్తూనే ఉంది. ప్రక్కకు తిరిగి చూస్తే శ్రీపతి పక్కమీద లేడు.

సీతాపతి ఆశ్చర్యపోయాడు. క్షణంసేపు అతని మనస్సులో రకరకాల సందేహాలు కలిగినై. లేచి గది బయటికి నడిచేడు.

డాబా పిట్ట గోడపైన మోకాళ్ళమీద తల ఆనించి కూర్చుని ఉన్నాడు శ్రీపతి.

సీతాపతి నెమ్మదిగా, అతని దగ్గరగా వెళ్ళి భుజంమీద చెయి వేశాడు. శ్రీపతి ఉలిక్కిపడి తలెత్తేడు.

శ్రీపతి ముఖాన్ని చూసి గతుక్కుమన్నాడు సీతాపతి. ఏదో అడగాలనిపించింది కాని, ఎలా అడగాలో, ఏం మాట్లాడాలో అర్థంకాలే దతనికి.

శ్రీపతి కొంచెం తేరుకుని ముఖం తుడుచుకుని ప్రక్కకు తిరిగేడు, కాని అతని చెంపల వెంట చారలు కట్టిన కన్నీళ్లని మాత్రం తుడుచుకోలేకపోయాడు.

"ఏం జరిగిందీ శ్రీపతీ!" ప్రేమ, ఆప్యాయతల కంటే వాత్సల్యం ధ్వనించిందంటే బాగుంటుంది సీతాపతి ప్రశ్నలో.

ఈ అనునయింపుతో మనసులో బాధనంతా బయటికి తోడినట్లయింది శ్రీపతికి. పెదవులు వణికినై. ముక్కుపుటాలు ఎగిరెగ్గి

రుద్ధమైన కంఠంతో అన్నాడు. "ఉమ మీద పిడకల వచ్చింది సీతాపతీ ! నా మనస్సేమీ బాగాలేదు. ఒక్కసారి ఇంటికి పోయి రావాలనిపిస్తోంది."

సీతాపతి తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు. 'హాస్, ఇంతేనా' అని మనసులో అనుకున్నాడు, పైకి అనేస్తే శ్రీపతి బాధ పడతాడని.

కొద్ది క్షణాలైన తర్వాత, శ్రీపతి మనస్సు బాగుచేయాలని అనేకవిధాల ప్రయత్నించాడు. కాని శ్రీపతి మాత్రం చలించలేదు. తహతహ లాడిపోతున్న తన హృదయాన్ని, ఆవేదనని, బెంగను, అత్తను సీతాపతి ముందుకు కుప్పబోసేడు.

సీతాపతికి జాలి కలిగింది శ్రీపతి అవస్థ చూసేసరికి. రెండు గంటల బండికి వెళ్లటానికే నిశ్చయించుకున్నారు. దానికి అవసరమైన ప్రయత్నాలన్నీ చేయటం ప్రారంభించారు.

—మర్నాడు. ఒంటిగంటకి శ్రీపతి స్వగ్రామానికి ఏడుమైళ్ల దూరంలో ఉన్న టౌన్‌లో దిగేరు ఇద్దరూ. అక్కణ్నుంచి దేవుడొచ్చినా వీళ్ల వూరు నడిచే వెళ్లాలి. కనుక ఇద్దరూ నడవటం మొదలెట్టేరు.

సగం దూరం వచ్చేసరికి తుంపరలా వర్షం కురవటం మొదలైంది. మూడు గంటల్లో ఐదుమైళ్ల దూరం నడిచి కొండ మలుపు తిరిగేరు.

ఎదురుగా ఉరవళ్లు పరవళ్లతో పారుతున్న ఏరును చూసేసరికి శ్రీపతి కాళ్లు చచ్చుపడినై. నిస్సహాయంగా అలాగే ఉసూరుమంటూ కూర్చుండిపోయాడు—ప్రక్కనే ఉన్న పాడుబడిన దేవాలయ మండపంలో. సీతాపతీ కూర్చున్నాడు సుళ్లుతిరిగే నీటి ప్రవాహాన్ని తిలకిస్తూ.

"చేతికి అందిన పండును తీసుకోబోతున్న తరుణంలో కొమ్మ చెయిజారినట్లుయింది చూశావా సీతాపతీ ! నా బ్రతుకే ఇలా ఉంది. ఇంత ఆత్రంగా పరుగెత్తుకొస్తే ఇదీ జరిగింది. ఏరు పోటు తీస్తే తప్ప మా వూరికి పోయే యోగం లేదు. మిగిలిన మూడు దిక్కులూ ఇలాగే ఉంటై." బాధగా అన్నాడు శ్రీపతి.

సీతాపతికి మనసు కలచినట్లయింది. పెట్టిన పాతిక రూపాయలు, పడిన శ్రమా అంతా దండగే. ఆ దగ్గరలో ఉన్న వాళ్లని విచారిస్తే తెలిసింది. ఏరు క్రితం రాత్రే వచ్చిందని నాలుగు రోజుల వరకూ తగ్గదనీ.

అడిగింది లేదన్నప్పుడు ఏడ్చే పసిపిల్లాడిలా, శ్రీపతికి ఏడుపొచ్చింది.

ట్రైనింగ్‌లో రెండు రోజులు సెలవు పెట్టటమే కూడనిపని ఆ శాఖ రూల్స్ ప్రకారం. అర్ధరాత్రి వెళ్లి ఆ ఇన్‌స్ట్రక్టర్‌కి అరవై కారణాలు చూపితే దయతలచి 'సరే' అన్నాడు. దాన్ని సద్వినియోగ పరచుకోలేకపోగా, ఇంకా రెండు రోజులు పొడిగించడం జరిగితే వచ్చిందన్న ఉద్యోగానికి పురిట్లోనే సంధికొట్టే ప్రమాదముంది. కనుక తిరిగి వెళ్లటమే శ్రేయస్కరం.


ఆలోచనని ఒక గమ్యానికి తెచ్చి అదే మాట శ్రీపతితో అన్నాడు సీతాపతి. నిస్సహాయ స్థితిలో మవునాన్నే ఆశ్రయించాడు శ్రీపతి.

సాయంత్రం దాకా అక్కడక్కడా తిరిగి చల్లటి, తియ్యటి ఏటి నీటితో మండుతున్న మనసును దేహాన్ని చల్లబడేసి తిరుగుముఖం పట్టేరు ఇద్దరూను.

దారిలో శ్రీపతి స్వవిషయాల వివరాల్ని మరికొన్నిటిని అడిగి తెలుసుకున్నాడు సీతాపతి. అయితే, ఉమని తలచుకొని తనలో తను ఆనందాన్ని అనుభవించటమే గాని, ఆమెను గురించిన విశేషాలేమీ చెప్పలేదు శ్రీపతి, సీతాపతికి. 'ఉమ' అంటే ఏవేవో వింత వింత అభిప్రాయాలు కలిగిన మనస్సు పరవశించి, తీయతీయగా భావనలు సాగటంతో, ప్రత్యేకించి ఆమెను గురించి ఏమీ అడగలేకపోయాడు సీతాపతి కూడా. ఆ ప్రయాణం అలా ముగిసింది.

* * *

ఆధునికమైన పద్ధతులను, అలవాట్లను విస్మరించి, వాటికి దూరంగా ఉండాలని ప్రయత్నించటం 'అభివృద్ధి'ని నిరోధించటమేనని, కనుక నిత్యమూ పరివర్తన చెందే సామాజిక వ్యవస్థని అర్థం చేసుకోవాలంటే, సాహిత్యమే శరణ్యమనీ, అందునా ఆధునిక ఆంగ్ల సాహిత్యం చదివితీరాలనీ చెప్పిన సీతాపతి మాటల్ని శ్రీపతి ఖండించాడు.



"నీ మాటల్ని నేను పూర్తిగా అంగీకరించలేను. సాహిత్యమనేది దేశానికి పరిమితమైంది. కాకపోయినా, మన దేశకాల పరిస్థితుల్ని తెలుసుకోవటానికి మన సాహిత్యమే చదవాలి గాని, ఆ పాశ్చాత్య సాహిత్యాన్ని చదవటం ఎందుకు ?" అన్నాడు.

"అలా కాదు. ఆ సాహిత్యంలో అందాలు ఎక్కువ. ఉదాహరణకు షేక్స్పియర్..."

"మాట మాటకూ షేక్స్పియర్ నాటకాలంటారు, వాటిలో అంత గొప్పదనం ఉందని నే ననుకోను."

"ఏ నాటకాలు చదివేవు నీవు ?"

"నేనేమీ చదువలేదు."

"ఏమీ చదవకుండానే అలా మాట్లాడ వద్దు. అన్నీ చదువు. అప్పుడు చెబుదువు గాని."

శ్రీపతి మాట్లాడలేదు. అతను ఎప్పుడూ అంతే. మంచైనా చెడ్డైనా ఏదేనా సలహా చెప్తే, చేస్తాననడు, చేయననడు.

* * *

ట్రైనింగ్ పూర్తయింది. అదృష్టవశాత్తు, శ్రీపతినీ, సీతాపతినీ ఒకే

తేనెమనసులు

వూళ్లో ఒకే ఆఫీసుకు బదిలీ చేశారు. ఉద్యోగస్థులుగా సీతాపతి స్నేహాన్ని, సాహచర్యాన్నీ అలాగే పొందుతూ ఉండటాన్ని శ్రీపతి ఎంత అదృష్టంగా భావించాడో శ్రీపతి స్నేహాన్ని అంతకంతగా వాంఛించాడు సీతాపతి.

ఆఫీసులో ఉద్యోగంలో ప్రవేశించిన రోజు నుంచీ, వాళ్లిద్దరూ ఎడబాయని జంటగా కాలం గడపసాగేరు.

నెల తిరిగేసరికి వో వార్త వాళ్ల చెవిన బడింది—పై ఆఫీసు ఉత్తరువు ద్వారా—పర్వీసు నిబంధన లేకుండా, ఏవో మూడు పరీక్షలు ప్యాసయితే ఉన్నత పదవికి అవకాశం లభిస్తుందనేది విషయం. ఉత్సాహవంతులైన యువకులంతా దీక్షగా పరీక్షలకు చదవటానికి సమాయత్తం కాసాగేరు.

శ్రీపతి మాత్రం తన కంతటి గొప్ప పదవులమీద ఆశ లేదని, అధవా ఉన్నా, తనవంటి యస్సెల్సీ వాడు ఆ పరీక్షల్లు ప్యాసు కాలేడని ముడుచుకు కూర్చున్నాడు. సీతాపతికి అతనిమీద కోపం వచ్చింది. బతుకులో ఏదో ఒకటి సాధించాలనే ఆశ లేనప్పుడు జీవితం ఎడారిలా తయారవుతుందనీ, మనం చేసే పనుల ఫలితాలు మన చేతుల్లో లేవనీ, శ్రీపతి చెవుల్లో గూడు కట్టుకుని పోరేడు సీతాపతి.

వారం రోజుల తర్వాత కనిపించి "నేనూ పరీక్షలకు చదువుతున్నాను" అన్నాడు శ్రీపతి.

కాలం పరుగులు తీస్తుంటే, శ్రీపతి—సీతాపతుల మధ్య అనుబంధం దగ్గర కాసాగింది. పైకి అమాయకత్వం మూర్తీభవించిన శ్రీపతి తన మేధస్సులోపలి బుద్ధి కుశలతను ఉపయోగించుకుని పరీక్షలు పూర్తిచేశాడు. ఇదమిద్ధమైన కారణాలు లేకుండానే చివరి పరీక్ష పోయింది. సీతాపతికి.

శ్రీపతి ప్రమోషన్‌మీద విశాఖపట్నం బదిలీ అయి వెళ్లేటప్పుడు కంట తడి బెట్టేడు సీతాపతి.


"దేవుడిలాంటి నిన్ను వదలి వెళ్లాలంటే ఏదో నరకానికి పోతున్నట్లుంది సీతాపతీ" అని పరితపించాడు శ్రీపతి.

బరువెక్కిన గుండెలతో వీడ్కోలిచ్చుకున్నారు పరస్పరం. శ్రీపతి వెళ్లేటప్పుడు నిండు హృదయంతో అతనన్న మాటలో సీతాపతి చెవుల్లో మ్రోగసాగాయి చాలాకాలంవరకూ. "అడవిలో ఒంటరిగా తిరిగే జంతువులాంటి నన్ను మనిషినిచేసి, ఒక ఉనికిని, వ్యక్తిత్వాన్ని కలిగించావ్ సీతాపతీ ! నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోగలిగింది కాదు."


దానికి తను నవ్వుతూ యిచ్చిన సమాధానమూ గుర్తుకొస్తూనే ఉంటుంది సీతాపతికి. "ఒక యింటివాడ్ని కూడా చేసేస్తే నా బాధ్యత తీరినట్లుండేది."

* * *

"మామ్ నవలల్లో 'ది పెయింటెడ్ వీల్' నాకు బాగా నచ్చిన నవల. అలాగే ప్రీస్ట్లీ 'త్రీ టైమ్స్ ప్లేస్' లో చివరిది 'ఐ హేవ్ బీన్ హియర్ బిఫోర్' అనే నాటకమూ నచ్చింది. మిగిలిన పెద్ద రచయితల్లో ఎక్కువగా నచ్చేవి హార్డీ 'టెస్'



"సార్ ఇక్కడ చిన్న పెన్నులు దొరుకుతాయా?"



పుస్తకములు

5 పుస్తకముల సెట్టు రు. 5–50.

(1) కొక్కోకశాస్త్రం (2) సుహాగ్రాత్ (3) చుంబన పద్ధతులు, (4) 84 ఆసనములు, (5) రహస్యఫోటో ఆల్బం. ఒక్కొక్క పుస్తకం రు. 2/–. పోస్టేజి, ప్యాకింగ్ అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.

SULEKHA BOOK DEPOT
APW(75) PHAPALA, ALIGARH.


నెలకు రు. 350/- సంపాదించండి

ఎంబోసర్లు, రేడియోలు, కుట్టుమిషీనులు, తాళములు, ఎలెక్ట్రిక్ సామానులు వగైరాలకు ఆర్డర్లు సేకరించుటకు నెలకు జీతం రు. 350/– మరియు టి. ఏ. లేక కమిషన్ పద్ధతిమీద ట్రావెలింగ్ ఏజెంట్లు కావలెను. పట్టణము లేక గ్రామ ప్రాంతములలో పనిచేయు వారికి సైకిలు ఉచితముగా యివ్వబడును. రు. 10–85 పంపిన స్టేషనరీ వగైరా నమూనాలు పంపబడును.

JAPAN AGENCIES (WAT-10)
. PHAPALA, ALIGARH.

35 ఎం. ఎం. హోమ్ సినీ ప్రొజెక్టర్

మీ యింటిలోనే సినిమా చూచి ఆనందించండి. మీరు కోరిన చిత్రాలను మీ గదిలో తెరమీద టార్చి లేక



ఎలెక్ట్రిసిటీ సహాయంతో చూడవచ్చును. సినిమాలోవలె పూర్తి సైజు చిత్రముల నటన, నాట్యం చూడవచ్చును. స్లయిడ్స్ కూడ ప్రదర్శింపవచ్చును. ధర: రు22–50.

వి.పి.పి.చార్జి రు4–50; 20 అ॥ ఫిలిం ఉచితం. అదనపుఫిలిం గజం25పై. స్పెషల్ స్క్రీన్ గుడ్డ రు. 4

SULEKHA TRADERS (WAT - 27)
BEAT No. 13, ALIGARH.



పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైనచర్యను గురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళవివరములున్నూ, మీ సరియైన చిరునామాన్నూ, వెంటనే వ్రాసిపంపండి. జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసినతేదీ లగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయము కలుగునో, ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1.25 పై. లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. ఛార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహములేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనిఎడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

PT. DEV DUTT SHASTRI, RAJ JYOTSHI (A. W. P.)
P. O. BEAS (Amritsar.)



ఫ్యాషన్-ప్రియురాలైన ప్రతి యువతికి తెలిసినదేమిటంటే...

ఫినిక్స్ వాయిల్‌లు ఫ్యాషన్‌కి అనుకూలమైనవి. అవి చక్కటి నేత మరియు అత్యంత అందమైన రంగులు గలవి. నాణ్యతకు సాటి లేనివి. మీరూ ఎందుకు ధరించకూడదు?

ఫినిక్స్ మిల్స్

చిల్లర షాప్‌లు:
మద్రాస్: 33, రటన్ బజార్, 5/93, రాయపేట హై రోడ్, లజ్.
మదురై: 1, 2 & 2ఎ అమ్మన్ సన్నధి స్ట్రీట్

రవీంద్రుడి 'గోరా', ఆస్టిన్‌ది 'ప్రైడ్ అండ్ ప్రిజుడిస్' "

"ఐతే అమ్మాయ్, మూడేళ్ళల్లో ఇన్ని ఇంగ్లీషు నవలల్ని చదివే వంటున్నావ్ తెలుగు సాహిత్యం పెద్దగా తెలియదను కుంటాను."

ఆమె గలగలా నవ్వింది. "మీరు బలే పొరబడ్డారు. ఈ నవలలన్నీ నేను చదవ లేదండీ! మా అన్నయ్యచేత చదివిం

తేనెమనసులు

చాను. వాడే నాకు వీటి సంగతంతా విమ ర్శలతో సహా చెప్పేడు."

"ఓహో! అదా సంగతి!!"

కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత ఆమె మొదలెట్టింది. "చూడండి మాష్టారూ! మీరేమీ అనుకోనంటే ఒక్క టడుగు తాను."

"అడుగమ్మా. దానికేం?"

"మీరు కాలేజీలో ఒక శాఖ కంతటికీ అధిపత్యం వహిస్తూ, గొప్ప రచయితగా, విమర్శకుడుగా పేరు తెచ్చుకున్నారుగదా. ఒక్కొక్క సాహిత్య ప్రక్రియను తరచి, తరచి కొన్ని లక్షణాలను, స్టాండర్డ్సునీ మీ వ్యాసాల్లో నిర్దేశిస్తారు గదా...."

"ఏదో, అదో పరిశ్రమ. మనసుకు కొంత ఉల్లాసంగానూ ఉంటుంది."

"మరి మీరు ఏ నవలో, కథో, కావ్యమో వ్రాసేటప్పుడు ఆ విలువల సంగతి మర్చిపోతారేం?"

వెంటనే ఒక్క క్షణంపాటు గంభీరమైన వాతావరణం ఏర్పడింది.

రైలు శబ్దంచేస్తూ కూతవేసి, సాగిపోతూనే ఉంది.

ఆ పెద్దమనిషి గొంతు సవరించుకొని ఏదో మాట్లాడటం మొదలెట్టేడు, అక్కడ్నుంచీ సంభాషణ తెలుగు సాహిత్యంమీద తెలుగుజాతి ఔన్నత్యంమీద సాగింది.

రైలు ఏదో స్టేషన్లో ఆగింది.

"నిండుకుండలా తొణక్కుండా, పెదవి విప్పకుండా కూర్చుంది, మీ అక్కయ్య."

"పదిమంది బదులూ నేను మాట్లాడుతాను గదండీ. వాగుడుకాయని. మా అక్క తత్వమే అంత. కలుపుగోరుతనం తెలీదు."

ఆమె మళ్లీ వీణ మీటినట్లు నవ్వి "అంతేగదూ రమా?" అంది—

మగతనిద్రలో ఈ సంభాషణంతా వింటున్న సీతాపతి ఉలిక్కిపడి లేచి కూర్చుని లోలోపల ఉచ్చరించాడు 'రమ!' శ్రీపతి అక్కయ్య రమ జ్ఞాపకం వచ్చింది. ఒకవేళ అవిడేనేమో ఈ రమ. అయితే ఇంతవరకూ గలగలా మాట్లాడుతూ ఉంది ఉమా?

ఉత్సుకతని ఆపుకోలేక పై బెర్తుమీద నుంచీ తల వంచి సరిగ్గా తన క్రింది బల్లమీద కూర్చున్న ఇద్దరు యువతుల్నీ చూసేడు.

పాల నురగవంటి తెల్ల షిఫాన్ చీరె కట్టుకుని, ఆ తెలుపును మించిన ధవళ తని నింపుకున్న పలువరుసను తళుక్కు

మనిషినూ, నవ్వుతోంది. అప్పటివరకూ మాట్లాడిన వ్యక్తి ఆవిడే కాబోలు. ఆమె ప్రక్కగా దీర్ఘాలోచనా నిమగ్నురాలై తపస్వినిలా గంభీరంగా కూర్చుంది 'రమ.'

శ్రీపతి అక్కా, చెల్లెలు వీళ్ళేనా? అయితే శ్రీపతి ఇంగ్లీషు సాహిత్యమంతా చదివేడన్నమాట. చదివి, చెల్లెలికి సారాంశమంతా చెప్పి ఉండాలి. విన్న పరిజ్ఞానంతోనే ఉమ యింతగా మాట్లాడిందంటే శ్రీపతి ఎంత సాకల్యంగా వాటిని చదివేడో అర్థమవుతోంది. సీతాపతి ఆలోచనలు కట్టిపెట్టి క్రిందికి దిగి, వాళ్ల కెదురుగా ఉన్న బల్లమీద ఆ పెద్దమనిషి ప్రక్కగా కూర్చున్నాడు.

రమ కళ్లల్లోని కాంతికి, ముఖంలోని తేజస్సుకు, శరీరపు బంగారు రంగు మెరుపుకూ విచలితు డైనాడు సీతాపతి. ముగ్ధమోహన మూర్తిగా గోచరించిందామె. కొద్దిసేపు తటపటాయించి అడిగేడు "మీ దేవూరండీ."

ప్రక్కనున్న పెద్దమనిషి సీతాపతి వంక తేరిపార చూసి నొసలు చిట్లించాడు.

రమ చెప్పింది. "ప్రస్తుతం వైజాగ్."

సీతాపతి తటాలున అడిగేశాడు. "మీ చెల్లి పేరు ఉమ. మీ తమ్ముడు శ్రీపతి. అవునా ?"

"ఆఁ !" విస్తుపోయారు ఇద్దరమ్మాయిలూ.

"నా పేరు సీతాపతి !"

"అలాగా. సీతాపతిగారు మీరేనన్నమాట. చాలా సంతోషం." ఉమ కిన్నెర కంఠస్వరంలో కోటి రాగాలు పలికినై.

పరస్పర కుశలప్రశ్నలతోను, విశేషాలతోనూ ఆనందాతిరేకంతో మాటల తడబాటుతోనూ గడిచిపోసాగింది కాలం. మాటల మధ్యలో చెప్పింది ఉమ. "మా అక్కయ్యకు వివాహం నిశ్చయమైంది. మరో నెల్లో ముహూర్తాలు పెట్టించవచ్చు."

"అలాగా, చాలా సంతోషం." అన్నాడు సీతాపతి.

"ఇంతకంటే సంతోషిస్తారు మరో వార్త వింటే. మా అన్నయ్య కూడా గృహస్థు కావాలనుకుంటున్నాడు. ఆలశ్యమలా మీరా అమ్మాయిని చూసి ఒ. కే. అనటమే."

"ఐ. సీ. ఎవరా అమ్మాయి ?"

"ఒక పోస్టు గ్రాడ్యుయేట్. రేపు మా అక్కయ్య పెళ్లికి వచ్చినప్పుడు చూద్దురుగాని."

"ఉమా, ఏమిటే ఆ వాగుడు ....?" రమ విసుగ్గా చూసింది.

రైలు స్టేషన్లో ఆగింది.

"వస్తామండీ" అంటూ లేచారు ఉమ, రమ. సీతాపతి ఉమ కళ్లల్లోకి చూస్తూ "మంచిది" అన్నాడు. బేగ్ తీసుకుని రమ ముందు నడుస్తుంటే, మందగమనంతో ఆమె ననుసరించింది ఉమ. వాళ్ల వెనగ్గా నడిచేడు సీతాపతి. తనంటే శ్రీపతికున్న గౌరవం, అతడ్ని ముగ్ధుడ్ని చేసింది.

కంపార్ట్మెంటు తలుపు దగ్గర వెనక్కు తిరిగింది రమ. "రా, ఉమా!" అంటూ ఆమె చెయ్యి పుచ్చుకుని క్రిందికి దిగింది.

గుండె గుబగుబలాడింది సీతాపతికి ! ఆశ్చర్యం గొంతులో కొట్టుకులాడ, ఆతృత కళ్లల్లో చలించసాగింది !!

ఇద్దరూ ప్లాట్‌ఫారంమీదికి దిగి నిలబడ్డారు.

గేటులో నిలబడిన సీతాపతి ఎండిన పెదవుల్ని తడుపుకుంటూ "అయితే.... ఉమ ...." అన్నాడు. రమ వైపు ప్రశ్నార్థకంగా చూస్తూ.

"అవును. నా చెల్లి ప్రకృతి సౌందర్యాన్ని చూసే అదృష్టానికి నోచుకోలేదు" అంటూ ముందుకు సాగింది రమ.

సీతాపతి నిస్తబ్ధు డయ్యేడు.

* * *

'చూపు లేకుంటే నేం, నా ఉమ ముఖంలోని వర్ఛస్సు నా జీవన గమనానికి కరదీపిక—' సీతాపతి తన డైరీలో మే ఏడవ తారీఖుని పచ్చ సిరాతో సున్నా చుట్టి వ్రాసుకున్నాడు.



"చెంపకున్న చెప్పు డిజైను చాలా బావుందిరోయ్!"

వారఫలం

18-3-1966 శుక్రవారం మొదలు
24-3-1966 గురువారం వరకు.

మేషం : ఈవారం శుభా శుభ మిశ్రమంగా ఉంటుంది. వారం ప్రారంభంలో అన్ని వ్యవహారాలూ అనుకూలంగానే ఉన్నా, వారాంతానికి వ్యయ ప్రయాసలకు గురికావలసి వస్తుంది. వృత్తిలో కొంతమంది వ్యక్తులు మీకు లేని ఆశలు కల్పించి తాము ఆనందించడానికి ప్రయత్నిస్తారు. ఉద్యోగంలో మీ పరిస్థితి బాగానే ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో మీ కృషి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ప్రయాణాలు శ్రమమీద ఫలిస్తాయి. మిత్రులకు సహాయం చేయగలరు. కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది.

స్త్రీలకు—ఆరోగ్యం ప్రస్తుతం బాగా ఉన్నా, నిర్లక్ష్యం చేయుతగదు. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది.

వృషభం : వృత్తి వ్యాపారాల్లో మీరు యిదివరకు యెంతో కృషి చేసి అసాధ్యం అనుకొన్న వ్యవహారాలు కూడా యిప్పుడు సానుకూలపడగల సూచనలు ఉన్నాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. కొన్ని అనవసరమైన వ్యవహారాల్లో చిక్కుకొని యిటువంటి అమూల్యమైన కాలాన్ని వ్యర్థం చేసికొనే ప్రమాదం ఉంది. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాలు బలహీనపడే సంఘటనలు జరుగుతాయి. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

మిథునం : రావలసిన డబ్బు సమయానికి అందకపోవడంవలన వృత్తి వ్యాపారాల్లో కొన్ని వ్యవహారాలు ఆకర్షణీయంగా కన్పిస్తాయిగాని. ఫలితం మాత్రం సంతృప్తికరంగా ఉండదు. వృత్తిలోమీకు ముమ్ముందు ఉపయోగించగల వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. ఉద్యోగంలో కార్య భారం పెరిగినా మీ కృషిని అధికారులు గుర్తించగలరు. స్థిరాస్థి వ్యవహారాల్లో కొత్త సమస్యలు తలెత్తవచ్చును. కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. సంఘ సేవికలకు యోగవంతమైన సమయం.

కర్కాటకం : వారం ప్రారంభంలోనే వృత్తి వ్యాపారాల్లో చికాకులు కలగడంవలన తరువాత కొంచెం బాగానేఉన్నా, యీవారం సంతృప్తికరంగా ఉండదు. భాగస్వాములతో కలసిచేసే వ్యాపారాల్లో యిదివరకు యేర్పడిన చికాకులు తొలగిపోతాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం తగదు. వారాంతంలో వృత్తి రీత్యా చేసే ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి. కోర్టు వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. ఉద్యోగంలో యితరులు చేసిన పొరపాట్లకు కూడా మీరే బాధ్యత వహించవలసి వస్తుంది.

స్త్రీలకు—శుభ కార్యక్రమాలు ఒడుదుడుకులేకుండా నెరవేరతాయి. అలంకార వస్తువులు కొంటారు.

సింహం : సాహసించి యేపనీ చేయడానికి వీల్లేని సమయం. వృత్తి వ్యాపారాల్లో యెప్పుడు యేమి జరుగుతుందో అనే ఆందోళన కలగగల సూచనలు ఉన్నాయి. భారీ ఎత్తునచేసే వ్యాపారాలు వాయిదా వేయడం మంచిది. వృత్తిలో మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగించవచ్చును. ఇప్పుడు మీరు జరిపే వ్యవహారాలవల్ల కొంత డబ్బు చిక్కుల్లో పడే ప్రమాదం ఉంది. ఉద్యోగంలో కొంతమంది వ్యక్తులు పని గట్టుకొని మీమీద దుష్ప్రచారం చేయవచ్చును. స్వల్ప అనారోగ్యం చేయవచ్చును. బంధు మిత్రులను కల్సుకొంటారు.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. ఆడంబరంకోసం వ్యయం చేస్తారు. దైవకార్యాలు నెరవేరతాయి.

కన్య : వృత్తి వ్యాపారాల్లో మీరు అనుకొనేది ఒకటి జరిగేది మరొకటి కావచ్చునుగాని, దానివలన మీకు కలిగే నష్టమేమీ ఉండదు. వ్యాపారరీత్యా మీరు యిదివరకు జరిపిన వ్యవహారాలవల్ల యిప్పుడు ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. వృత్తిలో చాలా శ్రమ మీద స్వల్పాభివృద్ధిని సాధించగలరు. ఉద్యోగంలో యెవరినీ విశేషంగా నమ్మి వ్యవహరించడం తగదు. రాజకీయ వ్యవహారాల్లో కొత్త సమస్యల నెదుర్కోవలసి వస్తుంది. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. ఎవరితోనూ వాద ప్రతివాదాలకు దిగడం మంచిది కాదు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో అధికవ్యయం జరుగుతుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు. ప్రయాణాలోచనలు చేస్తారు.

తుల : వృత్తి వ్యాపారాల్లో కొంచెం శ్రమ కలిగినా, దానికి తగిన ప్రతిఫలం లభించడంవలన యీవారం సంతృప్తికరంగానే ఉంటుంది. అధికారుల వల్ల జరగవలసిన వ్యవహారాల్లో అధికారులు మీ యెడల అనుకూలంగానే ఉంటారుగాని యితరుల జోక్యంవలన ఆలస్యం జరుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. ఉద్యోగంలో మీ కృషి అధికారుల దృష్టిని ఆకర్షించగలదు. సాంఘిక కార్యక్రమాల్లో ప్రయోజనంగల సంభాషణలను జరపగలరు. కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. సాహిత్య కళారంగాల్లో కృషి చేసే వారికి అనుకూలమైన సమయం.

స్త్రీలకు—ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. శుభ కార్యాల విషయంలో మీ ప్రయత్నాలకు బంధువుల సహాయం లభిస్తుంది.

వృశ్చికం : వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగానే ఉంటుందిగాని, కొన్ని వ్యవహారాల్లో కార్యసాధనకోసం మీ అభిప్రాయాలకు వ్యతిరేకంగా వ్యవహరించవలసి వస్తుంది. నూతన వ్యాపారాలు కొంచెం శ్రమ మీద ఫలిస్తాయి. వృత్తి రీత్యాచేసే ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి. ఆర్థికంగా మీ స్వంత వ్యవహారాలు బాగానే ఉన్నా యితరుల నిమిత్తం శ్రమ పొందవలసి వస్తుంది. ఉద్యోగంలో మీ పరిస్థితి యిదివరకటికంటే బాగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో మీ కృషికి ఆటంకాలు వస్తాయి. ఆరోగ్యం సామాన్యంగా ఉన్నా, శరీరశ్రమతో కూడిన కార్యక్రమాలు పనికిరావు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. శుభమూలంగా ధన వ్యయం జరుగుతుంది. సాటివారిలో గౌరవం బాగాఉంటుంది.

ధనుస్సు : వృత్తి వ్యాపారాల్లో ఆదాయంకంటే హడావుడి అధికంగా ఉంటుంది. ఇతరుల నిమిత్తం మీరుచేసే ప్రయత్నాలు సులువుగానే నెరవేరతాయి గాని, మీ స్వంత వ్యవహారాల్లో చాలా ప్రతిఘటనను ఎదుర్కోవలసి వస్తుంది. వృత్తిలో కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని నమ్మించి మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. మీరు స్వంతంగా చేసే వ్యాపారాల కంటే, భాగస్వాములతో కలసిచేసే వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి. వారం ప్రారంభంలో సాహసముతో కూడిన వ్యవహారాలు కొంతవరకు లాభిస్తాయి. ప్రయాణాలు శ్రమమీద ఫలిస్తాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధువుల వ్యవహారాల్లో మీరు శ్రమపడి కృషిచేసినా నిష్ఠూరం తప్పక పోవచ్చును.

మకరం : గతవారంకంటే యీవారం బాగా ఉంటుంది. రావలసిన డబ్బు సమయానికి అందడం వలన అన్ని వ్యవహారాలు అనుకొన్నట్లుగా నెరవేరతాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు స్వల్పంగా లాభిస్తాయి. వృత్తిలో సాటివారి పోటీని ఎదుర్కొని అనుకూలతను సాధించగలరు. ఉద్యోగంలో సాటివారితో యిదివరకు యేర్పడిన భేదాభిప్రాయాలు తొలగిపోతాయి. కోర్టు వ్యవహారాల్లో అనుకూల వార్తలను వింటారు. మిత్రుల వ్యవహారాల్లో జోక్యం చేసికొనవలసి వస్తుంది. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. సాటివారిలో గౌరవం బాగాఉంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కుంభం : వ్యాపారంలో మీ అభిప్రాయాలకు తగిన అవకాశాలు లభించడంవలన అధికాదాయంతో పాటు ఆత్మవిశ్వాసం కూడా లభిస్తుంది. వృత్తిలో అభివృద్ధికి ఆటంకంగా ఉన్న వ్యవహారాలు మీకు అనుకూలంగా పరిష్కరింపబడగల సూచనలుఉన్నాయి. ఆర్థికంగా మీ స్వంత వ్యవహారాలు బాగానే ఉన్నా, యితరుల నిమిత్తం శ్రమ పొందవలసివస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. కుటుంబ కార్యక్రమాలు కొంచెం శ్రమమీద నెరవేరతాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. ఆడంబరంకోసం వ్యయం చేస్తారు. దైవ కార్యాలు నెరవేరతాయి.

మీనం : వారం ప్రారంభంలోని వృత్తి వ్యాపారాల్లో వ్యయ ప్రయాసలకు గురికావలసివస్తుంది. కాని, తరువాత అన్ని వ్యవహారాల్లోనూ అభివృద్ధిని సాధించగలరు. కొన్ని వ్యవహారాల్లో అధిక వ్యయం జరగడంవలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. వృత్తిలో మీ తాలూకు వస్తువులుపోయే ప్రమాదం ఉంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో యితరుల జోక్యంవలన నష్టం వస్తుంది. ఉద్యోగంలో మీరు చేయవలసిన ముఖ్యమైన నిర్ణయాలు వారాంతంలో చేయడం మంచిది. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. మిత్రుల సహాయం లభిస్తుంది.


స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు బాగానే ఉంటాయి. విలాస వస్తువులు కొంటారు. పాటి వారిలో గౌరవం లభిస్తుంది.

—మహేష్ ●



గోవా జానపద గాథలు-కథకులు

రచయిత
వి.ఎస్. సుఖ్తంకర్
అనువాదం
పాలగుమ్మి పద్మరాజు



నోరు విప్పద్దన్నారు...

ఒకరోజు సాయంకాలం సుబ్రాయ్ శాణే ఇంటిముందు గుర్రబ్బగ్గీ ఒకటొచ్చి ఆగింది. ఇద్దరు పెద్ద మనుషులు, తెల్లటి తలపాగాలూ, మంచి దుస్తులూ వాళ్ళూ దర్జాగా దిగారు. ఎనిమిదేళ్ల ఊష్మా పక్కింటి గుమ్మంలో వీళ్ల రాకకోసం కాచి పెట్టుకుని కూర్చుంది. వీళ్లు బండి దిగ్గానే లోపలికి పరిగెత్తి బామ్మ చెవిలో ఊదింది. బామ్మ కంగారుగా లేచింది. ఊష్మాని తోడు తీసుకుని శాణేగారి యింటికి బయలుదేరింది. దార్లో మరో అయిదారుగురు అమ్మలక్కల్ని పోగు చేసుకుని మరీ వెళ్లింది. కొందరి చంకల్లో చంటి బిడ్డ లున్నారు కూడా. వచ్చిన అతిథులు యజమానితో ముందు సావిట్లో కూచుని ఉంటారని వాళ్లకి తెలుసు. అందుకని దొడ్డిదారిని బిలబిల వంట ఇంట్లోకి ప్రవేశించారు.

భామాబాయి పళ్లాలలో తినుబండారాలు సర్దుతోంది. పిల్లలు సహాయం చేస్తున్నారు. చీనాకి పన్నెండేళ్లు. బానా నాలుగేళ్లు చిన్నది. చీనా బొమ్మలాగుంది. జరీ అంచు ఆకుపచ్చ చీరలో మెడలో బంగారు గొలుసు, చేతులకు గాజులు— చెవులకు దుద్దులు, మహా లక్షణంగా ఉంది. బానా కూడా ఎర్రపట్టు పరికిణీ, జాకట్టు, ఒంటిపేట హారం. తనూ చూడ ముచ్చటగా ఉంది. తల్లి తలెత్తి చూసింది అమ్మలక్కలందరినీ. బిత్తరపోయింది అదేం తెలియనీకుండా చిరునవ్వు తెచ్చి పెట్టుకుని ఆప్యాయంగా లోపలికి రమ్మంది. చీనా ఊష్మా వంక ఉత్సాహంగా చూసింది. అమ్మలక్కలు చూడ్డానికి సిగ్గు పడింది.

"చీనా తల్లీ! నిన్ను చూడ్డానికి రెండు కళ్లూ చాలవే—గౌరీదేవిలా గున్నావు" అంది ఊష్మా బామ్మ. చీనా చెక్కిళ్లు ఎర్రబడ్డాయి. బామ్మ భామాబాయిని చీవాట్లు పెట్టింది. "పిల్లని చూడ్డానికి పెళ్లివారొస్తుంటే ఇరుగు పొరుగుని పిలిచి ఈ పనీ ఆ పనీ చెప్పి చేయించుకోవద్దూ? సంతోషంగా సహాయ పడతారే అందరూ." ఆమె ఆ మాటందో లేదో, మరో ముత్తైదువు చంకలో బిడ్డని బానా చేతికిచ్చి, చీనాని దగ్గరగా తీసుకుని, "పెళ్లి చూపులకి పిల్లనిల్లాగేటమ్మా పంపించడం? ఇక్ష్వాకుల కాలం నాటి జడ బొట్టూతో పంపుతారా?" అంటూ చకచక జడ విప్పేసింది. జడ మళ్లీ వెయ్యడం పూర్తి అయిందో లేదో, శాణే అవతలనుంచి "బానా" అని పిలిచాడు. అంటే చీనాని పెళ్లికొడుకు తండ్రికి చూపించడానికి తీసుకురమ్మని ఆ పిలుపు అర్థం. భామాబాయి లేచింది. తిను బండారాలు పెట్టిన పెద్ద పళ్లెం చీనా చేతి కిచ్చింది. చిన్న పళ్లాలు ఒకటి బానా, మరొకటి ఊష్మా పుచ్చుకున్నారు. ఊష్మాకి ఆ అవకాశం రాకపోతే చిన్నబుచ్చుకునేది. ముగ్గుర్నీ ముందు గదిలోకి పంపింది భామాబాయి. రెండు మూడు నిముషాలు అయ్యాక ముగ్గురూ మళ్లీ వంటింట్లోకి వచ్చేశారు. పెద్దల నవ్వులు, పిన్నల ఎకసెక్కాలతో చీనా చెక్కిళ్లు ఎర్రబడ్డాయి.

పెళ్లిచూపులైపోయాయి. ఆమె తల్లి ఇరుగు పొరుగు అమ్మ లక్కలకి పిండి వంటలు వడ్డిస్తూ మర్యాద చేస్తూనే ఉందిగాని లోలోపల ఎంతో అలజడి పడుతోంది. పర్యవసానం ఏమవుతుందోనని. చీనా ఎక్కువదే కాస్త, కొంచెం చాయ తక్కువ. అందుకనే తల్లి కంత ఆందోళన. అందుకనే ఈ పెళ్లిచూపులు రహస్యంగా అట్టిపెట్టింది కూడా. ఈ పెళ్లి వారు సద్దంటే, మొందొచ్చే పెళ్లివారు కూడా పిల్లలో ఏదో కొరత ఉందనుకుంటారు. కాని ఇపుడు రహస్యం బట్టబయలయింది. వీరు తిరిగిపోతే ఊరంతా యాగీలు చేస్తుంది. అసలీ సంగతి బయటికెలా పొక్కిందో తల్లికి తెలియకపోలేదు. అయినా అప్పటికి మట్టుకు ఆమె ఏమీ అనలేదు. భర్త అడుగుల చప్పుడుకోసం ఆత్రంగా ఎదురు చూస్తూ కూర్చుంది. కాస్సేపట్లో ఆయన వస్తున్న సవ్వడి విని, తొందరగా అవతల గదిలోకి వెళ్లింది ఆయన్ని కలుసుకోడానికి. "శిరూబాబా గారు సరే అన్నారు. పాపం మన భోలా శాణేగారు పూనుకున్నారు గనక సంబంధం కుదిరింది. నేను రేవుదాకా వెళ్లి వారిని లాంచి ఎక్కించి వస్తా" అన్నా రాయన. భామాబాయి సంతోషానికి మేరలేదు. ఇంతలో వంట ఇంట్లోంచి ఆడ గొంతుకలు

ఆయన చెవిని పడ్డాయి.

ముఖం చిట్లించి చూశారాయన.

"నా హెచ్చరికలన్నీ గేదెమీద వాన చినుకులయాయన్నమాట" అనేసి కొంచెం చిరాకుగా వెళ్లిపోయారు.

భామాబాయికా దెప్పి పొడుపు బాధ కలిగించిందిగాని, చీనా సంబంధం కుదిరిందన్న సంతోషంలో అది మరుగు పడిపోయింది. ఆవిడ అతి ఉత్సాహంగా వచ్చింది వంటింట్లోకి.

"మనం అనుకున్నట్టే జరిగింది. అంతా దామోదర ప్రభువు చలవ" అంది. ఆడమ్మలంతా అల్లకల్లోలంగా అభినందించారు. ఈ శుభవార్త వూరంతా చాటడానికి ఊష్మా బామ్మ హడావిడిగా లేచింది. చీనా చుబుకం పుణికి ఆశీర్వదించింది. అమ్మలక్కలందర్నీ లేవదీసింది. గుమ్మంలో కెళ్లాక వెనక్కి తిరిగి, "అమ్మాయి భామా! చూడు. బానా పెళ్లిచూపులికి మాత్రం ఈ దాపరికం ఒద్దుతల్లీ! మేమంతా వచ్చి సహాయం చెయ్యాలి" అంది.

అంతలో ఊష్మా అందుకుంది. "అత్తతో ఎందుకు చెప్పడం బామ్మా! ఏం భయం లే. పాపం చీనాలా సిగ్గు పడుతుంది అనుకున్నా వేమిటి బానా? ఆ సమయం వచ్చే వరికి వూరంతా అదే చాటేస్తుంది" ఈ చణుకులికి బానా తప్ప మిగతా అందరూ నవ్వారు. ఉష్మా భుజంమీద ఆప్యాయంగా వేసిన తన చేతులు వెనక్కి లాక్కుని బానా 'ఫో' అన్నట్టు తోసి ఆమె వంకే కోపంగా చూసింది. ఊష్మా బామ్మ వస్తున్న నవ్వు చటుక్కున సంబాళించుకుని, మనమరాలి వీపుమీద చిన్న దెబ్బవేసి, "కోతీ, నోరు మూసుకుని ఉండలేవూ? అందరితోనూ వేళాకోళాలే?" అంది.

భామాబాయి వాళ్లని సాగనంపి వంటింట్లోకి వచ్చింది. సామాను సర్దుతూ, చీనా నగలు తీస్తున్న బానా వంక చూడకుండానే, మెల్లని గంభీర స్వరంలో అంది "ఇవాళ పండగింకా అయిపోలేదు. మన రహస్యం బయట పెట్టిన వాళ్ల సంగతి ఇంకా కనుక్కోవాలి. ఎవరో నాకు తెలుసు" బానా బిత్తరపోయింది. వాళ్లమ్మ దగ్గర మరిచి దూరంగా జరిగింది. తలవంచుకు నిలబడింది. భామాబాయి, ఆమె దగ్గరకు వెళ్లింది. రెండు బుగ్గల్నీ రెండు చేతులతో పట్టుకొని తల పైకెత్తి "నేనింతా చెపితే, ఊష్మాతో ఈ సంగతి ఎందుకు చెప్పావు? నా తల్లి పెళ్లంటే ఉష్మా, నువ్వూ చేసే బొమ్మల పెళ్లనుకున్నావా?" అంది.

"ఊష్మా ఎవరితోనూ చెప్పనని ఒట్టేసింది. మాట తప్పుతుందనుకోలేదు" అంది బానా ఏడుపు ఎగుపుల మధ్య.

భామాబాయి ఈ మాటలు విని మెత్తబడలేదు. పొయ్యి దగ్గరకెళ్లి పొగూదే గొట్టం పట్టుకొచ్చింది. "మళ్లీ ఇల్లాంటి పని చెయ్యకుండా నీకు బుద్ధి చెపుతా" అంది కోపంగా.

చీనా, "అమ్మా" అంటూ అడ్డుపడింది. బానాని రక్షించడానికిలాగ కౌగిలించుకుంది. బెదురుతూ అమ్మని బతిమాలింది. "అమ్మా! ఇంకెపుడూ చెప్పదమ్మా. పొరపాటు తెలిసొచ్చిందిగా ? ఒక్కసారి ఒదిలెయ్యమ్మా"

భామాబాయి చేతిలోంచి పొగూదే గొట్టం జారిపోయింది. ఆవిడ మనసు కరిగింది. కళ్లలో కొస్తున్న తడి కనబడకుండా ముఖం కప్పేసుకుంది. చీనా ఎపుడూ బానాని వెనకేసుకొస్తుంది. ఇంక చీనా గూడ విడిచి వెళ్లిపోతుంది. పాపం బానా ఎంత బెంగ పెట్టుకుంటుందో ! మనసు కుదుట పరుచుకుని, బానాని దగ్గరగా తీసుకుని, "తల్లీ మనం ఆడవాళ్లం. మితంగా మాట్లాడ్డం చిన్నతనంలోనే నేర్చుకోవాలి మనం. నువ్వూ ఎప్పుడో ఒక ఇంటి కోడలవుతావు. నువ్వు సుఖ పడాలంటే గుట్టు నిలబెట్టడం నేర్చుకోవాలి" అంది.

చీనా సంతోషం పట్టలేక తల్లి భుజాలు పట్టుకుంది. బానా కళ్లు తుడుచుకుందిగాని, ఇంకా దిగులుగానే ఉంది."

"పిచ్చిపిల్లా" అంది భామాబాయి మెల్లగా. చల్లగా నవ్వి బానా చుబుకం ఎత్తి, "నిన్ను చూస్తే ఆ కథలో ముద్ద మాటల పెళ్లికూతురు గుర్తుకొస్తోంది. పెద్దలన్నీ చెపితే, పెళ్లి పీటలమీద రహస్యం కొస్తా బట్టబయలు చేస్తానే పాడేసింది.

"వోదు విప్పొద్దన్నాదు—మది
వూదు కోదం ఎత్తా?
పెద్దికి పెత్తిన తదంబాదు
పిద్ది తినేత్తోందే—"

ఇంతలో "అక్కయ్యా" అన్న ఆప్యాయమయిన పిలుపు వినబడి ముగ్గురూ గుమ్మం వంక చూశారు.

"హరిమామయ్యా! హరిమామయ్యా!" అంటూ అరిచారు పిల్లలిద్దరూ. ఒక్క గంతులో మేనమామ దగ్గరకు వెళ్లి చెరో వక్కా పట్టుకుని వేళ్లాడారు.

ఈ సంతోష సమయంలో తన చిన్న తమ్ముడు చూడ్డానికి రావడం, భామాబాయికి కడుపు నిండినట్టుంది. అయితే వెంటనే రహస్యం బయట పెట్టే రకం కాదు ఆమె. మనసులో ఆనందం మరుగు పరిచి, ఆమె ముఖం ముడుచుకుని కాస్త ఎత్తిపొడుపు మాటలతో ప్రారంభించింది. "అమ్మయ్య. ఇన్నాళ్లకి మీ అక్కయ్యా, మేనకోడళ్లూ గుర్తు కొచ్చారన్నమాట!" అంటూ నిట్టూర్చింది.

"అవును మామయ్యా! నువ్వచ్చి మూణ్నెల్లపైగా అయింది. నిజంగానే మర్చిపోయావు" అన్నారు మేనకోడళ్లిద్దరూ.

"అవునమ్మామరి" అన్నాడు హరి మామయ్య. కాస్త గంభీరంగా ముఖం పెట్టి, "తప్పు మీ అమ్మదే. ఇప్పుడేగ మీకా ముద్ద మాటల పెళ్లికూతుర కథ చెప్పింది? మరి మామయ్యా దారి తప్పకుండా ఎల్లా ఉంటాడు? పగలల్లా మీ అమ్మ కథలు చెపుతుంటే, ఇక్కడికొద్దామని బయలు దేరిన మామయ్య తప్పకుండా దారి మరిచిపోతాడు!"

ఈ 'మామయ్య దారి తప్పడం' చిత్రమయిన కట్టు కథ. అస్తమానూ చిన్న పిల్లలు కథలు చెప్పమని వేధించుకు తినకుండా గోవా ముసలమ్మలు కల్పించారిది. కథలు చెపితే వాళ్లని చూడ్డానికి బయలు దేరిన మామయ్య దారి తప్పుతాట్ట! మామయ్య వస్తున్నాడంటే మహా సరదా పిల్లలకి — బాగా చనువిస్తాడు, గారం చేస్తాడని,

"మామయ్యా దారి తప్పడం" సంగతి సమయానుకూలంగా హరిమామయ్యా ఎత్తే సరికి వంటిల్లంతా నవ్వులతో కలకల్లాడింది.

"చాల్లేరా హరీ! నీ వేళాకోళాలు. నీకో మంచి శుభవార్త చెప్పాలి. అంతా శ్రీ దామోదర ప్రభువు చలవ" అంటూ అతి ఉత్సాహంగా తమ్ముణ్ణి హాల్లోకి తీసుకు వెడుతూ, చీన్నా పెళ్లి చూపుల సంగతంతా పూసగ్రుచ్చినట్టు అతి చమత్కారంగా చెప్పింది భామాబాయి. ఇంక చీనాకి, బానాకి ఏం చెయ్యాలో ఎవరూ చెప్పక్కర్లేదు. "షీరా" చెయ్యడానికి ఇద్దరు పొయ్యి దగ్గరకు పరుగెత్తారు. మావయ్యకా ఫలహారం మహా ఇష్టం. భామాబాయి ఈ శుభవార్త చెప్పడం ముగించేసరికి, ఫలహారం, కాఫీ పట్టుకుని వాళ్ళా వచ్చారు. మామయ్య కిచ్చారు.

మామయ్య ఫలహారం తృప్తిగా తిని, కాఫీ తాగి, చీనా వంటని మెచ్చుకుని, తన గారాల మేనకోడలైన బానాని ఆప్యాయంగా పక్కని కూచోపెట్టుకుని, ఒక పొట్లం ఆమెకు చూపిస్తూ అన్నాడు. "ఈ పొట్లంలో అద్భుతమయిన వింత లున్నాయి. మా వూరి సంతలో కొన్నాను మీ ఇద్దరికోసం, షీరా తిన్నానుగాని కడుపు నిండలేదు. బానా తల్లి కథలు మహా కమ్మగా చెపుతుంది. ముద్దమాటల పెళ్లి కూతురు కథ ఇది వరకు విన్నాను గాని, మా మేనకోడలు నోటంట మళ్లీ వినాలనుంది."


గోవా జానపద గాథలు

మామయ్యకి కథ చెప్పడమంటే, మేనకోడలికి మహా సరదాకదా. అయినా మరో మాటు అడిగించుకుని మొదలుపెట్టింది కథ.

"అనగాగనగా ఒక మారుమూల వూరు. ఆ వూళ్లో ఉందొక చిన్న పిల్ల. చాలా చక్కనిది. వాళ్ల నాన్న బాగా డబ్బున్న వాడు. అయితే పాపం ఆ అమ్మాయికి ముద్ద మాటలు! పెళ్లీడొచ్చేసరికి తల్లి తండ్రులకి ఆమె పెళ్లి పెద్ద సమస్యయి పోయింది. పాపం ఆ వూళ్లో అందరూ ఆమెను ఎగతాళి చెయ్యడమే. ముద్ద మాటలపిల్లని ఎరగనివారంటూలేరు. కాని వాళ్ల నాన్న మహా తెలివైనవాడు. ఏం చేశాడు? ఓరోజుని దూరంగా ఉన్న మరో వూరెళ్లారు. అక్కడ అందమయిన కుర్రాణ్ణొకణ్ణి చూసి అల్లుణ్ణి చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. కుర్రాడి తల్లి తండ్రుల దగ్గర కెళ్లాడు. మంచి కట్నం ఇస్తానన్నాడు. ఆ తల్లితండ్రులు తమ కుర్రాడి కింత కట్నం వస్తుందని కలలో కూడా అనుకోలేదు. వెంటనే వాళ్ళు ఒప్పుకున్నారు.

"పెళ్లి అసలు పెళ్లి కూతురు ఇంటి దగ్గర జరగాలి. అయినా—ఏదో వంక బెట్టి పెళ్లి మగపెళ్లివారి వూళ్లోనే జరగాలన్నాడు.

"ఉత్సాహంగా ఇంటికి తిరిగొచ్చాడు. తను ఎలాంటి తెలివయిన పథకం వేశాడో పెళ్లానికి చెప్పాడు. అయితే ముద్దమాటల పిల్ల బాగా వాగుడుకాయి. అంచేత ఆ మూడు ముళ్లూ పడేదాకా అసలు నోరు విప్పొద్దని తల్లీ తండ్రీ ఆ పిల్లని మరీ మరీ హెచ్చరించారు.



ముహూర్తంనాటికి ఆడ పెళ్లివారు మగ పెళ్లివారి వూరు చేరుకున్నారు. తతంగం ప్రారంభమైంది. అగ్నిహోత్రం వెలుగుతోంది. పురోహితులు మంత్రాలు చదువుతున్నారు. సన్నాయి హాయిగా మ్రోగుతోంది. పిల్లని చక్కగా అలంకరించి పెళ్లి పీటలమీద కూర్చోపెట్టారు. పెళ్లికొడుకు వచ్చేదాకా ఆమె ఆ పీటమించి కదలకూడదు. నోరు విప్పొద్దన్న హెచ్చరిక మరోసారి ఆదుర్దాగా ఆమె చెవిలో వూదింది తల్లి. అంతా సవ్యంగానే సాగిపోతోంది. కాని అయ్యో పాపం! చటుక్కుని పెంపుడు పిల్లొకటి ఎదురుగా ఉన్న గదిలోకొచ్చింది. పెద్ద పళ్లెంలో తలంబ్రాల బియ్యం పెట్టి ఉన్న యక్కడ. పిల్లి ఆ బియ్యం బొక్కడం మొదలు పెట్టింది. మిగతా ఆడవాళ్లంతా తలో పనిమీద హడావిడిగా తిరుగుతున్నారు. పందిట్లో పెళ్లికూతురొక్కర్తే కూచుని ఉంది. పిల్లని ఆమె చూసింది. ఆమె కంగారుపడుతూ కూర్చుంది. ఆఖరికి ఇంక ఉండబట్టలేక అరిచింది—

"నోరు విప్పొద్దన్నారు—మది
వూదుకోదం ఎత్తా?
పెద్దికి పెత్తిన తదంబాదు
పిద్ది తినేత్తోందే—

ముద్ద నాలుక లేకపోతే ఆమె అనదలుచుకున్నది ఇది—

'నోరు విప్పద్దన్నారు—మరి
వూరుకోడం ఎల్లా
పెళ్లికి పెట్టిన తలంబ్రాలు
పిల్లి తినేస్తోందీ—"

మగ పెళ్లివారి ఆడంగులు బిత్తర పోయారు. ఆడపిల్లవాళ్ల మొగాన్ని నెత్తురు చుక్కలేదు. పెళ్లి పందిరంతా పిడుగు పడ్డట్టైపోయింది. పాపం ఆ పాడు పిల్లి మూలంగా ముద్ద మాటల పిల్ల పెళ్లి చెడిపోయింది. మళ్లీ తన వూరికి తిరిగొచ్చేసింది" కథ పూర్తి చేసిందో, లేదో మామయ్య చేతులో పొట్లం—టప్పున లాగేసింది బానా. ●

మాయ

(12 వ పేజీ తరువాయి)

అందులో బ్రాడ్వే అనే థియేటర్.

"ఆహా! మాయ!!.. ఎంత సేపయిందో నాకోసం ఎదురు చూస్తూ వుండి?" పరిగెడదామనుకున్నాను. జనం చూస్తే నవ్వుతారని భయం వేసింది!

అప్సర్సలా వుంది. అదేమిటో మాదిరిగా జుత్తు నంతా పైకి తీసి అలాఅలా మీదకు కట్టుకుంది. అజంతా శిల్పంలాగో, షర్మిలా టాగోర్ లాగో నాకే తెలియదు. పొడుగ్గా వున్న మెడ మీద గుండ్రని మొహం మీద నల్లగా కోలగా ఎత్తుగా ఆ'ముడి' గుడిగోపురంలా వుంది.

నేనింత ఆలస్యం చేశానని కాబోలు కొంచెం మొహాన చిరాకు కనపడుతోంది. మాయను చూస్తే యివాళ ఏదో పెద్ద ప్లాను మీదే వున్నట్లుంది. కొత్త చీరె కట్టుకుంది. ఒక చేతిలో చిన్న గొడుగు కూడా వుంది. మూడు ముస్తాబులూ ఐ వచ్చింది. వాళ్ళాఫీసుకి శలవు యిచ్చేశారు కాబోలు.

నన్ను చూస్తోనే కోపంగా నవ్వేసింది. "సారీ! లేటయింద"న్నాను బుద్ధిగా ప్రక్కగా వెళ్లి నిలబడి. "విన్ను పోల్చలేనంత బాగున్నావ్" అన్నాను. "ఈ 'బస్టాప్' లో నిలబడ్డ ఫాషన్ మాడల్ అనుకు న్నావా?" అంది గోముగా, చిరాగ్గా.

కారణం చెప్పాను. అందులో సగం అబద్దాలే చెప్పాను. ఒట్టు! అంతవరకూ నే చెప్పిన అబద్దాల్లో యేఒక్కటీ నేనదివరకు వూహించినవి కావు. అప్పటి కప్పుడు అలా వచ్చాశాయంతే!

ఒక బస్ వొచ్చింది!

'వెళ్దామా' అన్నాను. అబబ్బ! మాయ ఎంత 'యిది'గా వుంది! తాజాగా తయారై వచ్చింది. నాకే సిగ్గేస్తోంది. ఏదోలా వుంది.

"వానలో బురదలో బస్సెం ఖర్మ!"నీ బ్రతు క్కింతేనా అన్నట్లు చూసింది అంతలో మాయ.

"కూ(వ) వ్ రివర్‌లోకా?" అంది. చెప్పానుగా. తన ధోరణిలో నవ్వింది.దానర్థం "వెధవా?" అనేనా కావొచ్చు 'డార్లింగ్' అనేనా కావచ్చు.

"కాదూ! మరెక్కడికి?" అంటూ జేబులో ఐదు రూపాయిల విలువైన నాలుగు కాయితాలను ఒక చేత్తో భద్రంగా జేబులోనే పట్టుకుని అడిగాను.

బస్సు వెళ్లిపోయింది!

"ఇంచక్కా సినిమాకి పోదామనుకున్నాను" తన చిన్ని గడియారాన్ని యిలా చూసుకుంటూ అన్నది.

"బాగుంటుంది కాని, ఏంచూస్తాం పాడు సిని మాలు...వెధవది బోలెడు..రష్షూ, రద్దీ" విరక్తి ప్రకటించాను. నీళ్ళ నమాల్తున్నట్లు మాటలు వస్తున్నాయి నాకు.

"మరెక్కడకి పోదాం?"

"ఎగ్జిబిషన్ వుందిగా"—బ్రహ్మాండమైన నా ఐడియాకి నేనే మురిసిపోయాను.

"జూ"కి ఎందుకు పోకూడదూ?"

"పోవచ్చును కాని....యిప్పుడుండదు" అన్నాను సిన్సియర్‌గా. వెటకారం చేస్తోందని తెలియదు నాకు.

మాయ గొణుక్కుంది. విసుక్కుంది. నేను బొత్తిగా రొమాన్స్ తెలీని ఘటంలా క్రుంగిపో యాను.

జేబులోని రూపాయి నోట్‌లో పిల్లలు పెడితే ఎంత బాగున్ను?

"అహా....అదికాదు మాయా! మనం ఎగ్జిబిషన్‌లో అయితే యీచల్లని వాతావరణంలో యించక్కా...."

"వూ....ఇంచక్కా..." వెక్కిరించింది. వెక్కిరించినా బాగానే వుంది మాయ.

ఏం చెయ్యాలి!? షాపింగ్ చేస్తానంటుందా, ఏం? కొంపదీసి...చస్తాం..సినిమాకే గతిలేదు. నేను షాపింగ్ ఏం చేయిస్తాను ? అదీగాక మాయకు అన్నీ వున్నాయి....ఒక్క రిబ్బన్ తప్ప. ఇంకేం కొనుక్కుంటుందిలే అనుకొని...అంతగా అయితే అది కొని యివ్వొచ్చును. అనుకున్నాను. కాని అలా అని బయటికి చెప్పలేదు.

"హాయిగా ఎక్స్‌ప్రెస్సో కాఫీ త్రాగుదాం" అన్నాను గొప్పగా.

పెద్ద పెద్ద కళ్ళు మాయవి. చింతగింజల్లా ముడుచుకుపోయాయి.

"నీకు మేనత్త కూతుళ్ళు మేనమామ కుమార్తెలూ లేరా?" అడిగింది కసిగా.

ఉన్నారనాలా? లేరనాలా?.....ఇంతకీ మేనత్తలు, మేనమామలూ లేని నాకు వాళ్ళెలా వస్తారు... అందుకనే "లేరే" అన్నాను.

ఈలోగా ఒక టాక్సీ పలకరిస్తూ వెళ్ళిపోయింది. (అంటే హారన్‌వేసి పోయిందన్నమాట.)

"మరి యీ 'జంతుశాల' కీ, ఎగ్జిబిషన్‌కి తీసికెళ్ళడం.....అందుగో ఏనుగు, యిదుగో సముద్రం అని చూపెట్టే అలవా టెక్కడయింది ? అదేం సరదా బాబూ!" అన్నది నవ్వుతూ.

ఎక్కడైందీ? ఎక్కడా అవలేదు. ఆ మాట కొస్తే మాయతో పరిచయం లేనప్పుడు నేను యిలాంటి సమయాల్లో సినిమాకే వెళ్ళేవాణ్ణి.... ముఖ్యంగా శివాజీ, సరోజాదేవీ అంటే నాకు యిష్టం! కాని అప్పుడా సినిమా అంతా కలిపి, రెండూ రూపాయిలే అయేది!

"సరే! యిప్పుడూ టయిమైపోయిందిగా..... యీ థియేటర్‌లో....." అని మొదలెట్టాను.

నామాటలకు మాయ ఎర్రని పెదాలు. అందమైన కనుబొమలు చక్కని శరీరం..... కోపంతో కదులుతున్నాయి. నేను గమనించాను.

"మావూళ్ళో చుట్టలు కాల్చేవాళ్ళు కూడా యీ థియెటర్‌కి రారూ.....ఇదేం సినిమా యిక్కడాడుతున్నదీ ? సెకన్‌రన్ పిక్చర్ సార్!" అంది. వాళ్ళవూరు కర్నూలు కాబోలు. చెప్పిందికాని మరిచిపోయాను.

"చీకట్లో కూచొని యిటు వాళ్ళు అటువాళ్ళూ వినుక్కుంటారేమోననే భయంతో మాట్లాడకుండా చిత్రంచూసి, ఆనక లైట్ లు వెలగంగానే హడావుడిగా గుడ్‌నైట్ అంటూ బస్సులకోసం పరిగెట్టడమేగా సినిమా" నేనుకూడా ఘాటుగా మాట్లాడాను. "హాయిగా! కబుర్లు చెప్పుకుంటే బాగుండదూ?" అన్నాను.

థాంక్స్! వస్తా....... నువ్వు యిలాగే యీబస్సు షెల్టర్‌లోనే తెల్లార్లూ నిలబెట్టేలా వున్నావ్" అంది మాయ! మాయముక్కు ఎర్రగా వుంది! బాగా కోపంవస్తే అలా అవుతుంది.

కణతలు నొక్కుకుంటె !

మాయ

"ముందు కాఫీ త్రాగుదాం పద!" అన్నాను. నాకు తెల్సు మాయకు ఏర్ కండిషన్డ్ థియేటర్లో రిజర్వ్‌డ్ క్లాసు క్కూడా టిక్కెట్‌లు దొరకని ఎమ్‌జీయార్ బొమ్మంటే యిష్టం. కాని అది యిప్పుడు నా తరమా?

"ఎక్కడ? 'బుడ్డి దుకాణంలో' నా కాఫీ త్రాగుతాం?" అడిగింది మాయ (ఎంత వేళాకోళం.)

"ఉహూ......ఎగ్జిబిషన్‌లో 'ఇండ్యాకాఫీ బార్'లో"

మదరాసుకు పచ్చ చీరా, అదే రంగు సిల్కు బ్లవుజూ వేసుకున్న మాయ "సరే ఆ తిరణాలకే పోదాం పద" అన్నది అయిష్టంగా. ఎట్టకేలకు.

నాకు బస్సులో వెళ్ళాలనే ఉంది. కాని ఆ మాట లనడానికి ధైర్యం చాల్లేదు.

"సంగమ్ సినిమాకి వెళ్ళా లనుకున్నాను. నువ్వేమో వేళ చూసుకుని దాని యింటర్‌వెల్ అయిపోయాక వచ్చావ్" అంది.

నేను నసిగాను. నాకు తెలియదుగా అన్నాను. ఈసారి అడ్వాన్స్ బుకింగ్ తీసుకుని వెళ్దామన్నాను.

"అసలు హాయిగా బీచ్‌కే వెళ్దాం. కాని యీ పాడు క్లయిమేట్....యిప్పుడేగా వాన వెలిసింది...." అన్నాను. "పీచ్ మల్బా తినాలనుంది నాకు" అన్నాను. ఇంకా ఎన్నో యిలా అన్నాను. నిజంగా నాకు అలాంటి కోర్కెల్లేవు. ఉన్నా నా తాహతుకి యిప్పు డదీ యెక్కువే. నాకున్న కోర్కె ప్రస్తుతం ఒక్కటే! యీ ఐదు రూపాయల్తో మాయ దగ్గర పరువు దక్కించుకుని బయట పడటం !

పైగా ఆకలిగా వుంది. ఏదైనా యింత వేడిగా వేరుశనక్కాయలైనా మిరపకాయ పకోడీ లైనా తింటే బాగుండును.

మాయ క్కూడా అలాగే ఉండేమో.

"దవడలు చలికి సలుపుతున్నాయి. పీచ్‌మల్బా, ఐస్‌క్రీం, ఐస్‌ఫ్రూట్ యింతేనా? ఏంబిషన్సు!"— నవ్వింది మాయ.

చివరికి నేనూ మాయా రాజీపడ్డాం.

టాక్సీలో కూచున్నాం. నా గుండెలు పీచు పీచు మంటున్నాయి. ఇంత అందమైన మాయ, యిలా యీ చల్లని వాతావరణంలో వెచ్చగా నా ప్రక్కని కూచున్నప్పుడు. మ రొ క సా రై తే నా ? మరోసారైతేనా?......ఎవరిలా వుండేవాణ్ణి ?...... 'రాజా'లా, 'నవాబ్' లా, 'స్టార్'లా... లక్షాధికారిలా ఉహూ....బ్రహ్మాండంగా ఉండేవాణ్ణి.

టాక్సీ మవుంట్‌రోడ్‌మీదకు మెల్లగా సాయంకాలం ట్రాఫిక్‌గుండా ప్రాకుతున్నది. అవతల తుంపర పడుతున్నది. మళ్ళీ ఆగిపోతున్నది. నాకు ఆ వానలో పరిగెత్తాలనుంది. ఆ మాటే అన్నాను.

మాయ నవ్వింది. నా చెయ్యి తన చేతిలోకి తీసుకుంది.

"నీ కోర్కెలన్నీ రూపాయిలు యీ దేశంలో పుట్టక పూర్వానివి రమణా" అంది. అందులోని దెప్పి పొడుపును గ్రహించే స్థితిలో లేను నేను.

"నాకు ఎన్నాళ్ళగానో వుంది వో కోర్కె." అన్నాను.

మాయ శిరోజాలంకరణ నాకు నచ్చలేదు. కాని కమ్మని వాసన వేస్తోందామె జుట్టు!

మాయ కిలకిలా నవ్వుతూ "నీమిటో అది..... బస్సులో మైలాపూర్‌వెళ్ళి అక్కడ గుళ్ళో కొబ్బరికాయలుకొట్టి.....ప్రక్క కిళ్ళీకొట్లో 'లవుజా' బిళ్లలు కొనుక్కుని ప్రసాదంతో కలిపి తినడమా?" అన్నది.

గొప్పగా నవ్వుతోంది మాయ! టాక్సీవాడు కూడా యిక కేవలం రోడ్డుమీదే తన 'దృష్టి' కేంద్రీకరించడం తెలివి తక్కువ అనుకున్నాడు.

నాకు కొబ్బరికాయ ముక్కలు యిష్టం అని మాయ నోట విని నేను "స్టన్న"యిపోయాను.

ఈ సంగతి మాయ కెలా తెల్సు?....మాయ! అసాధ్యురాలు.....నా గుట్టు పరువు అన్నీ యిలా యీ రోడ్డుమీద......

"కాదు" అన్నాను కర్కశంగా కోపంగా. "నాకు జెయింట్ వీల్ ఎక్కాలనుంది!" అన్నాను.

"నాకు వో 'లావిష్లీ' కొనుక్కోవాలనుంది". అన్నది మాయ.

"అదేమిటీ?" నేను నిజంగా తెల్ల మొహం వేశాను.

"అదే....పూలుతో చెస్తారూ.....స్వెటరీ అంటారూ....." నన్ను రెండు భుజాలమీద చేతులు వేసి కొంచెం వెనక్కి త్రోసి నవ్వుతో వేళాకోళంగా వివరించింది మాయ.

నా గుండెలు జారిపోయాయి!

"ఎగ్జిబిషన్‌లో 'జైంట్ వీల్' మాత్రం వుంటుంది" అన్నాను.

"రంగుల రాట్నం కూడా ఉంటుంది" కొంచెం నిరుత్సాహంగానే అన్నది మాయ.

టాక్సీ మీటర్ రెండు రూపాయిలదాటి పోతోంది. నా 'నాడి' వేగం కూడా.....పరిగెడుతోంది.

* * *

నియాన్‌లైట్‌లు, ఫ్లడ్‌లైట్‌లు, లౌడ్‌స్పీకర్‌లు, కార్లు, కార్ల హార్న్‌లు....మామూలుకన్నా తక్కువగానే అయినా కోలాహలంగా ఉంది ఎగ్జిబిషన్ ఆవరణ.

మాయ వానిటీబాగ్‌లో ఎంత ఉందో నాకు తెలియదుకాని రెండు టిక్కెట్‌లు కొన్నాకా నా దగ్గిర యిక ఉన్నది రూపాయిమీద కాస్త చిల్లర అంతే.

మొదట కుడిప్రక్క కాఫీ దుకాణాలు, ఫ్రూట్ జ్యూస్ షాపులూ ఉన్నాయి. ఎడంప్రక్క పద్మాలుగు, 'ఫారీ' వద్దెనిమిదీ.....ఎన్నో కొన్ని అన్ని రాష్ట్రాల చేనేత దుకాణాలూ ఉన్నాయి. ఒక దగ్గర పీచు మిటాయ్‌స్టాల్ కూడా ఉంది!

దూరంగా, అద్భుతంగా నియాన్‌లైట్‌లతో నిలువుగా పడుతూ, లేస్తూ రంయ్, రంయ్ మంటూ మేఘాలతో నిండిన ఆకాశాన్ని వింతగా మసగ్గా వెలిగిస్తూ "జైంట్ వీల్" తిరిగిపోతోంది.

చిన్నప్పుడు మా వూళ్ళో అంటే తణుకులో వోసారి తిరణాలకి నేను రంగుల రాట్నంమీదనుంచి పడ్డాను. వారం రోజులు జ్వరం కాసిందట.

ఇప్పుడు యీ రూపాయిన్నర చిల్లర డబ్బుల్తో మరి చేసేదిముంది గనుక!

నేనూ మాయా కలిసి ఆ 'జైంట్‌వీల్' ఎక్కుదామనుకున్నాను. అక్కణ్ణుంచి నేను పడిపోదామనీ కూడా అనుకున్నాను. (దుఃఖం వస్తున్నది మరి)

కాఫీ తాగుతున్నప్పుడు దానికేసి వేలు చూపెట్టి చూపిస్తూ.

మాయకి అదొక్కటి తప్ప మొత్తం ఎగ్జిబిషన్ అంతా కావాలన్లేవుంది. ఉల్లాసంగాచూస్తోంది. అక్కడన్నీ అమ్ముతున్నారు దుర్మార్గులు! నా మాయకన్నీ కావాలి కాబోలు!! (నేనూ, పీచు మిఠాయి, జైంట్ వీలూ తప్ప.)

చెప్పులు, నగలు, చీరెలు, బొమ్మలు, గాజులు, తట్టలు, బుట్టలు అంటే వానిటీబాగ్‌లు సహా సమస్తం అమ్మేస్తున్నారు. మాయ ఆ ఎగ్జిబిషన్ కాంతుల్లో మెరిసిపోతోంది! మాయలో ఆ కాంతులు ప్రతిఫలిస్తున్నాయి!

నాకు భయంగావుంది. ఇక యిప్పుడు మరో కప్పు కాఫీ తాగాలన్నా నా దగ్గర ధైర్యంలేదు.

నాకు ఒక్కటే రక్షణవుంది.

అదే ఆ రాక్షసి రంగులరాట్నం. నిలువుగా పైకి లేస్తూ, క్రిందికి దిగుతూ, ఎవడో మాయా సురుడు త్రిప్పుతున్న చక్రనుతాబాలా, 'ఉప్పుల పొట్లాంలా......' తిరుగుతోంది! నేలమీద అక్కడక్కడా బాగా బురదగావుంది. మాయ అది చూసి విసుక్కుంది.

''జైంట్‌వ్హీల్ నువ్వు యెప్పుడేనా యెక్కావా'' కాఫీ త్రాగడం అయాకా బయటికి వచ్చాకా అడిగాను.

ఒకవేపు 'డాక్యుమెంటరీలు ఏవో చూపెడుతున్నారు. రెండోవేపు గవర్నమెంట్ వాళ్లవే ప్రణాళిక స్టాల్స్‌లు యించుమించు నిర్మానుష్యంగా ఉన్నాయి. మూడోవేపు దూరంగా ఎడ్వర్టయిమెంట్ స్లయిడ్స్ తెరమీద వేస్తున్నారు.

మాయ జైంట్ వీల్ వూసెత్తలేదు. కాస్సేపు సోపులూ, పౌడర్‌లు, రబ్బర్ పిల్లోలు అవీ ప్రకటనలు చూశాం.

మధ్య మధ్య నేను నిలువుగా తిరిగే ''ఆ రంగుల రట్నా''న్నే చూస్తున్నాను. దాని 13 ఉయ్యాలల మీద యిద్దరేసి చొప్పున కూచున్నారు. వాళ్లు హాయిగా పైకి లేస్తున్నారు. కెరటాల ''అంచున'' కూచున్నట్టు! ఆకాశం.....మహానగరం అన్నీ చూస్తున్నారు.....దిగుతున్నారు. కేరుతున్నారు. అమ్మో అంటున్నారు. భయపడుతున్నారు....అరనైపైనల్లో నాకూ మాయకూ కూడా అద్భుతమైన ఆ 'థ్రిల్' లభ్యమవుతుంది.

అరుదైన 'థ్రిల్' అది!

మాయ అంటోంది. ''వెధవది! హాంబగ్ అది. 'ఫలానా' లిప్‌స్టిక్ ''పేల్'' గా అయిపోతుంది. కొత్త అద్భుట్టయిజామెంటే''నని నన్ను తట్టి మరీ చెపుతోంది.

''నలానీ స్నో కొత్తది. అదోట సాదన బొమ్మ వున్నది. అదే బాగుంది'' ఇలాగే చెప్పుకుపోతూంది.

కొత్త రకం వస్తువులమీద మోజు! నా జేబులో చెయ్యి పెట్టి చూసి మరీ మాయ యివి ''షైక్'' చెయ్యగలదా?......ఏమో ''ఛీ బతుకింతేనా?'' అని పారిపోతే......

నా తరంకాదు. కావాలంటే కూ(వ) ఏనదిలోపడి ముక్కు మూసుకుని చస్తానుకాని మాయ దగ్గర నా దరిద్ర నారాయణ మొహం బయట పెట్టలేను.....

దుకాణాలకేసి, చెప్పులు గాజులూ మాత్రమేనా; అవి ధరించినవాళ్ల వేపు కూడాచూసి, తనను తాను వాళ్లతో బేరీజు వేసుకుంటుంది. వీళ్లలో చాలా మందికన్నా తనే ''మిన్న!'' గా ఉంది!

చివరికి జైంట్ వీల్ దగ్గరకు వచ్చాం! హాయ్!

''ఛీ'' అంది మాయ.

''బాగుంటుంది మాయా! భయమా?'' అన్నాను. ఉడికించుతున్నట్లు మొహం పెట్టి!

''మా కాలేజ్ సినిమాకి రమ్మంటే రానన్నాను''

అంది మాయ నిందవేస్తూ. "పోవాల్సింది" అన్నది బాధగా.

ఎవరా కొలీగ్ (ఆడా? మగా?) అనే ధైర్యం నాకులేదు. మరోసా రెప్పుడేనా అడగాల్సిందే!

"ముంత కింద పప్పూ, మామిడకాయబద్దలూ, వేరుశనక్కాయలూ, తిరణాల సరదా, మంచం మిఠాయి యివన్నీ నిన్ను వదల్లేదా! సిటీలో నాలు గేళ్ళై ఉంటున్నారుకదా! రమణ్"

ఇక తిట్టడమే నన్నమాట! ఆరంభమైంది. ఆగదు.

నే నన్నాను. "చూడు మాయా! ఎవరేనా తెలుగువాళ్ళు వింటే ఏమనుకుంటారు? కాస్త మెల్లిగా......చెప్పు....."

"నన్నా? ఏమనుకుంటారు యిడియట్ నను కుంటారు......నే నా జైంట్‌వీల్ ఎక్కను. నా 'శారీ' క్లాస్' అయింది. చిరిగినా, మాసినా నీసొమ్మేం పోయింది?" మాయ అటు తిరిగిపోయింది. నాకు ఎవరో హృదయంలో కొట్టినట్లయింది!

నాలో వోపికపోయింది. నన్ను, నా వేలాఖరి దరిద్రాన్ని మాయ అవమానం చేసింది. కాని మాయ చాలా అందమైనది! నవనాగరికమైనది. నాకన్నా బహుశా ఎక్కువే చదువుకుందేమో.

మాయ

"యూరోపియన్ కన్‌సర్న్" లో రిసెప్షనిస్ట్‌గా ఉంటోంది. నేను ఎలా వదులుకోను. ఎలా ఎదిరించను? ఎలా వాదించను?

"తెనుగువాళ్ళు మాయా" అన్నాను. ఎవరో యిద్దరమ్మాయిల్ని చూసి భయంగా.

"లెట్ దెమ్ హేంగ్! ఐ గె టేంగ్స్!" మాయ విసురుగా జరిగింది.

"రా! టిక్కెట్లు కొంటున్నా" నేను నడిచాను.

జైంట్‌వీల్ అద్భుతంగా ఆగింది. గంట కొడుతున్నాడు వాడు. మళ్ళీ మరో బ్యాచ్ టిక్కెట్లు కొనుక్కుంటున్నారు. నేను యింకా ముందుకు నడిచాను.

మాయ హైహీల్డ్ జోళ్ళు వేసుకున్నది. గట్టిగా గట గటా అడుగులు వేస్తూ వచ్చింది. నా మొహంలోకి చూసింది.

"డామిట్! ఐడోంట్ వాంట్" అంది.

"తెనుగులో అను.....నీ పుణ్యం ఉంటుంది. కొనేశాను టిక్కెట్లు" అని నేను తన చెయ్యిపట్టుకొని మా దగ్గరగా ఆగిన జైంట్ వీల్ తొట్టెలోకి ఎక్కుదాం రమ్మన్నాను. జాలిగా బేలగా వుంది నా ధోరణి.

'శీఘ్రం పోవటం' లాంటి మాట లేవో విన పడుతున్నాయి. మరోజంట ఎక్కేశారందులో. నాకు తలతీస్తున్నట్లుంది.

ఆజంటలోనమ్మాయికి భయంగావుంది. 'అమ్మో' అంటూంది. కాని భర్తవిల్లేదు అన్నాడు. "పార్వ యిల్లే" అన్నాడు. అంతే ఎక్కేసింది ఉత్సాహంగా యిల్లాలు!

నాహొళ్ళు మండి పోయింది.

ఇంతలో చిన్న చినుకులు పడ్డాయి.

జైంట్ వీల్‌గంట గణగణా మ్రోగుతోంది.

"రా, మాయా! ప్లీజ్!!"

ఆఖరి తొట్టెవొచ్చింది. ఎక్కేయాలి యింక లాభంలేదు. వెనకాతల యింకా జనంవున్నారు. ఎక్కేశాను.

"రా" అన్నాను. ప్రాధేయంగా జాలిగా, షడి మందిలో దానిమీదనుంచి గెంతేయలేక.

"నో" అంది మాయ. ఒక కాలు ఎత్తి తొట్టెలో వేయబోయినది. అంతలోనే అహంకారంతో వెనక్కి వెళ్ళిపోయింది.

జైంట్‌వీల్ తిరగసాగింది.

గెంతేద్దామనుకున్నాను. ఎవరో మిగతా "తొట్టె" ల్లో వాళ్ళు నవ్వుతున్నారు. కేరుతున్నారు. (నన్ను చూశా?)

మాయ ఉక్రోషంగా, కోపంగా దెబ్బతిన్న నాగులా వెళ్ళిపోతోంది.

పైన మేఘాలు చీకట్లలోవెల్తుర్ని కక్కుతున్నాయి. నగరం దీపాల శోభతో మరో ఆకాశంలా నక్షత్రాలున్నట్లు వెలుగుచుక్కలు పరుచుకుని వుంది. కళ్ళు తిరుగుతున్నాయి. మళ్ళీ ఒళ్ళు జోగుతోంది.

"జైంట్ వీల్" తిరుగుతోనేవుంది. వేగంవుంజాకుంది. కళ్ళు యింకా యింకా తిరుగుతున్నాయి. పైకి లేస్తున్నప్పుడు నగరం, క్రిందికి దిగుతున్నప్పుడు ఆకాశం.....దూరంగా దగ్గరగా మాయగా వుంది. అంతా......నా కింకా మాయ ముదురాకుపచ్చని చీరతో మాయా!.....కనపడుతున్నట్లేవుంది.

నేను జేబులో చెయ్యి తీసేశాను. ఇక యీ నాలుగు డబ్బులూ రాలితేనేం. నడిచి పోగలను..... లేదా తెల్లార్లూ యిలాగే యీ జైంట్‌వీల్‌లో..... నాకు వెలితిగావుంది. అంతా అసహ్యంగా,...... అదోలా ఉంది.

తిరుగుతున్న "జైంట్ వీల్" మీదనుంచి చూసిన మాయ ఎటుకేసి వెళిపోయిందో కూడా నాకు యిప్పుడు అంతు పట్టంలేదు.

మాయ వుంటే నిజంగా ఎంత 'థ్రిల్' ఉండేదిప్పుడు!


జైంట్ వీల్ ఆగింది కాబోలు. వాడు దిగమన్నదాకా నాకు తెలివే రాలేదు.

మళ్ళీ వాన అసహ్యంగా కురుస్తోంది. చిరాగ్గా వుంది. 'మాయ' వెళ్ళిపోయింది! ఇక బస్ దగ్గరికి వెళ్ళాలి. 'క్యూ'లో నిలబడ్డాను. కాళ్ళు పీకుతున్నాయి. బస్సు రాదు.....


"మాయా! మాయా! నువ్వుంటే హాయిగా నడిచేనా పోదుంగా."


"పాడు ప్రపంచం. పాడు. జీవితం పాడువాన. పాడు క్షయిమేట్! ఛీ! ఛీ!"

నాన్నగారి విచారం తొలగింది!













బాధ అనేది మాకు ఒక సమస్య...చూడండి మేము మీకు ఏవిధంగా సహాయపడతామో!

పరిశోధన: 'ఆస్ప్రో' యొక్క పరిశోధనా సంస్థలోని ఒక పరిశోధనా దళానికి నేను ఉపదేశకుడను. బాధను అపుజేయడానికి మంచి మంచి పద్ధతులను కనిపెట్టుటే మా పని. ఈ విషయమును గురించి ఏకాగ్రతతో ప్రపంచమంతటా పరిశోధనలు జరుపుతున్న అగ్రగణ్యమైన పరిశోధనా సంస్థలలో మేము ఒకరము. నొప్పిని నివారించుటకు నేడు క్రొత్త మార్గము 'ఆస్ప్రో' ఫార్ములా అని మేము తెలుసుకొన్నాము. అందుచేతనే ప్రపంచమంతటా డాక్టర్లచేతను, ఆసుపత్రులలోను ఇది వాడబడుతోంది.

బాధ అంటే ఏమిటి? మెటాబోలిక్ ఉత్పత్తులు, దేహము వాటిని తీసుకొని పోగలిగే కంటే హెచ్చు వేగములో, స్నాయువులలో కూడుకొని చేరి పోవడం వల్ల మరుగుపడిన వాపు కలుగుతుంది. దానితో నరములకు ఒత్తిడి కలిగి బాధ కలుగుతుంది.

'ఆస్ప్రో' ఎలా పనిచేస్తుంది: 'ఆస్ప్రో' దేహములో వెంటనే యిమిడి, వాపును, నరముల మీద వత్తిడిని తగ్గించి నొప్పిని వెడలగొడుతుంది.

'ఆస్ప్రో'ను ఈ వ్యాధులకు వాడండి: నొప్పి • తలనొప్పి • ఒంటినొప్పి • పంటినొప్పి • కీళ్ల నొప్పి • జ్వరముతో కూడిన జలుబు • ఫ్లూ • కీళ్ల నొప్పులతో గూడిన జ్వరము.

మోతాదు: పెద్దవారికి: రెండు బిళ్లలు. అవసరమైతే తిరిగి వేసుకొనండి. పిల్లలకు: ఒక బిళ్ల లేక మీ డాక్టరు సలహా ప్రకారము వాడండి.



'ఆస్ప్రో'
నొప్పిని వెడలగొడుతుంది!

A.Q. 19.65 TEL.

మద్రాసులో ఫాషన్ షో


రచన : మాధవ్

ఫొటోలు: టి. వి. కుమార్







ఫాషన్‌లకు పెట్టింది పేరు పారిస్. అక్కడ రోజు రోజుకీ ఫాషన్‌లు మారిపోతూ ఉంటాయట! ముఖ్యంగా వస్త్రాలు, వస్త్రధారణ విషయంలో మనం ప్రతిరోజూ ఎన్నో రకాల ఫాషన్‌లను చూస్తుంటాము. స్త్రీలలో విద్యా సంస్కారాలు పెరిగి, సమానహక్కులు లభించిన యీ రోజుల్లో ఫాషన్‌లు తరచు మారుతుంటాయంటే ఆశ్చర్య పడాల్సిన అవసరంలేదు.

స్త్రీలలో అన్ని వయస్సులవారూ రక రకాలుగా వస్త్రధారణ చేస్తారు. వారి వారి సాంప్రదాయాన్ననుసరించీ, సంస్కృతినిబట్టీ వేషధారణ విభిన్న రీతుల్లో ఉంటుంది. కొందరు చీరా, చోళీ ధరిస్తే మరి కొందరు స్కర్ట్లు, జాకెట్ వేసుకుంటారు. దక్షిణ భారతంలో పెళ్ళయేదాకా సాధారణంగా యువతులు పరికిణీ, జాకెట్ వేసుకుని, పైట వేసుకుంటారు. మరికొంతమంది కమీజు, గౌను వేసుకుంటారు. ఇలా వివిధ రకాలైన వేషధారణల్ని మనం ప్రతినిత్యమూ చూస్తూంటాము. ఏ వస్త్రానికైనా అందాన్ని తెచ్చేది దాన్ని రూపొందించే విధానంపై ముఖ్యంగా ఆధారపడి ఉంటుంది. కొత్త కొత్త ఫాషన్‌ల ననుసరించి తయారు చేయబడిన గుడ్డలకు, అందుకు సరిపోయే పద్ధతిలో కుట్టటం యింకా అందాన్ని చేకూరుస్తుంది.

పారిశ్రామికవేత్తలు, తయారు చేసిన వివిధ రకాల వస్త్రాలను గురించి పలుగురికీ తెలియటానికి ప్రకటనలతోబాటు ఫాషన్ షోలను కూడా ఏర్పాటు చేస్తుంటారు. ఈ ఫాషన్ షోలు వస్త్ర వ్యాపారాభివృద్ధికి సరైన సాధనాలనే చెప్పవచ్చు. ఫాషన్ ప్రదర్శనలు ప్రజలకు వస్త్రాలలోని వైవిధ్యాన్ని, కొత్త రకాలను, వాటిని వివిధ సంస్కృతులకు, అభిరుచులకు అనుగుణంగా ఎలా ఉపయోగించుకోవాలో తెలియజేస్తాయి.

బొంబాయిలోని ఫాన్సి కార్పొరేషన్ లిమిటెడ్‌వారు తాము తయారు చేసిన హకోబా ఎంబ్రాయిడరీ వస్త్రాలను ప్రదర్శించటానికి యిటీవల మదరాసులోని కన్నెమరా హొటల్‌లో ఫాషన్ షో ఏర్పాటు చేశారు.

ఈ వస్త్రాలలోని ప్రత్యేకతేమంటే, ఒక రకం గుడ్డపై వేరొక రకం నూలుతో పూర్తిగా కానీ, అక్కడక్కడ కానీ ఎంబ్రాయిడరీ చేయటం. అన్ని వయస్సులవారికీ నప్పే ఈ ఎంబ్రాయిడరీ రకరకాలుగా చేయబడి ఆకర్షణీయంగా ఉంది. అన్ని తరగతుల వారికీ, అందుబాటులో ఉండే విధంగా కాటన్ (నూలు) దగ్గరనుంచి నైలాన్‌శాటిన్ వరకూ అన్ని రకాల వస్త్రాలనూ వీరు తయారు చేస్తారు. అన్నీ ఎంబ్రాయిడరీ చేయబడి వింత శోభను సంతరించుకున్నాయి. ఈ ఫాషన్ ప్రదర్శనలో రక రకాల వేషధారణలను 'మోడల్' యువతులు చక్కగా ప్రదర్శించారు. ఆకర్షణీయమైన వస్త్రాలకు మోడల్ యువతులు మరింత అందాన్ని చేకూర్చి, ప్రేక్షకులకు కనువిందు చేశారు. ఈ ప్రదర్శనకి పత్రికలవారిని, ప్రముఖ వ్యాపారస్తులను, ఇతర పెద్దలను ఆహ్వానించారు నిర్వాహకులు. ఫాషన్ ప్రదర్శనలో మోడల్ యువతులు ధరించిన దుస్తుల రూపకల్పన చేసింది 'గ్లిప్డిన్.'


హాలీవుడ్ ప్రణయాలు

గాబ్రియర్

ఇరాన్ షాహ్ పట్టమహిషి సొరయాకి, హ్యూగ్ఓబ్రయన్‌కి పెళ్ళి కుదిరిందని వినగానే, ఆమెకు కూడా ఇతను నాతో ప్రవర్తించినట్లే ప్రవర్తించాడా, అనుకున్నాను.

"సొరయాకి - మోటు మనుష్యులంటే ఇష్టమేనా?" అని ప్రశ్నించుకున్నాను. "ఈ మోటు మనిషిని మచ్చిక చేసుకోగలదా?" అనిపించింది.

హ్యూగ్ గురించి నాకు తెలిసిన దాన్ని బట్టి చూస్తే అది జరిగే పనికాదనిపించింది.



మార్లన్ బ్రాండో

ఒకరాత్రి నేను ఇంటికి వచ్చేసరికి అతను నా పక్క మీద పడుకుని ఉన్నాడు. కప్పుకున్న దుప్పటి లాగేసి, కసితీరా తిట్టి బయటికి గెంటాను.

హ్యూగ్, పైకి వస్తున్న (వచ్చిన కూడా) నటీమణుల తోడుగా పార్టీలకీ, అక్కడికీ వెడుతూ ఉంటాడు. ఈ విధంగానే సొరయాని కలుసుకున్నాడనుకుంటాను. ఈ 'తోడు' మనుషుల ఖర్చులన్నీ స్టూడియో వాళ్ళే భరిస్తారులెండి . ..

ఈ రకంగా ఒక 'తోడు' (ఇంగ్లీషులో 'ఎస్కార్ట్') తో తిరిగితే వార్తాపత్రికల, సంస్థల ఫోటోగ్రాఫర్లు బొమ్మలు తీసి అమ్మాయీ, అబ్బాయీ పెళ్ళి చేసుకోబోతున్నారని చాటేస్తారు. ఇది పెద్ద ప్రచారం కదా! (హ్యూగ్‌తో వెడితే పెద్ద సంభాషణ ఏమీ ఉండదు హఠాత్తుగా మాత్రం ముందుకి వంగి, చిరునవ్వుతో "ఇవాళ బలే ఉక్కపోస్తోంది కదూ?" అని అడుగుతూ బుగ్గ నిమురుతాడు. ఏదో ప్రణయ సంభాషణ జరుగుతోందని అపోహ పడ్డవాళ్ళు ఫోటోలు తీసి, పుకార్లు లేవదీస్తారు సాధారణంగా హ్యూగ్, తక్కిన 'ఎస్కార్ట్' లూ కూడా ఫోటోగ్రాఫర్‌లు దగ్గిరగా కనిపించినప్పుడే ఈరకం నటన ప్రారంభిస్తారు ..) మామూలుగా 'తోడు' పురుషులకీ, నటీమణులకీ ఈ తతంగం వట్టి వ్యాపార సాధనం అని తెలుసు వారిద్దరి మధ్యా ఏవిధమయిన ప్రేమకీ అవకాశం ఉండదు హ్యూగ్‌తోనూ అంతే అనుకున్నాను కాని ఒకరాత్రి నన్ను ఇంటి దగ్గిర దిగబెట్టేసి తను వెళిపోకుండా, దాహంగా ఉందని పైకి వచ్చాడు. దాహం తీరిన తర్వాత వెళ్ళిపోతాడు గదా

హాలీవుడ్ ప్రణయాలు

గాబ్రియర్

అని నేను 'గుడ్‌నైట్' చెప్పి స్నానం గదిలోకి వెళ్ళిపోయాను. బట్టలు మార్చుకుని పడక గదిలోకి వెళ్లేసరికి హ్యాగ్ మంచం మీద ఉన్నాడు! ఆతర్వాత ఏంజరిగిందో ఇంతకి ముందే చెప్పాను. పాపం ఎంతో జాలిగా క్షమార్పణ కోరాడు........

స్టీవ్ కోక్రాన్ గురించి ఒకసారి మీకు చెప్పాను. అతను నిలకడ అసలే లేనిమనిషి. వూరికే ఆవేశంలో పడిపోతాడు. అతనికి ఒక లోయలో చిన్న 'గుడిసె' ఉంది. ఈ 'గుడిసె' నిజానికి చాలా సౌకర్యాలు కల భవంతి. అక్కడ చాలా ప్రణయగాథలు జరిగిపోతూ ఉంటాయి. అతనితో నేను ఎప్పుడూ అక్కడికి వెళ్ళక పోయినా, ఇతర ప్రదేశాలకి పార్టీలకి పోతూ ఉండేదాన్ని. ఒక రాత్రి నాకు టెలిఫోన్ చేశాడు—"గాబీ ఈ 'గుడిసె' లో మరో 20 స్నేహితు లున్నారు. పార్టీ చేసుకుంటున్నాము. నువ్వూ సరదాగా రారాదూ ?" ఇదంతా హాలీవుడ్ పద్ధతే కాబట్టి అనుమానించకుండా కారెక్కి స్టీవ్ 'గుడిసె' కి వెళ్ళాను. అక్కడికి చేరుకునేసరికి 'గుడిసె' బయట మరొక కారు కనిపించలేదు. స్టీవ్ నన్ను ఏడిపించటానికి ఆడిన పరిహాసమా అనుకుంటూనే తలుపు తట్టాను. ఎవరో 'లోపలికి రావచ్చు' అన్నారు కీచు గొంతుకతో.

లోపలికి వెళ్లాను. అంతా చీకటి.. "హలో !" అంటూ పిలిచాను. ఇంకా లోపలికి వెళ్లాను. అమాంతంగా ఎవరో నన్ను పట్టేసుకుని దగ్గిరకి లాక్కున్నారు. అది ఎవరో కాదు, స్టీవ్, అని గ్రహించాను. శక్తికొద్దీ పోట్లాడాను. పోట్లాడుతున్నంత సేపూ 'లోపలికి రావచ్చు, లోపలికి రావచ్చు!' అనే గొంతుక వినపడుతూనే ఉంది.

నేను ఎదురు తిరుగుతానని అనుకోని స్టీవ్ నేను గోళ్లతో రక్కగానే పట్టు వదిలాడు. తలుపు వయిపు పరిగెత్తాను. అప్పుడు కంటి కొనతో 'లోపలికి రావచ్చు!' అని అరుస్తున్న పెద్ద, రంగుల చిలక నొక దానిని చూశాను. దానికి మంచి తరిఫీదు ఇచ్చాడన్నమాట స్టీవ్.

ఎలాగో కారు చేరుకుని ఇంటికి వెళ్లిపోయాను.

ఈ సంఘటనతో నా కీర్తి హాలీవుడ్ అంతా పాకిపోయింది. దానికి తోడు మార్లన్ బ్రాండోతో మరొక సంఘటనలో ఇరుక్కున్నాను.

"శామోనారా" అనే సినిమాలో అప్పుడు మార్లన్ వేస్తున్నాడు. షూటింగ్ వచ్చి చూడమని ఎవరో పిలుచుకు వెళ్లారు నన్ను.

షూటింగు జరుగుతున్నంతసేపూ బ్రాండో ఎంతో చక్కగా ప్రవర్తిస్తాడు. దర్శకుడు చెప్పిన మాట వింటాడు.

కాని బయటికి వచ్చాడో—అది వేరే కథ!

షాట్ అయిపోగానే ఇవతలికి వస్తూ నన్ను చూశాడు. నేరుగా నా దగ్గిరకి వచ్చేసి, "నీ ఫోన్ నెంబర్ ఎంత పాపాయి ?" అని అడిగాడు.

నాకు వళ్లు మండింది. "నీది చెప్పు, ముందు!" అన్నాను.

ఒక క్షణం మాట రాలేదు బ్రాండోకి. "కాని, నా నెంబర్ ఎవరికీ చెప్పనే!" అన్నాడు.

"నేను చెప్తానులే, కాని మర్యాద తెలిసిన వారికి మాత్రమే" అంటూ తిరిగి వెళ్లిపోయాను.

హాలీవుడ్‌లో చాలామంది ఫ్రెంచి అమ్మాయిలని గురించి చాలామందికి ఏవేవో అభిప్రాయాలు ఉండేవి. దీనికి వారే కొంత కారణం కూడా. కాని నాకు ఆరకం 'పేరు' రావటం ఇష్టంలేదు. వీలయినంతదాకా నా మంచిపేరుని కాపాడుకునేదాన్ని. ఇంకోటి ఏమిటంటే, పుకార్లు ఎన్ని పుడుతున్నప్పటికీ హాలీవుడ్‌లోనూ, ఆడవారు తమని ఫలానావారు 'ఉంచు' కుంటున్నారంటే ఇష్టపడరు. ఇది ఎందరికో తెలీదు! హాలీవుడ్ కీర్తి అటువంటిది, మరి.

పెళ్లికాని నటులు దీర్ఘకాల ప్రణయాలకి ఇష్టపడరు. మరీ విచ్చలవిడిగా తిరుగుతున్నవారి కాంట్రాక్టులని రద్దు చెయ్యటానికి ప్రయత్నిస్తారు ప్రొడ్యూసర్లు.

పెళ్లయిన మగవారి సంగతి సరేసరి. కాలిఫోర్నియా రాష్ట్రంలో వ్యభిచారం పెద్ద నేరం. అమెరికాలో అంతా వ్యభిచారం నేరమే. మీకు తెలుసో, తెలీదో కాని పెళ్లాం, పిల్లలు కల ఒక వ్యక్తి ఈ రకం ఇరుకులో చిక్కుకుంటే ఎటువంటివాడయినా ఆర్థికంగా నాశనం అయిపోవచ్చు.

ఒక గొప్ప అమెరికన్ నిర్మాత—అతని పేరు మీకు చెప్ప నవసరంలేదు— హాలీవుడ్‌లో ఫ్రెంచి అమ్మాయిలతో ఇరుక్కుని, చాలా యిబ్బందులకి లోనయి, చివరికి యూరోప్‌కి వలస వెళ్లిపోవలసి వచ్చింది. యూరోప్‌లో సొదా సినిమాలు తీస్తున్నాడు....

ఈ చిక్కులన్నీ ఉండటం చేతనే హాలీవుడ్‌లో వ్యభిచార గృహాలు మంచి వ్యాపారాలు చేస్తాయి. ఒకవేళ చిన్నరకం నటీమణులు తమకి మంచి అవకాశం రావచ్చునని తమ దేహాలని అమ్ముకొన్నా ఈరకం గొడవలకి భయపడి పెద్దమనుషులు చాలా మంది సహాయం చెయ్యనే చెయ్యరు! సంబంధాలు బయట పడటం ప్రమాదకరం కదా.... (సశేషం).

తెలుగు తెరకు...భారతి!

ప్రాణేశ్వరి అవుతుందనుకుంటూ.

ఒకనాటి శుభ సమయాన అదృష్టం వెతుక్కుంటూ వచ్చింది. ప్రముఖ కన్నడ చలన చిత్ర కథానాయకుడు శ్రీ కళ్యాణకుమార్ వచ్చి 'నీవు సినిమాలో నటిస్తావా?' అని అడిగేరు. ఆమె 'సరే' నంది.

* * *

ఆమె ఎవరో కాదు. భారతి. ఆ భారతి యీనాడు వెండితెరపై వెలుగుతుంది. భారతి బెంగుళూరులో జన్మించింది. తల్లిదండ్రులు అక్కడే స్కూలులో ప్రవేశపెట్టారు. భారతి చదువుతూ ఇంట్లో రేడియో దగ్గర నాట్యం చేయడం ప్రారంభించింది. నాట్యంలో భారతి చూపిన శ్రద్ధ తల్లి భద్రావతి బాయి, తండ్రి రామచంద్రన్‌గార్లకు ఆశ్చ



ర్యం కలిగించింది. నాట్యాచార్య 'ధనలక్ష్మి' గారివద్ద నాట్యం నేర్పించారు. మణిపురి, తంజావూరు వగైరా నాట్యములు అన్నీ క్షుణ్ణంగా నేర్చుకోవడం జరిగింది. కళాశాలలో పి. యు. సి. కూడా పూర్తి అయింది. కళాశాలలో కూడా నృత్య ప్రదర్శనలు యిచ్చింది భారతి.

భారణి పిక్చర్సువారు క్రొత్తగా కన్నడ చిత్రాలు ప్రారంభించిన రోజులు. క్రొత్త కథానాయిక గురించి వెతుకుతున్నారు. కన్నడ నటుడు శ్రీ కల్యాణకుమార్ షూటింగ్ గురించి బెంగుళూర్ వెళ్ళారు. శ్రీకళ్యాణ కుమార్ మిత్రులు కుమారి భారతి ఫొటోలు చూపించారు. మిత్రులు శ్రీ కుమార్ కలసి భారతి యింటికివెళ్ళి 'సినిమాలో నటిస్తావా?' అని అడిగేరు. తల్లి దండ్రుల అనుమతితో 'సరే' అంది. భారణి పిక్చర్సు వారి కన్నడచిత్రం 'లవ్ యిన్ బెంగుళూర్' చిత్రంలో కథానాయికగా నటించడానికి మదరాసు వచ్చింది భారతి.

మదరాసు అడయార్‌లో సత్యాస్టూడియో ఒక ఫ్లోర్‌లో పెద్ద సెట్ కెమేరా ముందు నిలిచిన భారతికి లైటు, కెమేరా, వాతావరణంచూసి కాస్త భయం కలిగింది. నృత్య దర్శకులు 'చిన్నీ—సంపత్' భారతికి ధైర్యం చెప్పి నాట్యం చేయించారు. సంభాషణలు పలికించారు. మాటలు పలికిస్తూ, నటింపజేశారు. మొదటిరోజు, రెండవరోజు, మరోరోజు గడిచింది. భయం పోయింది. షూటింగ్‌కు ముందుగావచ్చి సంభాషణలు వల్లించుకుంటూ, తను వేయబోయే నటనను నెమరు వేసుకుంటూ సెట్లో కూర్చొంటుంది.

'ఏమండీ అన్ని నాట్యాలు నేర్చుకున్నాను, అన్నారుకదా! మీరు కూచిపూడిచేయగలరా?'

'మంచి ప్రశ్నవేశారు. నిజానికి కూచిపూడి నేర్చుకోలేదు. అలా అని చేయలేనని కాదు. నృత్య దర్శకుడు ఎదురు నిలిచి ఒక్కసారి సలహాలిస్తేచాలు చక్కగాచేసి చూపించగలను'' అంది నవ్వుతూ భారతి.

కన్నడ భారతి అన్నారు కొందరు; మళయాళసుందరి అన్నారు కొందరు. తమిళతార అన్నారు మరికొందరు. 'అబ్బే' తెలుగుదే అన్నారు ఫిలిం పరిశ్రమలోని మరికొంత మంది ప్రముఖులు.

భారతి అసలు మహారాష్ట్ర యువతి. పుట్టింది, పెరిగింది, చదివింది బెంగుళూరులో. కన్నడం కూడా చదివింది. అంతే. అంతమాత్రాన కన్నడ యువతి ఎలా అవుతుంది? తెలుగు, తమిళం, హిందీ, కన్నడం, మళయాళం, ఆంగ్లం, మహారాష్ట్ర భాషలు మాట్లాడగలదు.

భారతి నటించిన కన్నడ చిత్రాలు నాలుగు విడుదల అయినవి. మరో రెండు రాబోతున్నాయి. తెలుగులో 'ప్రచండభైరవి'లో నటించింది. అది మొదటిచిత్రం. రామకృష్ణా, ఎన్. ఏ. టి. కంబైన్సువారి 'శ్రీ కృష్ణపాండవీయం' ఆమె రెండవ తెలుగు చిత్రం. ఈ రెండు చిత్రాలు విశాలాంధ్రలో విడుదల చేశారు.

భారతి నాట్యం, నటన చూసిన మరి కొంతమంది నిర్మాతలు కథానాయికగా ఎన్నిక చేసుకున్నారు. ఎన్. ఏ. టి. వారి తదుపరి చిత్రంలో కథానాయికగా నటించబోతుంది. శ్రీ విఠలాచార్య చిత్రంలో నాయికగా ఎన్నిక అయింది. ప్రస్తుతం హైదరాబాద్ మూవీస్‌వారి 'అర్ధరాత్రి' చిత్రంలో కథానాయికగా నటిసుంది. తమిళంలో పద్మిని పిక్చర్సు, సర్వతా పిక్చర్సు వారి చిత్రాలలో శ్రీ ఎం. జి. రామచంద్రన్‌తో కథానాయికగా నటిస్తుంది.

భారతికి సంగీతంలోకూడా ప్రవేశముంది. సాంఘికసేవ అంటే భారతికి చాల సరదా. సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొనటం అంటే మక్కువ ఎక్కువ. నేషనల్ డిఫెన్సు ఫండ్‌కు మదరాసు హబిబుల్లారోడ్‌లోని 'రామారావు మండపం'లో నృత్య ప్రదర్శన యిచ్చింది.

నటన, నాట్యంతోపాటు వినయంకూడా ఆమెకు చిన్నప్పటినుండి నేర్చుకున్నదే. పరిశ్రమలో కథానాయికగా ప్రవేశించి, తెలుగు, తమిళ, చిత్రాలలో ముఖ్యమైన సంస్థలలో ప్రధాన కథా నాయకుల ప్రక్కన చాల తక్కువ కాలంలో నటించడానికి అవకాశం కలగడం గొప్ప విశేషం. భారతికి మంచి భవిష్యత్ ఉన్నదని, తెలుగు తెరకు మరో తార లభించడం సంతోషించవలసిన విషయమే.

—శర్మాజీ

సినిమా వార్తలు

ఆత్మగౌరవం

అన్నపూర్ణ పిక్చర్సువారు తాజాగా నిర్మించిన 'ఆత్మ గౌరవం' చిత్రాన్ని యీ నెలలో విడుదల చేస్తున్నారు. ఈ సంస్థలో చాలా చిత్రాలకు సహకార దర్శకునిగా పనిచేసిన శ్రీ కె విశ్వనాథ్ యీ చిత్రానికి దర్శకత్వం వహించారు. కూచిపూడి నృత్యంలో ఆరితేరిన శ్రీమతి సుమతి కౌశల్ ఈచిత్రంలో ఒక నృత్యానికి దర్శకత్వం వహించారు ఈ నృత్యంలో కాంచన, రాజశ్రీ పాల్గొన్నారు శ్రీమతి సుమతి కౌశల్ ప్రముఖ చలనచిత్ర నృత్య దర్శకులు శ్రీ వేదాంతం జగన్నాథం శర్మగారి శిష్యురాలు.

ఈ చిత్రంలో నాగేశ్వరరావు, గుమ్మడి, రేలంగి, చలం, అల్లు రామలింగయ్య,రాజశ్రీ, కాంచన, సూర్యకాంతం మొదలగువారు నటించారు. వాసంతి గెస్ట్‌గా నటించారు.

ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం యస్ రాజేశ్వరరావు వహించారు. నిర్మాత శ్రీ దుక్కిపాటి మధుసూదనరావు.

అరుణాచల 'స్త్రీ'

అరుణాచలవారి చిత్రం 'స్త్రీ' యీమధ్య షూటింగ్ వారి స్వంత స్టూడియో అరుణాచల స్టూడియోలోనే జరిగింది. హాస్పిటల్ సెట్టు వేశారు ఈ సెట్టులో ఎన్. టి. రామారావు, దేవిక, వాసంతి, రమణారెడ్డి, హేమలత మొదలగువారున్నారు.

ఇంకా యీ చిత్రంలో రమణమూర్తి, పద్మనాభం, గీతాంజలి మొదలగువారున్నారు.

సంభాషణలు పినిశెట్టి శ్రీరామమూర్తి వ్రాశారు. సంగీతం : టి. చలపతిరావు. నిర్మాత, దర్శకత్వం పి. కె. నేలన్.

ఉగాదినాడు రెండు తెలుగు చిత్రాలు

ఉగాది పండుగ రోజున రెండు చిత్రాలు విడుదల అవుతున్నాయి. రెండు చిత్రాల లోను కథా నాయకుడుగా ఎన్. టి. రామారావు నటించారు

ఇవి శ్రీ దేవి ప్రొడక్షన్సువారి 'పరమానందయ్య శిష్యులకథ'. మరొకటి రాజ్యం పిక్చర్సువారి 'శకుంతల'

పరమానందయ్యశిష్యుల కథలో నంది వర్ధన మహారాజుగా ఎన్. టి. రామారావు నటించారు. పరమానందయ్యగా పద్మశ్రీ నాగయ్య నటించారు. ఇంకా ముక్కామల, వంగర, పద్మనాభం, రాజబాబు, అల్లురామలింగయ్య, మోదుకూరి సత్యం, కె. ఆర్. విజయ, ఎల్. విజయలక్ష్మి, ఛాయాదేవి మొదలగువారు నటించారు. శోభన్‌బాబు గెస్ట్‌గా శివుని పాత్ర పోషించారు.

ఈ చిత్రానికి రచన శ్రీ సదాశివబ్రహ్మం, సంగీతం ఘంటసాల నిర్వహించారు. నిర్మాత తోట సుబ్బారావు. దర్శకత్వం : పి.పుల్లయ్యగారు వహించారు.

రెండవది రాజ్యం పిక్చర్సువారి 'శకుంతల' ఈ చిత్రంలో శకుంతలగా బి సరోజా దేవి, దుష్యంతుడుగా ఎన్. టి. రామారావు, భరతుడుగా బేబి పద్మిని నటించారు.

ఇంకా యీచిత్రంలో పద్మశ్రీ నాగయ్య, రేలంగి, రమణారెడ్డి, ముక్కామల, పద్మనాభం, శారద, ఇ. వి. సరోజ, నిర్మల, పుష్పవల్లి మొదలగువారు నటిస్తున్నారు.

ఈ చిత్రానికి సంభాషణలు శ్రీ సముద్రాల రాఘవాచార్య వ్రాశారు పాటలు—సముద్రాల రాఘవాచార్య, ఆరుద్ర, సి. నారాయణరెడ్డి, కొసరాజు, శ్రీ శ్రీ, దాశరథి వ్రాశారు సంగీతం—ఘంటసాల, దర్శకత్వం కె కామేశ్వరరావు వహిస్తున్నారు నిర్మాతలు—శ్రీధరరావు, లక్ష్మీరాజ్యం.

పాదుకాపట్టాభిషేకం

అమరావతి చిత్రవారు తొలిసారిగా 'పాదుకా పట్టాభిషేకం' చిత్రం పూర్తి చేస్తున్నారు. శ్రీరామ నవమి ఉత్సవ రోజుల్లో విడుదల చేయాలని యీ చిత్ర నిర్మాత శ్రీ పి ఆర్. రెడ్డి అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రానికి ఘంటసాల సంగీతాన్ని సమకూర్చారు.

ఈ చిత్రంలో కాంతారావు, శశికాంత్, కృష్ణకుమారి, జయంతి, మిక్కిలినేని, రమణారెడ్డి, ధూళిపాళ, కాశీనాథ్ తాతా, హరనాథ్, మల్లాది, బాలయ్య, వంగర, సూర్యకాంతం, లీలావతి, విద్య, వాణిశ్రీ మొదలగువారు నటిస్తున్నారు.

—ధర్మాజీ ●



విజయవాడ శ్రీ లక్ష్మి టాకీసులో 'ఆడబ్రతుకు' శతదినోత్సవం సందర్భంలో శ్రీమతి బృహస్పేంద్రమణి, కుమారి దేవిక, శ్రీ ఎన్. టి. రామారావు. (ఫోటో: ఎమ్. ఏ. మోహన్‌రావు)

నోసిన్

మరింత శక్తిమంతమైన
బాధానివారిణి మాత్రమేగాక
మరింత సురక్షితమైనదికూడా!

తలనొప్పి, ఊపిరికట్టు, నరాలబాధ, గుండెజలుబు, మెడపట్టు, ఇంకా అనేక ఇతర రకాల కండరాల బాధలను త్వరితంగా నోసిన్ నివారించగలదు. అధునాతనమై, తేలికగా వాడడానికి వెసులుబాటుగా వుండేటట్టు ట్యూబ్‌లో నోసిన్ వున్నందున, అంతా అయిపోయేవరకు దాని శక్తి తగ్గకుండా వుండడమేగాక, పారుపోక, అటివస్తుంది.

నోసిన్ తో బాధపోయిందనండి
ఇది శక్తిమంతమైనది

కండరాలనొప్పా? వాడండి
ఐయోడిమా ఆయింట్‌మెంట్
రుద్దగానే బాధ తొలగుతుంది - మరకలుండవు - మంటలెత్తవు

దికలకత్తా కెమికల్ కం. లి.
కలకత్తా - 29

(CLC-4 TE)

తెల్లమచ్చలు

విచారపడవద్దు. తెలుపు, ఎరుపు, లేక ఏ రకమైన మచ్చలను శీఘ్రముగా, సులభముగా, కొద్ది రోజులలో చక్కగా పరిశోధింపబడిన మా ఆయుర్వేద ఔషధము స్వస్థపరచును. ఈ ఔషధము వేలాది ప్రజలచే ప్రశంసించబడింది. ఒక సీసా వెల రు. 10/- లు మాత్రమే.

Shri Girja Prasadje Vaid (129)
P.O. Katrisarai (Patna)

ఎంబ్రోసియా వారి
డ్రింకాల్



పలురకముల పళ్ళరసములతో తయారుచేయబడినది

ఎంబ్రోసియా
క్యానింగ్ ఎంటర్‌ప్రైసెస్,
పోస్టుబాక్స్ నెం-543, విజయవాడ-3.



మీకు పడుటలేదా?

చాల మందికి అన్ని ఆహార పదార్థములు వారి జీర్ణకోశములకు పడవు. పుల్లత్రేపులు, కడుపుమంట, అజీర్ణము కలుగజేయును. అప్పుడు మీకు తప్పక ఫిలిప్స్‌వారి మిల్క్ ఆఫ్ మెగ్నీషియా కావలెను.

ఆహారము మీ జీర్ణకోశమును పాడుచేసిన దనుకోండి! ఫిలిప్స్ క్షణములో కడుపుమంట, అజీర్ణము, త్రేపులను నివారించును.

ఫిలిప్స్ నెమ్మదిగ, సులువుగ పూర్తిగ మీ జీర్ణకోశమును సరియైన మార్గములో పెట్టును. అందుచేత ఎప్పుడైనా విందు భోజనములు తిన్నప్పుడు, త్వరపడి ఫిలిప్స్‌వారి మిల్క్ ఆఫ్ మెగ్నీషియా తీసుకోండి! అంతే! అది సరిచేయును!



ఫిలిప్స మిల్క్ ఆఫ్ మెగ్నీషియా

మాన్యుఫాక్చరర్ : రిజిస్టర్డ్ యూజర్ డేస్ మెడికల్ స్టోర్సు (మా) ప్రైవేట్ లిమిటెడ్ 62, బండెల్ రోడ్, కలకత్తా-19

Edited Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6&7Thambu chetty Stree Madras-1. Phones : Editorial. 21747; Other depts : 29766. Chief Editor: S. Sambhu Prasad.

